ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రిక



4 అణాలు

16-5-'56

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



వెలూరు, శ్రీ జలకంఠేశ్వరాలయ ముఖద్వారం

—ఫొటో : శ్రీపాద శంకరన్న, కడప.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

సంపుటము 40
సంచిక 37
16.5-56

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

దుర్ముఖి వైశాఖ సప్తమి బుధవారం



విదా హమేతుం

—ఫోటో: కె. రామారావు, రాజమండ్రి.


విషయానుక్రమణిక

ముఖచిత్రం:

అర్. కె. ఫిలిమ్స్‌వారి

"జాగ్ తే రహో" లో సుమిత్ర.

ఢిల్లీ లేఖ—	3
అరుణవలయం—ఎడ్గార్ వాలెస్	6
మహాప్రస్థానం—పి. గణపతిశాస్త్రి	10
పథేర్ పాంచాలి (సీరియల్)— విభూతిభూషణ్ బెనర్జీ	13
కథ:—మధురాంతకం రాజారాం	20
సినిమా—	30
ఒకటి, రెండూ, మూడూ—పంతుల శ్రీరామశాస్త్రి	37
వనితాలోకం—ఇల్లిందల సరస్వతీదేవి	42
అందమైన విగ్రహం—ఆస్కార్ వైల్డ్	45
సాగరగర్భంలో సాహసయాత్ర— (సీరియల్) జూల్స్‌వెర్న్	49
[illegible] —పి. వి. యస్. రామయ్య	53



న్యూఢిల్లీ లేఖ

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చివరిదాకా జరుగుతూ వచ్చిన ఆందోళనకు ఎక్కువ బాధ్యత వహించవలసినది 'ప్రజాస్వామ్యంలో తిరుగులేని నిర్ణయాలుండవు' అనే సిద్ధాంతాన్ని పట్టుకుని ఊరేగుతున్నవారు. ఈ సిద్ధాంతం కొంతవరకూ రైటయినా, ప్రజాస్వామికంగా చేయబడిన కొత్తనిర్ణయాలు వచ్చేవరకూ పాతనిర్ణయాలు అమలులో ఉంటాయి. అంటే తాత్కాలికంగా నయినా ప్రజాస్వామ్యంలో కూడా తిరుగులేని నిర్ణయాలంటూ ఉంటాయన్నమాట. రాష్ట్రాలలో ముఖ్యమంత్రులను మార్చినట్లే భారత ప్రధానమంత్రిని కూడా ఏ క్షణానైనా మార్చవచ్చును. కాని అధికారంలో ఉన్న పార్టీ మరొక నాయకుణ్ని ఎన్నుకొనేవరకు ఆ ప్రధానమంత్రి మాట చెల్లవలసిందే. ఒక ప్రధానమంత్రిని ఎన్నుకున్న వెంటనే, ఆ ప్రధానమంత్రి ఎన్నిక తిరుగులేనిది కాదని ప్రచారం చెయ్యడం మొదలెడితే అరాజకం ఏర్పడుతుంది. అటువంటి ప్రచారంవలన అంతర్విభేదాలు హెచ్చుమీరిపోయి ప్రభుత్వస్థిరత్వానికి భంగం కలుగుతుంది.

బొంబాయినిగూర్చి రాష్ట్ర పునర్వ్యవస్థీకరణసంఘం సమర్పించిన నివేదిక విషయంలో ఇటువంటిదే జరిగింది. అసలు ఈ నివేదిక సమర్పించినప్పటినుండి అన్నీ అవకతవకలే జరిగాయి. ఈ నివేదికను ఆయా పక్షాల అంగీకారముతో ఎప్పుడైనా సవరించడానికి వీలున్నది. మహారాష్ట్ర ప్రాముఖ్య నాయకుల బాధ్యతారహిత ప్రసంగాల మూలంగా, వారినుండితమకు రక్షణకావాలని బొంబాయిలోని అల్పసంఖ్యాకులు మొదటినుంచీ ఆందోళన చేస్తున్నారు. ఈ అల్పసంఖ్యాకులను మెల్లిగా తమవైపు తిప్పుకునే అవకాశం మహారాష్ట్రులకు కలిగించడంకోసం బొంబాయిని ద్విభాషా రాష్ట్రముగా ఉంచాలని పునర్వ్యవస్థీకరణసంఘం సూచించింది.

మహారాష్ట్ర ప్రాముఖ్య నాయకులు అవలంబించిన విపరీతపంథా ఫలితాలు ఇప్పుడు అందరికీ తెలిసినవే. బొంబాయిగురించి ఒక నిర్ణయం చేయడం జరిగిన తరవాత కూడా, బాధ్యతాయుతులైన కాంగ్రెసు నాయకులు ప్రజాస్వామ్యంలో అంతిమనిర్ణయం ఏదీ లేదని నినాదం లేవదీయడం శోచనీయం. దీనివలన మళ్ళీ కొత్త ఆందోళన, ఒత్తిడిచేసి నిర్ణయం మార్పించాలనే ధోరణి బయలుదేరాయి.

నిర్ణయాలు అంతిమనిర్ణయాలని తేలిపోయిన తరవాత ఆ నిర్ణయాలను ఏదేశంలోనైనా, ముఖ్యంగా భారతదేశంలో ప్రజలు మన్నించి వ్యవహరిస్తారు. ఇటీవల కలకత్తా రేవు కార్మికులు సంఘవ్యతిరేకచర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం అసాధారణ పరిస్థితి ఏర్పడినట్లు ప్రకటించి కఠినంగా వ్యవహరించింది. కార్మికుల సమ్మె నలిపి వేయబడింది. ఇలాంటి కఠిన చర్య ఏమీ

శ్రీ కృష్ణ

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

తీసుకోనందున బ్యాంకి ఉద్యోగులవర్గంలో ఆందోళన చల్లారిపోకుండా ఇంకా జ్వలిస్తూనే ఉంది. ప్రజాస్వామ్యం పేరుతో మరీ మెతకగా వ్యవహరించడంవల్లనే మహారాష్ట్రులు మొండిగా పట్టినపట్టు విడవకుండా వాదిస్తున్నారు.

మహారాష్ట్ర కాంగ్రెసువాదులలోని క్రమశిక్షణారాహిత్యం ముందు ముందు చాలా అనర్థాలకు దారితీయ గలదు. స్వాతంత్ర్యానికి పూర్వం పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు బొంబాయి లాయరు కాక మరెవరైనా అయివుంటే భారతదేశ చరిత్ర మరొక విధంగా మారివుండేదని చెబుతారు. భూలాభాయ్ దేశాయ్, జిన్నా అదివరకే బొంబాయి కోర్టులో ఘర్షణపడి ఉన్నారు. ఆ ఇరువురూ విధివశాత్తు మళ్లీ కేంద్ర శాసనసభలో కలుసుకుని ఒకరినొకరు ఎదుర్కొన్నారు. కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ ఢేబర్ భాయ్‌ను గూర్చికూడా భావి చరిత్రకారులు ఇదే మాదిరిగా అభిప్రాయపడవచ్చును. ఆయన గుజరాతీవాడు కనుక బొంబాయి నిర్ణయం విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని మహారాష్ట్రులు ఆరోపిస్తున్నారు. శ్రీ ఢేబర్ సమస్య చిత్రమైనది. ఆయన మహారాష్ట్రులపై చర్య తీసుకోలేక పోయారు కనుక ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలోని కాంగ్రెసు తిరుగుబాటుదార్లపై కూడా చర్య తీసుకోడానికి వీలులేదు. శ్రీ పార్మార్ హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెసు శాసనసభ్యులు కొందరి సహాయంతో శ్రీ ఢేబర్‌ను ఎదిరించి, ఇప్పుడు శ్రీ పంత్ సహాయంకోసం ఎదురు చూస్తున్నారు. ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సుభద్రాజోషి తన రాజీనామా నింకా ఉపసంహరించుకోలేదు. వీరు క్రమశిక్షణ విరుద్ధంగా ప్రవర్తించడం వారికి లాభించింది. శ్రీ గోవిందవల్లభ్ పంత్ బిల్లులో మార్పులు చేశారు. ఈ మార్పులవలన క్రమశిక్షణ వ్యతిరేక సంప్రదాయం బాగా బలపడుతుంది.

ఫజల్ అలీ మళ్ళీ గవర్నరు అయ్యారు. పూర్వవాగ్దానాన్ననుసరించే ఆయన గవర్నరు అయ్యారని కొందరంటున్నారు. హిమాచల్ ప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగానే ఉంచాలని ఆయన తమ సంఘ నివేదికలో వేరే ఒక స్వంత సూచన చేశారు.

* * *

పార్లమెంటులో ప్రశ్నోత్తరాల కాలం చాలా ఉపయోగకరంగాను, ఉత్సాహకరంగాను ఉండేది. మంత్రిగారి సమర్థతకు అది కొలబద్దగా ఉండేది. పూర్వం కీ. శే. సత్యమూర్తికి, మంత్రివర్గ సభ్యులకు మధ్య జరిగిన వాదోపవాదాలు వారి మేధాశక్తికి నిదర్శనంగా ఉండేవి. ఇక సింధురాష్ట్రం నుంచి వచ్చిన లాల్‌చంద్ నవల్‌రాయ్, సిధ్వాలు రోజూ కనీసం ఐదు ప్రశ్నలు వేసి విసుగు పుట్టించేవారు. దరిమిలా వీరికి మూడు ప్రశ్నలు మాత్రమే వేసేందుకు అనుమతి లభించింది. రోజూ ఎవరెన్ని ఎక్కువ ప్రశ్నలు వేయాలో నిర్ణయించేందుకు చీట్లు కూడా వేసిన రోజులున్నాయి. ప్రశ్నో

★ న్యూఢిల్లీ లేఖ ★

కాలంలో సభాభవనం, ప్రేక్షకుల గ్యాలరీలు క్రిక్కిరిసి ఉండేవి.

ప్రయోజన ఓటింగ్ హక్కుతో ఈ పరిస్థితి మారిపోయింది. లాల్ చంద్ నవల్ రాయ్‌వంటి వారింకా పార్లమెంటులో ఉన్నారు. కాని ఆ రోజుల్లోని ఉత్సాహం, గౌరవ ఇప్పుడులేవు. ప్రశ్నల జాబితాలో కనిపించే పృచ్ఛకులలో సగంమంది స్పీకరు తమ పేర్లు పిలిచేసమయానికి గైరుహాజరై ఉంటారు. అటువంటివారు తమ తరఫున ప్రశ్న వేయడానికి మరొకరికి అధికారం ఇచ్చి అయినా వెళ్లరు.

ప్రతిప్రశ్నకు కొంత ప్రజాధనం వ్యయమవుతుందన్నమాట గుర్తించాలి. స్వాతంత్ర్యానికి పూర్వం రోజుల్లో ఒకప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి సగటున రూ 75/- ఖర్చుఅయ్యేది. ఇప్పుడు ఏ వందవరకో పెరిగి ఉంటుంది. లోక్ సభ ప్రస్తుతసమావేశంలో మే 2వ తేదీవరకూ మొత్తం 8607 ప్రశ్నలు నివేదించబడినవి. వీటిలో 1893 మాత్రమే నిజంగా సమాధానం పొందినవి ఉన్నాయి. ఒక్కొక్క ప్రశ్నకు సగటున వందరూపాయల ఖర్చు వేసుకుంటే మొత్తం 860,,700 రూపాయలు వ్యయమైందని లెక్క కట్టవచ్చును.

* * *

శ్రీ చింతామణ్ దేశ్ ముఖ్ రాజీనామా మీద, ఆయన ఆఫీసుపనికి హాజరుకాకపోవడంమీద వెలువడిన వ్యాఖ్యలు నేను ఈమధ్య చూశాను. కేంద్ర విద్యామంత్రి రాజీనామా అయినా పెట్టకుండా ఆఫీసు ఎగవేస్తున్నారన్న సంగతి మాత్రం ఎవరూ ఎందుచేతో గుర్తించలేదు. మౌలానా అజాద్ కొన్నివారాలుగా పార్లమెంటుకు హాజరు కావడంలేదు. ఏస్వాగతపు విందుల లాంటివాటికో ఆయనపేరుమీద ఆహ్వానాలు వెళ్ళినా ఆయనబదులు మరెవరో విందు నడిపిస్తారుగాని ఆయన హాజరు కావడంలేదు. విద్యామంత్రి వింతప్రవర్తనకు కారణం ఏమీ బోధపడడంలేదు.

జబ్బు మంత్రులు రాజీనామా ఇవ్వకుండా పదవికే అంటిపెట్టుకుని ఉండడం పరిపాటి అయింది. ప్రభుత్వలాంఛనాలతో అంత్యక్రియలు జరిపించుకోవాలనే కోరిక బలీయమైనది. కేంద్ర కాంగ్రెసు మంత్రులు భావితరాలవారికికూడా సంప్రదాయాలు ఏర్పరిచేస్తున్నారు.

* * *

భారత ప్రభుత్వపు ఖర్చుమీద మధ్య ప్రాచ్యంలో పర్యటించి, డా॥ సయ్యద్ మహమూద్ (బీహారు) న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. వీరి పర్యటనకు కావలసినంత ప్రచారం లభించింది. ఈయనఇప్పుడు మధ్య ప్రాచ్యంమీద నిపుణుడుగా పరిగణింపబడుతున్నాడు. బొంబాయిలో ఈయన చేసిన ప్రసంగం, న్యూఢిల్లీలో అధికారికంగా వెలువడిన ప్రకటనచూస్తే, మామూలుగా పత్రికలు చదివే ఏ పాఠకునికైనా ఆమాత్రం భోగట్టా తెలియకపోదని అనిపిస్తోంది. అయితే ఆయన పర్యటనకు ఖర్చయిన ప్రజాధనమంతా వృథా అయిందన్నమాటే. అభివృద్ధి కార్యక్రమాలను భారీఎత్తున తలపెట్టిన భారతదేశానికి ప్రతి దమ్మిడీ ఇప్పుడు ఎంతో విలువైనదని విదేశాంగశాఖ గుర్తిస్తున్నట్లు కనబడదు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికకు వందలుకాదు వేలకోట్ల రూపాయలు అవసరమవుతాయి. ధనం ఇంత అవసరమయి ఉండగా డా॥ సయ్యద్ మహమ్మద్ గారి మధ్యప్రాచ్యపర్యటనకు ఎందుకు వృథా వ్యయం చేయవలసివచ్చిందో అర్థంకావడంలేదు. ప్రధానమంత్రిమీద గౌరవంకొద్దీ ఎవరూ ఆయన విదేశాంగశాఖను విమర్శించరు. అందుచేత ఆశాఖ మంత్రిని విమర్శకు గురిచేసే ఏపనీ అధికారులు చేయకుండా ఉండడం మంచిది.

శ్రీ ప్యారీలాల్ గాంధీజీపై రచించిన గ్రంథం107వ పేజీలో ఇలా వ్రాశారు:

"డా॥ సయద్ మహమూద్ ఖిలాఫత్ రోజులనుంచీ దేశసేవచేస్తున్న కాంగ్రెసువాది. జాతీయవాదియైన మౌలానా-ఉల్-హక్ గారి అల్లుడు. రాజాజీవలెనే ఈయన కూడా క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించారు. అ. భా. కాంగ్రెసు సంఘం క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించకముందే 1942 ఆగస్టు 8వ ఈయన కాంగ్రెసు కార్యవర్గంనుండి రాజీనామా ఇచ్చారు. క్విట్ ఇండియా తీర్మానం ఆమోదింపబడుతుందనే ఉద్దేశంతో, ఆ తీర్మానానికి బాధ్యతలేనివారినికూడా అరెస్టుచేయడానికి బ్రిటిష్‌ప్రభుత్వం ప్లాను తయారుచేసింది కనుక, కార్యవర్గంనుంచి ముందే రాజీనామా ఇచ్చినప్పటికీ డా॥ సయద్ మహమూద్‌ను ప్రభుత్వం ఆ మర్నాడే అరెస్టుచేసింది. ఇదేవిధంగా పూనా, ఆగాఖాన్ భవనంలో గాంధీజీకి వైద్యపరిచర్య చేస్తున్న నా సోదరి డా॥ సుశీలా నయ్యర్‌ను కూడా అరెస్టు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆమె అప్పటికే ఏడాది ముందే ఆశ్రమాన్ని వదిలిపెట్టి క్విట్ ఇండియా తీర్మానంనాటికి ఢిల్లీ లేడీ హార్డింజ్ కాలేజీలో ఉద్యోగం చేస్తున్నది.

కారాగారంలో ఉన్నప్పుడు డా॥ మహమూద్ తనతోటి ఖైదీలకు తెలియకుండా వైస్రాయికి ఉత్తరం వ్రాశారు. తాను క్విట్ ఇండియా తీర్మానానికి అ. భా. కాంగ్రెసు సంఘంలో వ్యతిరేకించాననీ, ఏ దృష్ట్యా చూసినా గాంధీజీ ఈ తీర్మానం ఆమోదింపజేయడం తప్పని తన అభిప్రాయమనీ, కనుక తన్ను ఈ విధంగా అరెస్టుచేయడం అన్యాయమనీ ఆ ఉత్తరంలో వ్రాశారు. [illegible] యుద్ధసహాయ ప్రయత్నాలకు ఏ విధంగా తోడ్పడింది వివరిస్తూ, గాంధీజీ జీవితకాలంలోనే భారతదేశంలో రాజీపడవలసిందని అర్థిస్తూ ఆయన తన ఉత్తరం ముగించారు.

వైస్రాయి ఆరోజుల్లో రాజకీయ ఖైదీల విడుదలకు రెండు షరతులు పెట్టాడు. క్విట్ ఇండియా తీర్మానంతో సంబంధం లేదని ప్రకటించడం, విడుదల అయిన తరువాత యుద్ధసహాయ ప్రయత్నాలకు వ్యతిరేకించకుండా తోడుపడడం. డా॥ సయద్ మహమూద్ ఉత్తరం ఈ రెండు షరతులను నెరవేర్చింది. అందుచేత ప్రభుత్వం ఆయనను విడుదలచేయక తప్పలేదు." ★

చెరసాలలో పాఠశాల

బడి పెట్టడానికి చోటు లేక, చివరకి చెరసాలలో పిల్లల్ని కూర్చోపెట్టి చదువుచెప్పే సందర్భాలు కూడా మనదేశంలో ఉన్నాయి! నాందేడ్ జిల్లా మధోల్ తాలూకాలో ఒక ప్రాథమికపాఠశాలను, ఇంకెక్కడా చోటు దొరకక, చెరసాలలో ఏర్పాటుచేశారనీ, పిల్లలు కటకటాల తలుపుల గదుల మధ్య కూర్చుకుని చదువు నేర్చుకోవలసివచ్చిందని హైదరాబాద్ విద్యామంత్రి శ్రీ గోపాలరావ్ ఎక్బోటే మొన్న ఒక సభలో వెల్లడించారు.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

బుద్ధజయంతి సంచిక

వైశాఖ పూర్ణిమను (24-5-56) బుద్ధ పరినిర్వాణజయంతి ఉత్సవాలు దేశమంతటా జరుగబోతున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రవారపత్రిక 30-5-56 సంచిక బుద్ధజయంతి సంచికగా వెలువడుతున్నది. ఈ సంచికలో బౌద్ధమతానికి సంబంధించిన వ్యాసాలు, కథలు, చిత్రాలు ప్రత్యేకాకర్షణలుగా ఉంటాయి.

ప్రపంచ జనాభా వివరాలు

1954 తో ముగిసిన ఐదు సంవత్సరాలలో ప్రపంచ జనాభా, చరిత్రలో ఇదివరకెన్నడూ పెరగనంత త్వరగా పెరిగినది. ఐక్యరాజ్య సమితి ఏప్రిల్ నెలాఖరున ప్రకటించిన జనాభా నివేదిక ప్రకారం,1954 మధ్యలో ప్రపంచం జనాభా 265 కోట్ల 20 లక్షలు ఉన్నట్లు తేలింది. ఇందులో ఆసియాలో ప్రజలు సగానికి పైగా ఉన్నారు. ఆసియాలో (రష్యా మినహా) 145 కోట్ల 10 లక్షలు, సోవియట్ యూనియన్‌లో 21 కోట్లు 40 లక్షలమంది ఉన్నారు. యూరప్ జనాభా 40 కోట్ల 40 లక్షలు, ఉత్తర దక్షిణ అమెరికాలలో 35 కోట్ల 70 లక్షల మంది ఉన్నారు. ఆఫ్రికాలో 21 కోట్లు, ఓషియానాలో కోటి నలభై నాలుగు లక్షల మంది ఉన్నారు.

మనది రెండవ స్థానం

దేశాలవారీగా చూస్తే చైనాది అగ్రస్థానం. ఆ దేశం జనాభా 58 కోట్ల 20 లక్షలు. ఆ తరవాత భారతదేశం.

మన జనాభా 37 కోట్ల 70 లక్షలు, ఇతరదేశాలలో రష్యాలో 21 కోట్ల 40 లక్షలు, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 16 కోట్ల 20 లక్షలు, జపాన్‌లో 8 కోట్ల 80 లక్షలు, ఇండొనీషియాలో 8 కోట్ల పది లక్షలు, పాకిస్తాన్‌లో 8 కోట్లు ఉన్నారు.

పెరుగుదల

ఆసియాలో జనాభా పాలుకి 210 లక్షల చొప్పున, లాటిన్ (దక్షిణ) అమెరికా దేశాలలో 40 లక్షల చొప్పున, ఉత్తర అమెరికా, సోవియట్ యూనియన్, యూరప్, ఆఫ్రికాలలో పాలుకు 30 లక్షల చొప్పున పెరిగినట్లు అంచనా. ఇదికూడా దేశాలవారీగా చూస్తే వెనిజులాది ప్రథమ స్థానం. అక్కడ ఏడాదికి 3% చొప్పున పెరిగింది. సింహళం, మెక్సికోలు ఈ కోవకి చెందినవే. పెరుగుదల అతి మందంగా ఉన్న దేశం ఐర్లాండ్ (0.04%) స్పెయిన్, పాకిస్తాన్, పోలెండ్ పోర్చుగల్ దేశాలు యీ కోవలోవే.

ప్రపంచం మొత్తం మీద ఎక్కువ జనాభా గల నగరం న్యూయార్క్. 168 లక్షలు. తరవాత 88 లక్షలుగల లండన్, 68 లక్షలు గల టోక్యో వస్తాయి.

ప్రాకృశ్చపాలు

స్త్రీ పురుషుల సంఖ్యలు విడిగా లెక్కవేస్తే, అమెరికా యిరోపాలలోని నగరాలలో స్త్రీలదే పైచెయ్యి. అక్కడ సగటున 89 మంది పురుషులుంటే స్త్రీలు వందమంది తేలారు. ఆసియా, అరబ్ దేశాలలో నిష్పత్తి దీనికి వ్యతిరేకం.

ఆయుష్కాలంలో ప్రపంచం అంతటా స్త్రీలదే పైచెయ్యి. బ్రిటన్‌లో పురుషుల ఆయుష్కాలం సగటున 67.3 సంవత్సరాలు. స్త్రీలకు 72.44 మనదేశంలో పురుషుల ఆయుర్దాయం సగటున 31.66 సంవత్సరాలు కాగా, స్త్రీలకు 32.45 అని తేలింది.

పెళ్ళిళ్ళ విషయంలో యూరప్, ఉత్తర అమెరికా, ఫారోస్యజాలది పైచెయ్యి. ఐర్లెండ్, లాటిన్ అమెరికా దేశాలలో పెళ్ళిళ్ళు మిగతా దేశాలకన్న బహు తక్కువ. పోతే విడాకులు ఇచ్చుకునే సందర్భాలు అమెరికా, ఈజిప్టు, జపాన్‌లలో ఎక్కువట.

1954 లో బ్రిటన్‌లో పెళ్ళిళ్ల సంఖ్య 3,31,748. ఆ క్రితం సంవత్సరాలలో విడాకుల సంఖ్య 29,736. అదేకాలంలో అమెరికాలో వివాహాల సంఖ్య 1,47,600 కాగా విడాకులసంఖ్య3,90,000 అయినట్టు తేలింది.

అక్షరాస్యతలో మనదేశం బాగా వెనక బడివుంది. హైతీలో నూటికి 89.4 మంది నిరక్షరాస్యులు. ఆ తరవాత మనదేశంలో నూటికి 82.1 మందినిరక్షరాస్యులు. ★

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

8. థాలియాపై కేసు

హోర్వ్ ఫ్రాయంట్‌తో మాట్లాడడానికి వెళ్ళిన ఇన్‌స్పెక్టరు పార్ దర్యాప్తు త్వరగా ముగించివేశాడు. పార్‌ను చూడగానే ఫ్రాయంట్ జంకిపోయాడు. పార్‌ను అదివరకే బియర్డ్‌మోర్ హత్య దర్యాప్తు సందర్భంలో ఫ్రాయంట్ చూసి ఉన్నాడు. ఫ్రాయంట్ వణికి పోతూ—

"ఏం జరిగింది? ఈ హంతకులు మళ్ళీ ఏదన్నా కొత్త కార్యక్రమం ప్రారంభించారా?" అని అడిగాడు.

"అబ్బే, అదేంలేదుగాని మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడిగి పోదామని వచ్చాను. థాలియా డ్రమండ్ మీ ఇంట్లో ఎంతకాలం నుంచీ ఉంటోంది?" పార్ ప్రశ్నించాడు.

"మూడు నెలలుగా నా సెక్రెటరీగా ఉంటోంది. ఏం?" అని అనుమానంగా అడిగాడు ఫ్రాయంట్.

"జీతం ఎంతిస్తారు?"

ఫ్రాయంట్ జీతం ఎంతిచ్చేదీ చెప్పాడు. అంత తక్కువ జీతం ఇస్తున్న తన లోభిత్వానికి తనే సిగ్గుపడుతున్నట్లు "ఆమె తిండి తిప్పలు మా ఇంట్లోనేగదా. పైగా సాయంత్రాలప్పుడు ఆమెకు ఏ పనీ చెప్పకుండా వదిలేస్తాను కూడా," అని సమర్థించుకున్నాడు.

ఈ మధ్య మిస్ డ్రమండ్ డబ్బుకేమైనా ఇబ్బంది పడిందా?",

ఫ్రాయంట్ "అవును. నిన్న ఒక అయిదు పౌన్లు ఉంటే బజానాగా ఇవ్వమంది. ఏదో అత్యవసరమైన పని వచ్చిందిట. అయితే నేను ఇవ్వలేదనుకోండి. బజానా ఇవ్వడం నా కెప్పుడూ అలవాటులేదు. చెయ్యాని పనికి ముందే డబ్బు అడగడం—" అని ఇంకా చెప్పబోతుండగా, "మీ దగ్గిర పురాతన వస్తువులు చాలా ఉన్నాయట్లే ఉంది. కొన్ని ఖరీదైనవికూడా ఉన్నాయనుకుంటాను. వాటిలో ఏమైనా పోయాయా?" అని పార్ అడిగాడు.

ఫ్రాయంట్ గతుక్కుమన్నాడు. తన కొలువు పూచీపుల్ల అయినా పోయిందీ అంటే అతడు ఆస్తి అంతా కొల్లపోయినంత గగ్గోలు చేస్తాడు. గబగబా ఇంకో గదిలోకి వెళ్ళాడు. మూడు నిమిషాల తర్వాత అంత విసురుగాను తిరిగి వచ్చాడు. ముఖం వివర్ణమైంది.

"బుద్ధుడు! నా బుద్ధ విగ్రహం! వంద పౌన్ల ఖరీదు! ఇవ్వాళ పొద్దున ఇక్కడే ఉంది!..."

"సరే మిస్ డ్రమండ్‌ను ఇలాపిలవండి."

థాలియా వచ్చింది. ఏమీ తొణకలేదు, బెణకలేదు. చేతులు వెనక్కి కట్టుకుని తాపీగా వచ్చింది. యజమాని బల పక్కనే నుంచుంది. డిటెక్టివ్ కేసి తలతిప్పి చూడనైనా లేదు.

ఫ్రాయంట్ ఆమెను ఏమని అడగాలి, ఎలా అడగాలి అని తేల్చుకోవడానికి ఇబ్బంది పడ్డాడు. క్రోధారుణమైన అతని నేత్రాలు చూసి, తన దొంగతనం తెలిసిపోయిందని థాలియా గ్రహించింది.

"నువ్వు—నువ్వు నా వస్తువొకటి దొంగిలించావు" అని కోపంతో కీచుపోయిన గొంతుతో ఫ్రాయంట్ అరిచాడు. "నువ్వు—నువ్వు నువ్వు—దొంగవి."

థాలియా చాలా నిర్లక్ష్యంగా, తాపీగా "నేను డబ్బిమ్మని మిమ్మల్ని అడిగాను. మీ రివ్వలేదు. మీ అంత పిసినిగొట్టును నే నెక్కడా చూడలేదు" అంది.

ఫ్రాయంట్ కోపం పట్టలేక పోయాడు. "ను...నువ్వు...." అని ఇక లాభం లేదనుకున్నాడో ఏమో, ఇన్‌స్పెక్టర్ కేసి తిరిగి "నే నీమెపై నేరంమోపుతున్నాను, ఇన్‌స్పెక్టర్! ఈమె దొంగతనం చేసింది. ఈ దెబ్బతో నువ్వు ఖైదుకు వెడతావు. ఆగు... ఆగు...ఇంకా ఏమైనా పోయాయేమో చూస్తాను," అన్నాడు.

"మీరనవసరంగా శ్రమపడ వద్దు. బుద్ధ విగ్రహం ఒక్కటే నేను తీసింది. అదే నా ఏమంత బాగుంటవని, వెధవది..."

"నా తాళం చెవులు నాకిచ్చెయ్యి. నీలాంటి దాన్ని నమ్మి నా వ్యాపారం ఉత్తరాలు కూడా చూడనిచ్చాను. ఇంతకీ నిన్ను నమ్మటం నాదే తప్పు."

"మిస్టర్ ఫ్రాయంట్! మీ ఉత్తరం ఒకటి ఇప్పుడే చూశాను. అది అంత మంచి ఉత్తరం కాదనుకుంటాను," అని ఒక ఉత్తరం అతని చేతి కిచ్చింది.

ఆ ఉత్తరం చూడగానే ఫ్రాయంట్ ముఖం పాలిపోయింది. అరుణవలయం ముద్ర స్పష్టంగా కనిపించింది. వలయం మధ్యలో అక్షరాలు మాత్రం అలుక్కుపోయినట్లున్నాయి. అ దలా పట్టుకునే ఫ్రాయంట్ కుర్చీలో కూలబడిపోయాడు.

9. పోలీసుకోర్టులో థాలియా

మేజిస్ట్రేటు మెత్తనివాడు. ఈతతంగమంతా ఇష్టంలేనట్లు ఇబ్బంది పడుతూ తన ఉన్నతాసనంపై కూర్చున్నాడు. ఏ విధమైన కదలికా, ఆలోచనా కనిపించని ఇన్‌స్పెక్టర్ పార్ ముఖం కేసి కాసేపూ, బోనులో నుంచుని, ప్రశాంతంగా, ధీమాగా చూస్తున్న థాలియా ముఖం కేసి కాసేపూ చూస్తున్నాడు. ఏ పరిస్థితుల్లోనైనా, ఏ పరిసరాల్లోనైనా థాలియా అందమైన ముఖం అందర్నీ ఆకర్షిస్తుంది. నిర్జీవంగా ఉన్న పోలీసు కోర్టు వాతావరణంలో ఆమె మరింత సజీవంగా, తేజోవంతంగా భాసించింది.

మేజిస్ట్రేటు తన ఎదుట ఉన్న ఛార్జిషీటును ఒకసారి పరికించాడు. ఆమె వయస్సు ఇరవైఒకటనీ, సెక్రెటరీగా పని చేస్తోందని అందులో ఉన్నది.

న్యాయాధిపతి జీవితంలో చాలా అపూర్వ విషయాలు చూసి ఉన్నాడు. అసంభవమైన దేదీ లేదనే నమ్మకంలో ఉన్నాడు. అటువంటి ఆయనకూడా థాలియాను చూసి నిట్టూర్పు విడుస్తూ తల ఊగించాడు.

"ఈ స్త్రీనిగూర్చి ఇదివరకేమైనా అభియోగాలున్నాయా?" అని అడిగి అంత చిన్న పిల్లని స్త్రీ అనడం ఎబ్బెట్టుగా ఉందని తనే అనుకున్నాడు.

"కొంత కాలంనుంచీ ఈమెపై నిగావేసి ఉంచాము. కాని ఇంతకుముందు పోలీసుల చేతిలో ఈమె పడలేదు." అని పార్ సమాధానం చెప్పాడు.

మేజిస్ట్రేటు కళ్ళజోడులోంచి థాలియా కేసి చూశాడు.

"అమ్మాయీ! నువ్వీ ప్రమాదపరిస్థితిలో ఎలా చిక్కుకున్నావో నాకు అర్థం కావడం లేదు. నువ్వు చదువుకున్నదానిలా కనిపిస్తున్నావు. నువ్వు దొంగిలించిన వస్తువు చాలా విలువైనదైనప్పటికీ, నువ్వు తాకట్టు పెట్టి తెచ్చుకున్న సొమ్ము కొంచెమే. బహుశా ఏదో తాత్కాలిక ప్రలోభానికి లోబడి ఈ పని చేసి ఉంటావనుకుంటాను. బహుశా నీకు డబ్బు అత్యవసరంగా కావలసి వచ్చిందనుకుంటాను. అయినా నిన్ను న్యాయచట్టం క్షమించదు. కాని ఇది నీ మొదటి అపరాధంగా పరిగణించి, ఇకనుంచీ మర్యాదగా బ్రతుకుమని మందలిస్తూ నిన్ను వదిలేస్తున్నాను. ఇక ఎప్పుడూ ఈమాదిరిగా ప్రవర్తించవని ఆశిస్తున్నాను."

థాలియా కృతజ్ఞతా సూచకంగా తల వంచి, బోనువిడిచి వెళ్ళిపోయింది.

హార్వే ప్రాయింట్ కూడా లేచి కోర్టు బయటికి వచ్చాడు. అతను ధనార్జనే జీవితాశయంగా గల ధనికుడు. ప్రతిరోజూ నిద్రపోయేముందు డబ్బు సరిగ్గా ఉందో లేదో లెక్క పెట్టుకుని పడుకునే బాపతు మనిషి. అపరిచితుల్లో తన తల్లి తప్పు చేసినా, అతను నిశ్చింతగా అరెస్టు చేయించేవాడే. థాలియా డ్రమండ్ మీద అతని ఆగ్రహం మరీ ఎక్కువ కావడానికి కారణం, ఆమె సెక్రెటరీగా ఉంటూ ఆఖరుసారిగా అరుణ వలయం లేఖ తన చేతి కందించి పోవడం. ఆ లేఖ తాలూకు దెబ్బనుండి ఇంకా తేరుకోలేదు.

అతను భారీ మనిషి. సన్నగా ఉంటాడు. కొదిగా వంగి నడుస్తాడు. ప్రపంచంలో అతనికి ఆప్తులు, విశ్వాసపాత్రులు ఎవరూ లేరు. ఆస్తి హక్కులు పరమపవిత్రమైనవని అతని దృఢవిశ్వాసం. అందుచేత థాలియా చేసినపని పరమదారుణంగా అతను ఎంచడంలో ఆశ్చర్యం లేదు. థాలియాకు జైలు వెయ్యకపోవడం అతనికి ఆశాభంగం కలిగించింది. ఆ విషయమే పార్ దగ్గర వెలిబుచ్చాడు. పిసినిగొట్టు తనమంతా ఆ గొంతుకలోనే ఉందా అనిపించే కీచుకంఠంతో "ఆ స్త్రీ సంఘానికి చీడపురుగు. నన్ను బెదిరిస్తూ ఈ ఉత్తరం వ్రాసిన ఆ హంతకులతో ఆమెకు లాలూచీ లేదని ఏమిటి నమ్మకం? ఏభైవేల పౌనులు ఇమ్మని వాళ్లు అడుగుతున్నారు. ఏభైవేలు! కొన్నా కూస్తా కాదు. నాకేమీ అపాయం రాకుండా చూసే భారం మీది. వింటున్నారా నేను చెప్పేది. నా రక్షణ బాధ్యత మీది" అని పార్ తో అతను నిష్కర్షగా చెప్పివేశాడు.

"విన్నాను మహానుభావా, విన్నాను" అని పార్ విసుగ్గా అన్నాడు. "ఆమె అరుణ వలయంతో లాలూచీలో ఉందనేది నేను నమ్మను. ఆమె ఇంకా పసిపిల్ల."



"పసిపిల్లా!" అని ఫ్రాయంట్ గుర్రు మన్నాడు. "ఇప్పుడే అలాంటివాళ్లని శిక్షించాలి. చిన్నప్పుడే పట్టుకుని, చిన్నప్పుడే శిక్షించాలి. పెద్దయిన తరవాత బుద్ధిగా మసులుకుంటారు".

"నిజమే మీరు చెప్పింది", అని ఒప్పుకున్నాను పార్.

ఫ్రాయంట్ ఏదో గొణుక్కున్నాడు. వెళ్లివస్తానని అయినా చెప్పకుండా, పోయి తనకోసం వేచిఉన్న కారులో కూర్చున్నాడు.

ఇన్స్పెక్టర్ అతని హడావుడిచూసి నవ్వుకున్నాడు. పక్కకి తిరిగిచూడగా గుమాస్తా గదిపక్కన ఒక యువకుడు ఎవరి కోసమో వేచి ఉండడం కనిపించింది.

"ఓ, బియర్డ్మోర్! ఆ యువతికోసం చూస్తున్నావా?"

"అవును. ఎంతసేపు ఆమెని ఉంచుతారక్కడ?" అని జాక్ ఉద్రిక్తభావంతో అడిగాడు.

"నీకు కోపం రాకపోతే ఒక ముక్క చెబుతాను. ఆమె మీద ఇంత ఆసక్తి కనబరచడం మంచిదికాదు".

"ఏమిటి మీ ఉద్దేశం? ఇదంతా ఏదో కుట్రలా కనిపిస్తోంది. ఆ వెధవ ఫ్రాయంట్—"

ఇన్స్పెక్టర్ అతనిమాటకు అడ్డువచ్చి "ఆ విగ్రహం తీసినట్టు మిస్ డ్రమండ్ ఒప్పుకున్నది. అదీగాక ఆ తాకట్టు కొట్లోంచి ఆమె రావడం మనం చూడనే చూశాం. ఇంకా నీకు సందేహమెందుకు?" అన్నాడు.

"ఒప్పుకున్నదంటే, యెందుకు ఒప్పుకున్నదో ఆమెకే తెలియాలి. అటువంటి యువతి దొంగతనం చేస్తుందంటే ఎవడన్నా నమ్ముతాడా? అసలామె ఎందుకు దొంగతనం చెయ్యాలి? నన్నడిగితే నేనామెకి ఎంతైనా ఇద్దునే! ఇదంతా ఏదో విచిత్రంగా ఉంది. దీని వెనక ఏదో రహస్యం, నాకూ, మీకూ తెలియని రహస్యం ఉందని నా అనుమానం!"

ఇంతలో తలుపు తెరుచుకుంది. మిస్ డ్రమండ్ బయటికి వచ్చింది. జాక్‌నుచూసి ఆగింది. పాలినట్లున్న ఆమె ముఖం కొంచెం జేవురించింది.

"కోర్టులో ఉన్నావా నువ్వు?" అని ఆమె అడిగింది. అతడు ఉన్నానని తల ఊపాడు.

"నువ్వు ఎందుకు వచ్చావు?" అని తీవ్రంగా అన్నది. "నీ కెలా తెలుసు? ఎవరు చెప్పారు?" ఇన్స్పెక్టర్ అక్కడే ఉన్నాడని కూడా ఆమె గుర్తించనట్లు కనిపించింది. అరెస్టు అయిన తరవాత ఇంతసేపూ ప్రశాంతంగా ఉండి, ఇప్పుడు అణుచుకున్న ఉద్రిక్తభావమంతా వెల్లగక్కుతున్నట్లు కనిపించింది. ఆమె కంఠం కంపించింది. "నీకు ఆ విషయం తెలిసిపోయినందుకు, నువ్వు కోర్టుకు హాజరైనందుకు నాకు చాలా విచారంగా ఉన్నది".

అతడు ఆమెకు అడ్డం వచ్చి "థాలియా! ఇదంతా నిజమేనా? కుట్రకాదూ? నిన్ను నాశనం చేయాలని పన్నిన కుట్రకాదూ?" అని అతడు జాలిగా చూశాడు.

"కుట్రా లేదు, ఏం లేదు. నేను ఫ్రాయంట్ వస్తువు దొంగిలించినమాట నిజమే."

"ఎందుకు దొంగిలించావు? నీకేం అవసరం?..."

"ఎందుకో అందుకు. అదంతా నీతో చెప్పలేను. నాకు డబ్బు అవసరమైందని మాత్రం చెప్పగలను."

"నే నెన్నటికీ నమ్మను," ఆమెకేసి తదేకంగాచూస్తూ అన్నాడు జాక్. "నువ్వి లాంటి నీచమైన దొంగతనాలు చేస్తావని నేను నమ్మలేను."

థాలియా అతనికేసి అలాగే నిశ్చలంగా కొంతసేపు చూసింది. ఇన్స్పెక్టరుకేసి తిరిగి "కనీసం మీరైనా చెప్పి బియర్డ్మోర్ చేత నమ్మించగలరనుకుంటాను," అన్నది.

"ఎక్కడికి వెళుతున్నావు?" ఆమె వెళ్లబోతుండగా జాక్ అడిగాడు.

"ఇంటికిపోతున్నాను. నాతో రావద్దు."

"ఇంటికా? ఇల్లెక్కడుంది?"

"ఉన్నది. లేకపోవడమేమిటి?" అని ఆమె విసుక్కున్నది.

"అయితే నేనూ వస్తాను" పసిపిల్లను మారాము చేస్తున్నట్లు అతడన్నాడు.

ఆమె మారుమాటాడకుండా కోరు ఆవరణ దాటి జనసమ్మర్దంగాఉన్న వీథిలోకి వచ్చారు. ట్యూబ్ (భూగర్భ) స్టేషను ద్వారం సమీపించేవరకు ఇరువురూ మాట్లాడుకోలేదు.

"ఇక నేను వెడతాను," అని థాలియా ఇందాకటికంటె మృదుస్వరంతో అంది.

"అయితే నువ్విక ఏం చెయ్యబోతున్నావు? ఈభయంకరమైన అపవాదు పడింతరవాత నీకు ఉద్యోగం ఎవరిస్తారు?"

"అంత భయకరమైనదా ఇది?" అని థాలియా, స్టేషనులోకి ప్రవేశించబోతుండగా జాక్ ఆమెచెయ్యి పట్టుకుని బలాత్కారంగా తనవైపు తిప్పుకున్నాడు.

"నామాట విను థాలియా! నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను పెళ్లి చేసుకుంటాను. ఈముక్క ఇదివరకు నీతో చెప్పకపోయినా నువ్వు గ్రహించే ఉంటావు. నువ్విలా నా జీవితంలోంచి అంతర్ధానమైపోవడానికి నేనొప్పుకోను. నువ్వు దొంగవని నేను నమ్మను—"

మెల్లిగా ఆమె అతనిచేయి విడిపించుకుంది.

"మిస్టర్ బియర్డ్మోర్!" అని ఆమె నెమ్మదిగా ప్రారంభించింది. "నువ్వు తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నావు. నన్ను పోనివ్వనని నువ్వన్నావు. నేను కూడా నిన్ను పాడవనివ్వను. దొంగఅని కోర్టులో ఋజువుచేయబడిన స్త్రీకోసం నువ్వు పాడైపోవడం నాకిష్టంలేదు. నన్నుగురించి నీకేం తెలుసు, నేను కాస్త అందమైన పిల్లననితప్ప? నేను నీకు తల్లిలాగానో, పిన తల్లిలాగానో ఉండవలసినదాన్ని. బహుశా మళ్ళీ ఎప్పుడో మనం కలుసుకుంటామనుకుంటాను. అప్పటికి నీ ప్రేమజ్వరం బాగా తగ్గిపోయి మామూలుమనిషివౌతావని ఆశిస్తున్నాను. గుడ్ బై."

బుకింగ్ హాలులోకి ఆమె వెళ్ళిపోయింది.

ఏదో సమాధానం చెబుదామనుకున్నాడు గాని జాక్ బియర్డ్‌మోర్ నోటమాట రాక అలాగే నిలుచుండిపోయాడు.

10 అరుణావలయం ఆహ్వానం

హార్వే ఫ్రాయంట్ వద్ద ఉద్యోగానికి కుదరడానికి ముందు తను నివసించిన బసకు థాలియా డ్రమండ్ తిరిగి వెళ్లింది. ఆమెపై అభియోగం మోపబడిన వార్త ఆమెకంటె ముందుగానే చేరింది గావును, ఇంటి యజమానురాలు ముభావంగా తలుపు తీసింది. ఫ్రాయంట్ దగ్గిర ఉద్యోగం చేస్తూ ఉన్న మూడు నెలల కాలంలోనూ ఇంటి అద్దె సక్రమంగా చెల్లించి వేస్తూ ఉండబట్టి గాని లేకపోతే యజమానురాలు థాలియాని లోపల అడుగు పెట్టనిచ్చేదే కాదు.

థాలియా గది చిన్నదైనా, శుభ్రంగా నిరాడంబరంగా ఉంది. యజమానురాలి కోపపు చూపులను లెక్కచేయకుండా థాలియా తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఆమె 'హాలోవే' జైలులో గడిపి వచ్చింది. జైలు దుమ్ముతో, వాసనతో ఆమె బట్టలన్నీ అసహ్యంగా తయారైనాయి. ఆమె ఉంటున్నది లెక్సింగ్‌టన్ వీథిలో 14వ నెంబరు ఇల్లు. ఈ ఇంట్లోకంటె 'హాలోవే' జైలులోనే శుభ్రమైన స్నానాల గదులున్నాయి. వాటిని తలుచుకుంటూ ఆమె వస్త్రాలు తీసివేసి స్నానానికి సిద్ధమైంది.

ఆమె మనస్సునిండా ఆలోచనలు కిక్కిరిసి పోతున్నాయి. హార్వే ఫ్రాయంట్.... జాక్ బియర్డ్‌మోర్...ఏదో ఇష్టం లేని ఆలోచన వచ్చినట్లు మొహం చిట్లించింది. జాక్‌ను మనస్సునుండి తొలగించడానికి ప్రయత్నించింది. ఇంకా ఫ్రాయంటే నయం. అతనంటే ఆమె జుగుప్స అంతా ఇంతా కాదు. అతని ఇంట్లో ఉన్న కొద్దిరోజులూ చెరసాలలో ఉన్నట్లే గడిచాయి. నౌకర్లతోపాటే తానూ భోజనం చేయవలసివచ్చేది. తాను తినే ప్రతిదీ యజమాని జాగ్రత్తగా కొలిచి, తూచి పంపించాడని ఆమెకు తెలుసు. అతనికి డబ్బుకు కొదవా అంటే, అతడు ఏడు అంకెల చెక్కుమీద సంతకం పెట్టినా అది చెల్లుతుంది.

"ఏదేమైనా అతడు నిన్ను ప్రేమించలేదు, నయంగాదూ!" అని ఆమె తనలో తాననుకుని, నవ్వుకుంది. అసలు హార్వే ఫ్రాయంట్ ఎవరినైనా ప్రేమించగలడా అనేదే హాస్యాస్పదమైన ఆలోచనగా తోచింది. అంత పరమలోభి, నీచమనస్సుగల వ్యక్తి మరొకడుండడు. నౌకర్లు పని అశ్రద్ధ చేస్తున్నారేమో చూడడానికి ఇల్లంతా మూలమూలలా జాగ్రత్తగా పరీక్షించేవాడు. మద్యం తూచి తాగేవాడు. ఖాళీసీసాల్ని, బిరడాల్ని కూడా లెక్కపెట్టుకుని దాచుకునేవాడు. తోటలో ఎక్కడున్నా ఒక్క పువ్వు తక్కువైనా కనిపెట్టెయ్యగలనని గర్వంగా చెప్పుకునేవాడు. పువ్వులు, కాయగూరలు మార్కెట్‌కు పంపి అమ్మించేవాడు. ఏ చెట్టునో, ఎవరూ చూడకుండా తోటమాలి ఒక ఆపిల్ కోసుకుని తిన్నాడా, వెంటనే అది ఫ్రాయంట్‌కు తెలిసిపోయేది.

ఇదంతా తలుచుకుని ఆమె జుగుప్సతో నవ్వుకుంది. బట్టలు మార్చుకోవడం పూర్తయింది. తలుపు తాళం వేసి బయటికి బయలుదేరింది. ఇంటి యజమానురాలు ఆమె నిర్గమనం గమనిస్తూనే ఉంది. ఆమె వీథిమలుపు తిరగానే అటుకేసి మెటికలు విరిచింది.

"మీ ఇంట్లో వుండే అమ్మాయి మళ్ళీ వచ్చినట్లుందే," అన్నదొక పక్కయింటి వనిత.

"అవును మళ్లీ వచ్చింది. మంచి అమ్మాయే మొత్తానికి. ఇట్లాంటి దొంగమును...... చేరనివ్వ గూడదు. ఇవాళ రాత్రే ఖాళీచెయ్యమని నోటీసిస్తాను."

ఈ దూషణ ఏమీ వినని థాలియా సరాసరి నగరంలోకి పోయే బస్సు ఎక్కింది. ఫ్లీట్ స్ట్రీట్‌లో దిగి, ఒక పెద్ద వార్తాపత్రిక కార్యాలయంలోకి వెళ్లింది. ఒక డెస్కు దగ్గర అడ్వర్‌టైజ్‌మెంటు కాగితం తీసుకుని, కాసేపు సాలోచనగా చూసింది. చివరకు దానిమీద ఇలా వ్రాసింది.

"సెక్రటరీ—సెక్రటరీ ఉద్యోగానికి ఒక యువతి సిద్ధంగా ఉన్నది. బసకూడా కావాలి. కొద్దిజీతం చాలును. షార్ట్‌హాండ్, టైప్‌రైటింగు వచ్చును."

బాక్సు నంబరుకోసం కొంతజాగా వదలి ఆ కాగితాన్ని ఆఫీసులో ఇచ్చి, ప్రకటన రుసుము చెల్లించింది.

మళ్లీ లెక్సింగ్‌టన్ వీథిలో తన గదికి వచ్చింది. రాగానే ఇంటి యజమానురాలు టీ తెచ్చి ఇచ్చింది.

"ఇదిగో మిస్ డ్రమండ్. నీతో ఒకమాట చెప్పాలి," అన్నదామె.

"చెప్పండి" అన్నది థాలియా.

"పైవారం నుంచీ నీగది నాకు అవసరం."

థాలియా మెల్లిగా తల ప్రక్కకు తిప్పి చూసింది.

"అంటే నేను ఖాళీ చెయ్యాలన్నమాటేగా?"

"అవౌ, ఇది మర్యాదస్తుల కొంప. నీలాటి వాళ్లు ఇక్కడ ఉంటే మా మర్యాదకూడా పోతుంది. నువ్వేదో మంచి అమ్మాయి అనుకున్నానింకా."

"అలాగే అనుకోండి. నేను మంచిదాన్ని, అమ్మాయిని కూడాను."

"అబ్బో. చాలా మంచిదానివి. వారం రోజులపాటు జైలులో ఉండి వచ్చావు. నాకు తెలియదనుకుంటున్నావేమో. నేనూ పేపర్లు చదువుతాను," అన్నది యజమానురాలు.

"అవునవును. చదువుతున్నట్లే ఉంది మాస్తే. నేను వచ్చేవారం మీ గది ఖాళీ చేస్తాను."

"అదీ గాక—" అని యజమానురాలేదో చెప్పబోయింది.

"అదీ లేదు ఇదీ లేదు" అని థాలియా తలుపులు దభాలున వేసుకుంది.

చీకటి పడుతున్నది. థాలియా లేచి కిరసనాయిలుదీపం వెలిగించింది. చాలాసేపు గోళ్లు కత్తిరించుకుంటూ కూర్చుంది. తొమ్మిది గంటల పోస్టు వచ్చింది. ఇంటి వాకిటి తలుపులు తెరిచి మూసిన శబ్దం, తరవాత యజమానురాలు మెట్లెక్కి వస్తున్న శబ్దం వినిపించాయి.

"ఉత్తరం వచ్చిందమ్మాయ్!" అని గృహిణి కేక వేసింది.

థాలియా తలుపు తెరిచి ఉత్తరం తీసుకుంది.

"ఇదిగో అమ్మాయ్ నీ అడ్రసు మారబోతోందని నీ స్నేహితులకు త్వరగా తెలియజెయ్యడం మంచిది." గృహిణి థాలియా మీద ఇంకా కసితీరక చిన్న సలహాలాంటిది పారేసింది.

"అక్కర్లే. అనవసరం. అసలు ఇలాంటి దరిద్రపుగొట్టు ఇంట్లో ఉంటున్నానని ఎవరితోనూ చెప్పలేదులెండి," అని థాలియా జవాబిచ్చింది.

దానికి యజమానురాలు మంచి సమాధానం ఆలోచించుకునేలోగానే థాలియా తలుపు మూసేసింది.

కవరు తీసుకుని దీపం దగ్గిర కూర్చుంది. అడ్రెసు అచ్చువేయబడి ఉంది. చించేముందు పోస్టుముద్ర చూసి, చింపింది. లోపల తెల్లని కార్డు ఉంది. అది చూడగానే ఆమెముఖం అదోలా మారిపోయింది.

అది నలుచదరంగా ఉన్న కార్డు. కార్డు మధ్యలో పెద్ద అరుణవలయం ఉన్నది, వలయంలో కూడా అచ్చువేసిన అక్షరాలున్నాయి

"నీతో మాకు అవసరం ఉన్నది. రేపు రాత్రి పది గంటలకు స్లోన్‌స్క్వేర్ చివర వేచివుంటే కారులో ఎక్కికూర్చో."

కార్డు బల్లమీద పెట్టి దాన్ని పరిశీలించసాగింది.

అరుణవలయానికి తనతో అవసరం ఉన్నదట!

ఈ ఆహ్వానం వస్తుందని ఆమె ముందే అనుకున్నది కాని ఇంత త్వరలో వస్తుందని ఊహించలేదు. (ఇంకా వుంది.)

మహాప్రస్థానం

ప్రాచీన గాథాలహరి

హిమాచలం పాండవు లందరికీ ఎదురుగా ఒక మహా శరత్కాలమేఘంలా ప్రత్యక్షమైంది. వారందరు ఆ పర్వత శిఖరాగ్రాలపై దృష్టులు నిలిపి ఎత్తినతలలిక దించకుండా తదేకధ్యానంతో అలాగే సాగిపోయారు. ఇంతవరకు చెక్కుచెదరకుండా మహాప్రస్థాన యాత్ర సాగించిన వారందరి శరీరాలు హిమాచల శిఖర సందర్శనంతో ఒక్కసారిగా అలిసి సొలిసినట్లుగా బిగాలు పడిపోయాయి.

శ్రీకృష్ణ నిర్యాణం జరిగిపోగానే అర్జునుడు అనేకమైన యాతన లనుభవిస్తూ శ్రీకృష్ణుని అష్టమహిషులను, మరికొందరు యాదవ కుమారులను అతి కష్టంమీద ఇంద్రప్రస్థ నగరానికి తీసుకురాగలిగాడు. మధ్యమార్గంలో దస్యు లనేకులు యాదవులపై విరుచుకుపడి యాదవ మహిళల ననేక విధాలుగా హింసించారు. ఆ సమయంలో అనితర సాధారణమైన అతని శస్త్రాస్త్రసంపత్తి అంతా ఎందుకు కొరగాకుండావ్యర్థమైపోయింది.

ఆ విధమైన విధివైపరీత్యం అతని మనస్సంతా కలగించివేసింది. అటుపిమ్మట అతడొకనాడు వ్యాసమహర్షిని సందర్శించాడు. కాలపురుషుని లీలలవల్లనే అవన్నీ ఆ విధంగా జరిగిపోయాయనీ, ఆవిషయంలో విచారించడంవల్ల ప్రయోజనమేమీ లేదనీ ఇక పాండవులందరుకూడా మహాప్రస్థానానికి తరలిపోయే సమయ మాసన్నమైనదనీ వ్యాసమహర్షి అతని కాదేశించాడు. తిరిగి హస్తినాపురానికి రాగానే అర్జునుడా వృత్తాంతం అంతా ధర్మరాజాదుల కందరికీ తెలియజేశాడు.

శ్రీకృష్ణ నిర్యాణవార్త విన్నప్పుడే ధర్మరాజు హృదయంలో మహాప్రస్థాన సంకల్పం బయలుదేరింది. వ్యాససందేశం వినగానే ఆ సంకల్పం మరింత దృఢపడింది. మిగిలిన పాండవులందరు తమ సంకల్పం కూడా అదే అని తామిక ఒక క్షణమైనా హస్తినాపురంలో నిలవజాలమనీ అన్నారు.

వెనువెంటనే వారందరు పరీక్షిత్కుమారుని పట్టాభిషిక్తుం చేసి, పౌరజానపదు లందరి దగ్గర సెలవుతీసుకొని, యథావిధిగా సన్న్యాసాశ్రమం స్వీకరించి మహాప్రస్థాన యాత్ర కుపక్రమించారు.

దుర్మార్గరాజులైన కేవలం కట్టుబట్టలతో పాండవు లరణ్యవాసానికి బయలుదేరినప్పుడుకూడా హస్తినాపుర వాసులీవిధంగా విలపించలేదు! హస్తినాపురం అంతా ఆనాడు శోకంతంతో విలపించినట్లుగా భాసించింది!

ధర్మరాజు వారందరినీ ఓదార్చి తిరిగి వెనుదిరిగి చూడకుండా హస్తినగరద్వారం దాటి వెళ్ళిపోయాడు. అతని వెనువెంటనే భీమార్జున నకుల సహదేవులు, ద్రౌపదీదేవి క్రమక్రమంగా ఒకరొకరుగా నడిచి వెళ్ళిపోయారు.

హస్తినాపురద్వారం దాటగానే వారిని ఒక శునకంకూడా వెంటాడింది. మొట్టమొదట వారెవ్వరు ఆ విషయమే గమనించనేలేదు. పౌరజానపదులందరు ధర్మరాజాదులందరినీ చాలాదూరంవరకు సాగనంపి తిరిగి స్వగృహాలకు తరలిపోయారు. కాని ఆ శునకంమాత్రం వారిని విడిచిపెట్టలేదు.

అనంతరం సుభద్ర, పరీక్షిత్కుమారుడు మొదలైన రాజబంధువులందరు ధర్మరాజాదుల దగ్గర సెలవుతీసికొని తిరిగి హస్తినాపురానికి మరలిపోయారు. అయినా ఆ నోరులేని ప్రాణి పాండవులందరిని అలాగే అనుసరిస్తూ నడిచిపోయింది.

అటుపిమ్మట కొన్నిరోజులకు అగ్నిదేవుని ఆజ్ఞప్రకారం అర్జునుడు తన గాండీవంకూడా సముద్రంలోనికి విసిరివేశాడు. అది సముద్రంలో పడిపోగానే వేయిపిడుగు లొక్కసారిగా మోగినంతటి ప్రళయభీకర ధ్వని వినిపించింది. ఆ ధ్వనికా పరిసరారణ్యవృక్షాలన్నీ దద్దరిల్లిపోయాయి! అయినా ఆ ప్రాణి వారిని విడిచిపెట్టకుండా అల్లాగే మెల్లి మెల్లిగా తోకాడించుకొంటూ వారి వెనువెంటనే సాగిపోయింది. అంతటి భక్తివిశ్వాసాలతో తమ వెంట నడిచివస్తున్న దానిని కాదనడానికి వారెవరికీ మనస్కరించలేదు! పైగా వారందరు దాని నెంతో ఆప్యాయంగా ఆదరిస్తూ తమవెంట తోడుకుపోయారు.

ఆ విధంగా మహానదీనదాలు, దుర్గమారణ్యాలు దాటుకుంటూ కొంతకాలానికి వారంతా హిమవత్పర్వత ప్రాంతానికి చేరుకొన్నారు.

వారందరు నిశ్చలయోగనిష్ఠులై తదేకధ్యాన దృష్టితో హిమవన్నగ శిఖరాలవలోకిస్తూ నెమ్మది నెమ్మదిగా తమ మహాప్రస్థాన యాత్ర సాగిస్తున్నారు. అది ఒక నాటితో ముగిసిపోయే యాత్రకాదు. మృత్యుక్షణం వరకు నిరంతరాయంగా కొనసాగవలసిన మహాయాత్ర! మృత్యుద్వారమే ఆ యాత్రచరమలక్ష్యం! అంతకంటె దానికి వేరే మరొక పరమావధి ఏమీలేదు. అయితే నిశ్చలయోగనిష్ఠులైన వారు మాత్రమే ఆ భయంకర మృత్యుద్వారం అధిగమించి విముక్తులై పుణ్యలోకాలు చేరుకోగలరు. అందువల్లనే వారంతా నిరంత నిశ్చలయోగనిష్ఠులై అచంచల వీక్షణాలతో మహాహిమాలయంవైపు నడిచిపోయారు. అయితే ఆ శునకం మాత్రం కేవలం వారి యెడల ఏర్పడిన అపూర్వ భక్తివిశ్వాసాలవల్లనే ఆ విధంగా వారి వెంటనంటి సాగిపోయింది.

అంతలో ద్రౌపదీదేవి హఠాత్తుగా నేలపై పడిపోయింది. ఒక క్షణకాలం వారంతా వెనుదిరిగి చూశారు. ఆమె ముఖంలో ఎక్కడా జీవచైతన్యం స్ఫురించలేదు! వెంటనే ఆమె మరణించింది.

తిరిగి పాండవులు, ఆ శునకము అలాగే ముమ్ముందుకు సాగిపోయారు. పాండవులందరి హృదయాలలోను ఒక్కమారుగా ఎన్నెన్నో పూర్వస్మృతి విద్యుజ్జ్వాలిక లుదయించాయి. అయినా వారెవరు తమ నిశ్చలయోగలక్ష్యం విడనాడలేదు. అందరు అలాగే సాగిపోతున్నారు.

పి. గణపతిశాస్త్రి

"అసలు ఈ విధంగా యోగచ్యుతి కలగడానికి ఆ మహాపతివ్రతకు హేతువేమి? పాంచాలీదేవి ఎన్నడూ ఏ విధమైన అటువంటి అధర్మమున్నూ ఆచరించి ఉండలేదే!" అని ప్రశ్నించాడు భీమసేనుడు.

నిశ్చల లక్ష్యదృష్టితో పాండవులందరికీ మార్గదర్శిగా సాగిపోతున్న ధర్మరాజతని కీవిధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"ఈమెకు అర్జునుని యెడల పక్షపాతం అత్యధికంగా ఉండెను. ఆ పాపఫలమే నేడీ విధంగా పరిణమించింది!"

అని ధర్మరాజొక్క మారైనా వెనుకకు తిరిగి చూడకుండా అదే విధంగా నడచి పోయాడు.

మరి కొంతసేపటికి సహదేవుడు హఠాత్తుగా నేలపై పడిపోయాడు.

"మనందరికీ అహోరాత్రాలు తేమరకుండా శుశ్రూష చేసిన సహదేవకుమారుని పతనానికి హేతు వేమిటి?" అని భీమసేనుని ముఖతః తిరిగి ఇంకొక ప్రశ్న బయలుదేరింది.

"తనంతటి మహాప్రాజ్ఞుడెవడూ లేడని ఇతడెప్పుడు విర్రవీగుతూండేవాడు. ఈ పతనం దాని ఫలితమే!" అన్నాడు ధర్మపుత్రుడు.

ఆ మహాప్రస్థానం ఇంకా మరికొంత దూరం సాగింది. ఆ ఆపత్పరంపరకు మిగిలినవారెవ్వరు అంతగా చలించలేదు. కాని భ్రాతృకళత్ర మృతి సందర్శించేసరికి నకులునికిక నడక సాగలేదు ఆ క్షణంలో అతడొక మొదలునరికిన కదళీతరువులా కూలబడిపోయాడు.

"నకులకుమారుడెన్నడూ క్షుద్రకర్మలాచరించలేదు! ఎన్నడూ మీమాట కెదురాడలేదు! లోకంలో ఇంతటి మహాసౌందర్యశాలి ఇంకొకడెవ్వడూ లేడని ప్రసిద్ధిపొందిన దీనా సుందరుడు. ఇతనికీ విధమైన యోగభ్రంశదుర్గతి పట్టడానికి కారణమేమి?" అని ప్రశ్నించాడు భీమసేనుడు.

"లోకంలో మరి నాఅంతటి అందగాడింకెవడూ లేడనే అహంభావంవల్లనే ఇతనికీ దుర్గతి పట్టింది." అని ధర్మరాజలాగే ఆ నిరంతర మహాప్రస్థానయాత్రలో పడి మున్ముందుకు సాగిపోయాడు.

ద్రౌపదీ నకుల సహదేవుల మృతితో అర్జునునిలో అంతవరకు చెక్కుచెదరకుండా నిలిచిన ధైర్యం అంతా కరిగి నీరైపోయింది. అతడిక నిలబడలేకపోయాడు. వెంటనే నేలపైబడి మరణించాడు.

"పరిహాసప్రసంగాలలోకూడా ఎన్నడూ అనృతం చెప్పని మహానుభావుడీ అర్జునుడు! అలాంటి మహాపురుషుడీ విధంగా పడిపోవడానికి కారణమేమిటి?" అని తిరిగి ఇంకొక ప్రశ్న వినిపించింది.

"నిజమే! అయితే ఇతడొకనాడు ఒక్క రోజులో శత్రువులందరినీ నిశ్శేషంగా సంహరించివేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. చివరికా ప్రతిజ్ఞ నెరవేర్చుకోలేకపోయాడు. కనకనే ఇతనికీ దుర్గతి పట్టింది."

అని ఒక సమాధానం వినబడింది. ధర్మరాజిచ్చిన ఆ సమాధానం వింటూనే భీమసేనుడు భూమిమీద పడిపోయాడు. పడిపోయిన ఆ క్షణంలోనే అతడిలాగ ప్రశ్నించాడు: 'మహారాజా! చివరికి నేనుకూడా నేలపై పడిపోయాను! నాకిటువంటి పతనం సంప్రాప్తించడానికి కారణమేమిటి? దయ ఉంచి నాకిది తెలియజెయ్యవలసిందని కోరుతున్నాను."

దానికి ధర్మరాజీ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు: "మితిమీరి అతిగా భుజించిన దోషంవల్లనే నీకీ దుర్గతి కలిగింది. నా అంతటి మహాబలశాలి లేడనే గర్వంకూడా దానికి తోడైనది. ఇవే నీ పతనానికి హేతువులు!"

అని సమాధానం చెప్పిన ధర్మరాజికి వెనకకు తిరిగి చూడలేదు. నిశ్చలమైన యోగనిష్ఠాబలంతో ఆ ధర్మపుత్రుడదే విధంగా అత్యంత నిశ్చల హృదయంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అలాగే సాగిపోయాడు. ఇక పాండవులెవరు అనుసరించని అతని వెనువెంట ఒక్క కుక్క మాత్రమే నడిచివెళ్ళింది.

అన్ని భీషణ విపత్పరంపరలెదురైనా ధర్మపుత్రుని హృదయం కించిత్తయినా చలించలేదు. హిమాచలశిఖరం ఒక్కటే గౌరీశంకరరూపంతో అతని హృదయంలో సుప్రతిష్ఠితమై చల్లని వెన్నెల వెలుగులు విరజిమ్మింది.

ఆ విధంగా మరి కొంతదూరం సాగిపోయేసరికి అతని కట్టెదుట జాజ్వల్యమానమైన దివ్యరథం స్ఫురించింది. వెంటనే దేవేంద్రుడతని ఎదుట ప్రత్యక్షమై మేఘగంభీర స్వరంతో సుస్వాగతవచనాలు పలికి ఆమానవ శరీరంతోనే దేవతలతన్ని స్వర్గలోకానికి కాహ్వానిస్తున్నారనీ, కనక వెంటనే ఆ దివ్యరథం అధిరోహించవలసిందనీ అభ్యర్థించాడు. దానికి ధర్మరాజేమీ ఉబ్బితబ్బిబ్బైపోలేదు సవినయంగా దేవేంద్రుని కీవిధంగా విజ్ఞప్తి చేశాడు.

"దేవేంద్రా! నా ప్రియసోదరులందరు మార్గంలో దిక్కు తెలియని దీనులలాగ మృత్యువువాత పడిపోయారు. మహారాజపుత్రియైన పాంచాలీదేవి అత్యంత సుకుమారి. మహారాజభోగాలనుభవించిన ఆ మహాసాధ్వి కేవలం దిక్కులేని దీనురాలివలె కట్టి నేలపైపడి మరణించింది. నా సహోదరులందరు పాంచాలీసహితులై నా వెనువెంటనే స్వర్గలోకానికి రావలెనని కోరుకొంటున్నాను. నా కోరిక మన్నించవలసింది."

దానికి దేవేంద్రుడీవిధంగా సమాధానం ఇచ్చాడు.

"ధర్మరాజా! నీ సహోదరులందరు పాంచాలీసహితులై నీ కంటె ముందే స్వర్గానికి వెంచేశారు. మానవశరీరత్యాగం చేసిన ఆ క్షణంలోనే వారందరికీ ఉత్తమలోకాలు సంప్రాప్తించాయి. నీ విక అచిరకాలంలోనే వారందరినీ సందర్శించగలవు. మనుష్యశరీరంతో స్వర్గానికి పోయే భాగ్యం పట్టిన మహానుభావుడవు నీవొక్కడవే! అందువల్ల మరి వెనకముందు లాలోచించకుండా వెంటనే ఈ దివ్యరథం అధిరోహించవలసింది!"

ఆ ప్రత్యుత్తరానికి ధర్మరాజెంతో ఆనందించి "మహేంద్రా! పాపం ఈ కుక్క ఎంతో భక్తిశ్రద్ధలతో మా వెంటనంటే నడిచి వస్తున్నది! దీనిని కూడా నాతోబాటుగా స్వర్గానికి తీసుకుపోవలసిందని ప్రార్థిస్తున్నాను! దీనిని విడిచి స్వర్గానికి పోవడం కన్నా మరి వేరేఘాతుక కృత్యమేమీ లేదని అనిపిస్తున్నది!" అన్నాడు.

దానికి మహేంద్రుడిలాగన్నాడు.

"రాజా! నీవీక్షణంలో అమర్త్యుడవై నా సమానుడవైనావు! స్వర్గసౌభాగ్యాలన్నీ ఇక నీ కరతలామలకాలే! ఈ కుక్కను నీ వెంట బెట్టుకు రాకపోవడంవల్ల వచ్చే ప్రత్యవాయమేమీ లేదు! మరింక దానిమాట తలపెట్టక వెంటనే ఈ రథం అధిరోహించవయ్యా!"

ఆ మాటలకు ధర్మపుత్రుడీవిధంగా సమాధానం చెప్పాడు:

సవరణ

గతవారం సంచికలో 20-వ పేజీలో "రాజమండ్రివద్ద గోదావరి దృశ్యం" ఫొటో తీసినవారు ఎ. బి. వి. నరసింగరావు, రాజమండ్రి అని గుర్తింప ప్రార్థన.

★ మహాప్రస్థానం ★

"మహేంద్రా! ఇక నీవు తప్ప నాకెవరు దిక్కు లేరని కాళ్లా వేళ్లా పడిన ఆశ్రితుణ్ణి విడిచిపెట్టడం అంతటి మహాపాతక మేదీ లేదనీ, అది బ్రహ్మహత్యాసదృశమైన మహాపాతకమనీ ధర్మవేత్త లుద్ఘోషిస్తున్నారు! అందుచేత తుచ్ఛమైన స్వర్గసుఖం అభిలషించి నేనీ శునకాన్ని విడిచిపెట్టలేను! ప్రాణం పోయినా ఇదే నా దృఢనిశ్చయం!"

దానిమీద శచీపతి పక్కుమని ఒక్క నవ్వునవ్వి అతనితో ఇలాగన్నాడు.

"కుక్క ముట్టిన వస్తు వెంతటి మహత్తరమైనదైనా వెంటనే దానిని, దూరంగా విసిరి పారవేస్తున్నారు! ఈ కుక్కను విడిచిపెట్టి వేశావంటే స్వర్గసుఖాలన్నీ నీ అరచేతిలో వుంటున్నాయి! కనక దీని నింక దూర దూరంగా తరిమివేసి అనితర సాధారణమైన ఈ సశరీర స్వర్గసుఖం అనుభవించు! అదీన్నీ గాక నీ సహోదరులను, నీ ధర్మపత్నిని విడిచివేసి నీ వొక్కడవే స్వర్గద్వారం చేరుకొన్నావుగదా! నీ పుణ్యకర్మలవల్లనే నీ కింతటి అపూర్వభాగ్యవిశేషం కలిగింది. ఇంత త్యాగం చేసిన నీకీ చివరిక్షణంలో ఇంతటి మహామోహావేశం కలగడం ఆశ్చర్యకరం!"

పిమ్మట దేవేంద్రునికి ధర్మరాజీ విధంగా సమాధానం చెప్పాడు:

"మరణించినవా రెంతటి సచ్చారిత్రులైనా వారి పునర్దర్శనం మరి అసంభవమేకదా! వారి నెవరు తిరిగి బ్రతికించుకోలేరు! కనకనే నేను మరి నా సహోదరుల మాట తలపెట్టలేదు! కాని ఈ శునకం నన్నే నమ్ముకొని నా వెంటనంటి చాలాదూరందాకా నడిచి వచ్చింది. శరణాగతపరిత్యాగము, స్త్రీవధ, బ్రాహ్మణస్వాపహరణము, మిత్రద్రోహము, ఆశ్రితపరిత్యాగము మహాఘోరపాతకాలని ధర్మజ్ఞులు ప్రవచిస్తున్నారు. అందువల్లనే నీ శునకాన్ని మాత్రం విడిచిపెట్టేది లేదు!"

ధర్మరాజీ విధంగా తన దృఢసంకల్పం తెలియజెయ్యగానే ధర్మదేవత తన శునకస్వరూపం విడిచిపెట్టి అతని కెదుట నిలబడి ఇలాగన్నది:

"రాజా! నీ ప్రాణికరుణ, సచ్చారిత్రము, నీ మేధాప్రభావము అనుపమానమైనవి! పూర్వం ఒకప్పుడు ద్వైతవనంలో యక్షసరోవరతీరంలో నిన్నీవిధంగానే పరీక్షించియున్నాను. అప్పుడు భీమార్జునులకంటె నకులకుమారుడే నీ కత్యంతహితుడనీ ముమ్ముందుగా అతనినే బ్రతికింపవలసిందనీ ప్రార్థించావు. ఇప్పుడు కేవలం నీ వెంట వంటి వచ్చిందనే కారణంచేతనే ఈ శునకాన్ని విడిచిపెట్టేది లేదని భీష్మించుకొని కూర్చున్నావు. స్వర్గలోకంలో కూడా నీవంటి మహాపురుషు లెవరు కనిపించరు! కనకనే నీకీ అపూర్వమైన సశరీర స్వర్గం లభించింది!"

అటుపిమ్మట దేవతలందరు ధర్మరాజును దివ్యరథంపై కూర్చోబెట్టి వెంటనే స్వర్గలోకానికి తీసుకొనిపోయారు.

దివ్యకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ధర్మపుత్రునిచూచి దేవర్షి నారదుడీ విధంగా ప్రశంసించాడు:

"అహా! పూర్వ రాజర్షు లెవరు మానవశరీరంతో స్వర్గలోకంలో ప్రవేశించలేరు. ఈ పుణ్యపురుషుని కీర్తి పూర్వ రాజర్షుల కీర్తి నంతటినీ తలదన్నివేసింది! ధర్మపుత్రా! దేవతల దివ్యభవనాలన్నీ అపూర్వ భోగభాగ్యాలతో కలకలలాడుతున్నవి! ఈ మహాభవనాలన్నీ ఎంత మనోజ్ఞంగా ప్రకాశిస్తున్నవో చూడు!"

దేవర్షి వాక్యాలన్నీ కేవలం నిర్లిప్తుడై ఆలకించిన ధర్మరాజతనితో ఇలాగన్నాడు:

"నా సహోదరులు, ద్రౌపదీదేవి లేని ఈ స్వర్గసౌఖ్యాలు నా కెంతమాత్రము రుచించవు! నాకు వారితోడిదే లోకం! నేనిప్పుడు వారున్నలోకానికే వెళ్లిపోవాలని కోరుతున్నాను. ఇదే నా తుదికోరిక."

దానిపై తిరిగి దేవేంద్రుడు ధర్మజునితో ఇలాగన్నాడు:

"రాజేంద్రా! పూర్వ పుణ్యకర్మరాశి పరిణతిమూలంగానే నీకీ మహాపుణ్యలోకప్రాప్తి కలిగింది. ఈ పునీతస్థానంలో మనుష్యస్నేహాల కిక ప్రసక్తి కలగనే కలగదు! ఇంతటి మహోత్తమగతి కలిగినా నివ్వింకా మనుష్యస్వభావం విడిచిపెట్టినట్లు కనబడదు. మహారాజా! దివ్యభోగాలతో జాజ్వల్యమానంగా వెలిగిపోయే ఈ స్వర్గలోకవైభవం అంతా ఒక్కమారు కళ్లారా చూడు! ఈ దేవత లెలాంటి దివ్యభోగాలలో మునిగి తేలుతున్నారో చూడు!"

ఆ వాక్యాలన్నీ అలవోకగా ఆలకించిన ధర్మరాజు తిరిగి ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి దేవేంద్రుని కిలాగ విన్నవించాడు:

"సురేశ్వరా! నా సహోదరులు, పాంచాలీదేవి కనిపించని ఈ లోకం అంతా నాకు కేవలం నిస్సారంగా కనిపిస్తున్నది. నేనిక నా సహోదరులు, ద్రౌపది ఉన్నచోటికే వెళ్లిపోతాను. వెంటనే ద్రౌపదీదేవి కుమారులతో నివసించే లోకానికే నన్ను పోనీ!"

ఆ ప్రార్థన వినగానే దేవేంద్రుని నాలుక ఒక్కమారుగా స్తంభించిపోయింది! ఆశ్చర్యదృష్టితో ధర్మమూర్తియైన ధర్మజుని వైపు తిలకిస్తూ అతడు కేవలం కేవలం శిలామూర్తిలా నిలబడిపోయాడు! ★



18

అపూ ఆరోజున పల్లెకేసి గోలీలాడటానికి వెళ్ళాడు. మధ్యాహ్నం ఎండ తెరిపినిచ్చే దశలకు వచ్చింది. ఎండవేడిమి తగ్గిపోతోంది. ముందు వాడు తీనకడి పల్లెవారింటికి వెళ్ళాడు. తీనకడి కొడుకు జామచెట్టుక్రింద వెదురు బద్దలు తీస్తూ కూర్చున్నాడు. 'గోలీలాడుకుందాం వస్తావా?' అని అడిగాడు అపూ. తీనకడి కొడుకు-తనకీ ఆడాలని కోరికగా ఉన్నా-తానిప్పుడే నావచేసుకు వెళ్ళాలని, ఆడుకోటానికి వస్తే వాళ్ళ నాన్న తిడతాడని అన్నాడు. అక్కడినుంచి అపూ రామ్‌చరణ్ ఇంటికి వెళ్ళాడు. రామ్‌చరణ్ వసారాలో చుట్ట కాల్చుకుంటూ కూచున్నాడు. "న్యాడా(?) ఇంట్లో ఉన్నాడా?" అని అడిగాడు అపూ. "వాడెందుకు బాబ నాయనా! గోలీలాడటానికా? వెళ్ళు వెళ్ళు. వాడు లేడులే ఇంట్లో" అన్నాడు రామచరణ్.

మిట్టమధ్యాహ్నం వేళ ఇలాగ తిరగటంతో అపూ ముఖం ఎర్రగా కందిపోయింది. మరికొన్ని ఇళ్ళకు కూడా తిరిగి చివరికి కింత(?) చేసుకుని వస్తూ ఉంటే 'బాబూరాం పాడుయీ' గారింటిదగ్గరి చింతచెట్టుక్రిందికి వచ్చేసరికి వాడిముఖం విప్పారింది. ఆ చింతచెట్టుకింద గోలీలాట జోరుగా సాగుతోంది. అందరూ అక్కడి పల్లెవాళ్ళపిల్లలే. వాళ్ళలో పటూ ఒక్కడే బ్రాహ్మణకుర్రాడు. అపూ-పటూలకు అంత సావాసం లేదు. పటూ వాళ్ళ ఇల్లు అపూవాళ్ళయింటికిచాలాదూరం. అపూకంటె పటూ కొస్త చిన్నవాడు కూడా. అపూ మొదట ప్రసన్నగారి బళ్ళోకి వెళ్ళినవాడు బుద్ధిమంతుడిలా తాటాకులు నములుతూ కూర్చున్నకుర్రాడుకీ ఈ చిన్న సంగతి గుర్తుంది. అపూ వాడి దగ్గరికెళ్ళి-"ఎన్ని గోలీలున్నాయి?" అని అడిగాడు. పటూ గోలీలసంచి పైకితీసి చూపించాడు... రంగుదారాలతో అల్లినచిన్న సంచి అది-వాడికి అదంటే ఎంతో మక్కువ. "పదిహేడు గోలీలు తీసుకొచ్చా. వాటిల్లో ఏడు సీసపుగోలీలు. ఇవన్నీ ఓడిపోతే ఇంకా తీసుకువస్తా" అంటూ పటూ ఆ సంచి చూపిస్తూ "ఎలా ఉంది? మొత్తం ఆటలో గెలిగిన గోలీలన్నీ పడుతుందిది" అన్నాడు నవ్వుతూ.

ఆట మొదలెట్టారు. పటూ మొదట ఓడిపోయి, తర్వాత ఇహ గెలవటం మొదలెట్టాడు. తాను గోలీలాడటంలో ఘటికుణ్ణని, తనకు గురి తప్పటం అంటూ లేదని కొద్దిరోజులక్రితమే తెలుసుకున్నాడు పటూ.

అనువాదం:

మద్దిపట్ల సూరి

అందుకనే తనకు గెలుపు ఖాయం అనే ధీమాతో ఇంతదూరం వచ్చాడు ఆడటానికి. ఆట నియమాల కనుగుణంగానే వాడు కనుక గోలీ గురిచూసి కొట్టాడంటే-ఒక దెబ్బతో రెండో గోలీ 'ఎల' దాటి బయటికి దొర్లిపోతుంది. ఆనందంతో పటూ ముఖం ఇంతవ్వతుంది(?). వాడు అప్పుడు గెలిచిన గోలీలన్నీ సంచిలో వేసుకుని, ఆత్యాశతో, ఆనందంతో ఆ సంచీకేసి చూసుకుంటూ 'అః, ఇంకెన్ని గోలీలు ఇది నింపటానికి!' అనుకున్నాడు.

కొందరు పల్లెవాళ్ళ కుర్రవాళ్ళు వాడికేవేవో సలహాలు సూచించారు. అందులో ఒకడు "ఇంకొక బారెడుదూరం వెనక్కిపోయి కొట్టాలి దాన్ని. నీకు గురి తప్పటం అంటూ ఉండదు!" అని ఉడికించారు పటూని.

"ఏం, అలా దేనికు! గురి తప్పక పోవటం తప్పా. కిందకి ఎలా వస్తుందేమిటి! చేతయితే మీరూ గెలుచుకోండి. నేనేం అడ్డంవచ్చానా ఎవరికైనా?" అన్నాడు పటూ.

తర్వాత పటూ చుట్టూ చూశాడొకసారి. మిగిలిన పిల్లలంతా తనవైపే చూస్తున్నారు! 'ఇన్ని గోలీలు నే నిదివరకెప్పుడూ గెలిచి ఉండను(?). ఇహ ఇవాళ్టికి ఆడనింక. మళ్ళీ ఆడితే ఈ గోలీలన్నీ ఇంటికి పట్టుకు వెళ్ళటానికి ఉంటుందో లేదో! మళ్ళీ ఇంకా వ దూరం వెనక్కి వెళ్ళి అయినా కొట్టగలనని పందెం దేనికు? ఇవన్నీ ఓడిపోతానేమో!' అనుకున్నాడు పటూ. చటుక్కున వాడా గోలీలసంచీ చేతపట్టుకుని, "నేనిలా ఆడనింక. ఇంటికి వెళ్ళిపోతున్నాను." అన్నాడు. తర్వాత ఆ పిల్లలు తనకేసి కొరకొర చూడటం, వాళ్ళవాలకం అది గమనించి, తలవనితలంపుగానే తన గోలీల సంచిని గుప్పిటతో గట్టిగా పట్టుకున్నాడు.

ఒకడు ముందుకువచ్చి "అలా వీల్లేదోయ్, గెలవగానే పారిపోవటమేనాయేం? అంటూ సంచీ ఉన్న పటూ చేతిని గట్టిగా పట్టుకున్నాడు. పటూ చెయ్యి వదిలించుకోవాలని ప్రయత్నించాడు. కాని, వదిలించుకోలేకపోయాడు. ఇహ దిక్కుమొహం వేసి, 'అరె! విడిచిపెట్టు చెయ్యి' అన్నాడు. వెనకనుంచి ఇంకొకతెవరో(?) తోశారు వాడిని. వాడు ముందుకి పడ్డాడు. కాని సంచిమాత్రం వదిలిపెట్టలేదు. వాళ్ళు బలవంతంగా లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారని గ్రహించాడు. క్రిందపడ్డా ఆసంచిని పొట్టకింద అదిమిపట్టుకుందామనుకున్నాడు. కాని అసలువాళ్ళ కంటె పడిపోవటం ఒకటి, ఒంట్లో సత్తువ లేకపోవటం ఒకటి. బలంగా ఉండటమే

జరిగినకథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లల కిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లోవేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టువని చూసుకోవడం, కొట్టుకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది. కొట్లోకివచ్చేగ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్దసముదాయం వెనక వాడికి ఏవో చిత్రవిచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దారికనుక్కొని అక్కడికి వెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు. ఒకసారి తండ్రి ఏదో ఊరు వెడుతూ అపూనుకూడా వెంట తీసుకువెళ్లాడు. ఎప్పుడూ ఊరు విడిచి వెళ్ళని అపూ ఏదో కొత్తదేశాన్ని కనుక్కోడానికి పోతున్నవాడిలాగ అపూర్వానుభూతి పొందాడు.

★ పథేర్ పాంచాలి ★

కాదు, తనకంటె పెద్దవాళ్ళుకూడా అయిన ఆ పల్లెవాళ్లపిల్లలతో వాడెంతసేపు పెనుగులాడగలడు పాపం! చివరికి చాలాసేపటికి వాడిచేతిలో సంచి చిరిగిపోయి పడిపోయింది. గోలీలు చుట్టూ చెల్లాచెదరయినాయి.

అపూ మొదట్లో పటూ దురవస్థ చూసి, సంతోషించలేదనటానికి వీల్లేదు. ఎందుకంటే వాడూ చాలా గోలీలు ఓడిపోయినవాడే! మరి కాని పటూ క్రింద పడిపోవటం పైగా నిస్సహాయస్థితిలో ఉండి దెబ్బలెక్కువగా తినటం చూసేసరికి వాడికి మనసంతా ఎలాగో అయింది. అపూ గుంపును త్రోసుకుని ముందుకువచ్చి "చిన్నవాడు వాణ్ణి యెందుకు మీరంతాకలసి కొడతారు? ఆశ విడిచిపెట్టండిరా, విడిచిపెట్టండి" అని పటూని క్రిందనుంచి లేవతీయబోయాడు. ఇంతలో ఎవరో వెనుకనుంచి ఒక గ్రుద్దు గ్రుద్దటంతో వాడికేమీ కన్పించలేదు. కళ్లు బయర్లు క్రమ్మాయి తర్వాత తన్నులాటలో వాడూ క్రిందపడ్డాడు.

అపూ, ఆ రోజున ముక్కు చెక్కుపోకుండా దెబ్బలుతినవలసిరావటానికి అడ పిల్లలాగా తన్నే అబ్బనాకొడుకు పిల్లాడివడిమే కారణమైఉంటుంది. కాని ఇంతలో నీరేన్ ఆ దారిన రావటంతో ఆ గండం కాస్తా తప్పిపోయింది. ఆ జగడం పెట్టుకున్న వాళ్లంతా జారుకున్నారు. పటూకి బాగా తగిలాయి దెబ్బలు. నీరేన్ వాణ్ణి లేవతీసి ఒంటినంటుకున్న దుమ్మంతా దులిపాడు. కాస్త అలుపు తీర్చుకున్నాక పటూ చుట్టూ చూశాడు. చెదిరిపోయిన గోలీకాయల్లో ఒకటి రెండు తప్ప అన్నీ మాయమైనాయి. తాను ముక్కు నపడి ఆర్జించుకున్న ఆ గోలీల సంచికూడా మాయమైంది. తర్వాత వాడు అపూదగ్గిరకువచ్చి, "అపూదా! నీకు ఆట్టే తగల లేదుకద!" అని అడిగాడు.

మధ్యాహ్నమప్పుడు ఇంతదూరం పల్లెపిల్లలతో కలిసి గోలీలాడటానికి వచ్చినందుకు నీరేన్ ఇద్దరినీ కేకలేశాడు. కాలం గడవటానికిగాను నీరేన్ ఆ వీధిలో పిల్లలనందర్నీ ప్రోగుచేసి, అన్నదారాయ్ గారిమండపంలో ఓ బడి పెట్టాడు. రేపట్నుంచీ వాళ్లనిద్దర్నీ అక్కడికివచ్చి చదువుకుంటూ ఉండండని మరీమరీ చెప్పాడు. పటూ వెడుతూ వెడుతూ 'ఎంత చక్కటి సంచి నాది! ఆరోజున ఎంత ప్రతివారీ తెచ్చుకున్నాను 'సుబాస్' దగ్గిర్నుంచి! అది కాస్తా పోయింది! నేను గెలిచాక ఇంక ఆడనంటే వాళ్లేకేమో! అది నా ఇష్టం!...' అనుకోసాగాడు.

అపూ ఇంటికి రాగానే—"అక్కా! నేను నల్లవావిలిచెట్టుమొదట్లో వెదురు చువ్వ దాచుకుంటే దాన్ని కాస్తా నువ్వు విరిచి రెండు ముక్కలు చేశావా?" అని అడిగాడు దుర్గని.

దుర్గ దాన్ని విరిచినమాట నిజమే. "ఆం. నువ్వాలావు దాచుకున్నావులే వంకర బెత్తం! నీ దొక వెర్రి!— ఈ వెదురుతోపులో నాదికి తే ఇలా అలాంటి చువ్వే దొరకదా యేం? చువ్వలకు కరువొచ్చిందా!" అన్నది.

అపూ చిన్నబుచ్చుకుని, "కరువుకాదా యేం. నువ్వు అలాంటి చువ్వ ఒకటి తెచ్చి పెట్టు చూద్దాం. నేను ఎంతో కష్టపడి వెతికి తెచ్చుకోవటం, నువ్వేమో అవన్నీ విరిచి పాడుచెయ్యటం! బాగుంది!" అన్నాడు. వాడికి కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

"కావలసినన్ని తెచ్చి ఇస్తా ఇప్పుడు. ఈ మాత్రానికి ఏడుపు దేనికి?" అన్నది దుర్గ.

చేతిదగ్గిర వంకరగా ఉండే వెదురు చువ్వంటే అపూ జీవితంలో ఓ అద్భుతమైన వస్తువు. కొంచెం రొండి, మొదలు దగ్గిర

వంకరగా లావుగా ఉండి, పోనుపోను చివరికి సన్నగా ఉండే చువ్వ చేత్తో పట్టుకుంటే చాలు అప్పూ మనస్సు పులకరిస్తుంది. ఎక్కడలేని ఊహాలూ వచ్చిపడతాయి వాడి మనస్సుకి. అలాంటి చువ్వ ఒకటి చేత్తో పట్టుకుని, ఒక్కరోజున ప్రొద్దుటనుంచీ సాయంత్రంవరకూ తన చిత్తంవచ్చినట్లు వెదురుతోపుల్లోనో, ఏటిబడ్డునో తిరుగుతూంటాడు. ఒకసారి రాజపుత్రుడు, ఒకసారి పొగాకు వర్తకుడు, మరోకసారి యాత్రికుడు, ఇంకోకసారి సేనానాయకుడు, ఒకొక్కప్పుడు మహాభారతంలోని అర్జునుడు - ఇలా ఎవరైపోతే తన మనస్సుకు ఆనందమని అనిపిస్తుందో - అలా అన్నిరకాలగా అయిపోయినట్లు ఊహించుకుంటూంటాడు. ఆ వెదురుచువ్వ ఎంత లేలికగా, ఎంత సమపాళ్లైన వంకరగా ఉంటే వాడికి అంత ఆనందంగానూ ఉంటుంది - అన్ని ఊహాలుకూడా పుట్టుకువస్తూంటాయి. కాని అలాంటి చువ్వ సంపాయించటం అంటే ఎంత కష్టమో వాడికే తెలుసు. ఎంత శ్రమపడి వెతికితే దొరుకుతుంది!

కాని తాను ఇలా వెదురుబెత్తం ఒకటి చేత్తో పుచ్చుకుని, తిరుగుతున్న సంగతి ఎవరికీ తెలియకుండా ఉండటం విషయంలో అప్పూ చాలా జాగ్రతపడుతూంటాడు. ఇలా తన ఇష్టంవచ్చినట్లు గొణుక్కుంటూ తిరగటం చూస్తే ఇతరులు తనని పిచ్చివాడనీ, ఇంకేమో అనీ కూడా అనుకుంటారు. ఆ భయంతోనే జనం ఉండేచోట్లు, హఠాత్తుగా ఎవరైనా వచ్చేచోట్లు - అలాంటి వైపులకి వెళ్లకుండా, ఏ ఏటిఒడ్డునో, నిర్జనంగా ఉండే వెదురుతోపుల్లోనో, లేదా అంటే తమ ఇంటివెనుక చింతచెట్టు క్రిందనో తిరుగుతూ ఉంటాడు. వాడి జాగ్రత్తంతా ఆ స్థితిలో తన నెవరూ చూడకూడదని! ఎప్పుడయినా పొరపాటున ఎవరైనా ఎదుటపడితే నాలిక కరచుకుని, ఆ చేతిలో చువ్వ విసిరిపారేస్తాడు. వాళ్లేమని అనుకునిపోతారో అని తెగని సిగ్గు!

ఒక్క వాళ్ళ అక్కకిమాత్రం తెలుసు. తానలా తిరుగుతూ ఉండటం అక్క ఒకటి రెండు సార్లు చూసింది. కనుక అక్కయ్య దగ్గిర ఇహ దాస్తే మాత్రం లాభ మేముంది? అంచేత ఆ చువ్వ సంగతి అక్కని మొహం ఎదుటే అడిగేశాడు. మరెవరైనా అయినట్లయితే సిగ్గుతో అప్పూ ఈ సంగతి ఒక్కమాటి కడిగేవాడు కాదు. వాడికి ఆ వెదురుచువ్వకి ఏం సంబంధమో ఎవరికీ తెలియకపోయినా, అది అందరికీ తెలిస్తే తనను పిచ్చివాడికింద కట్టేస్తారనే అప్పూ అనుకుంటూ వుంటాడు. అలాంటి చువ్వ ఒకటి చేతికి చిక్కితే తిండీతిప్పలూ అక్కర్లేకుండా ఏ

★ పథేర్ పాంచాలి ★

నీటి ఒడ్డునో, నిర్జనంగా వుండే వీధి తోపుల్లోనో ఒక్కడూ ఎంత ఆనందంగా తిరుగుతూ గడపగలడో ఎవరికి తెలుసు!

"ఈ సంగతులేవీ అమ్మతో మాత్రం చెప్పకేం!" అని అక్కను బతిమాలుతున్నాడు...దుర్గ చెప్పలేదు. అపూ పిచ్చివాడని దుర్గకి తెలుసు. అమాయకుడు, అవ్యక్తుడు అయిన తమ్ముడిమీద ఎక్కడలేని అపేక్ష పుట్టుకువస్తుంది దుర్గకి. అవన్నీ అమ్మతో చెప్పి ఏం లాభం?

మధుసంక్రాంతినోము క్రితంరోజున సర్వజయ అపూని పిలిచి "రేపు మీ మాష్టార్ని భోజనానికి పిలిచి, మధ్యాహ్నానికల్లా రమ్మని చెప్పు" అని చెప్పింది.

ముతక బియ్యపు అన్నం, బొప్పాయికాయ కూర, అత్తిపళ్ళ పచ్చడి, అరటిదూట పప్పు, రొయ్యచేపల పులుసు, అరటికాయ వేపుడు, పాయసం...... దుర్గని వాళ్ళమ్మ వడ్డన చెయ్యమంది. బొత్తిగా ఏమీ చేతకాని పిల్ల-భయపడుతూ భయపడుతూ కూరగిన్నె నెమ్మదిగా తీసుకువచ్చి, అతిథి విస్తరిముందు పెట్టేసింది-తన నెవరైన కేకలేస్తారేమో అని భయం వేసిందా పిల్లకు. అంత ముతకబియ్యపు అన్నం తినటం నీరేన్‌కి అలవాటు లేదు. ఇంత తక్కువ నూనెతో, నేతితో చేసిన కూరలు ఎవరైనా అసలెలా తినగలరో అతడికి తెలియదు. పాయసం నీళ్ళలా ఉంది. నీళ్ళు కలిపిన పాలతో వండిన పాయసం. ఒకసారి పాయసం ఇంత నోటికి రాచుకోగానే పాయసంమీద హితవు సగం చచ్చిపోయింది. అపూ మాత్రం మంచి ఉత్సాహంతో తింటున్నాడు. ఇంత చక్కని భోజనం తను యింట్లో ఎప్పుడో ఒకటి రెండుసార్లు అమరింది. ఈ రోజు వాడికి జ్ఞాపకం పెట్టుకోతగిన పండుగ-'మీ రింకొంచెం పాయసం పుచ్చుకోండి మాష్టారూ!...' అని తాను మాత్రం అక్కను అదీ ఇదీ కొసరి కొసరి అడిగి వేయించుకుంటున్నాడు.

ఇంటికి రాగానే గోకుల్ భార్య నవ్వుతూ-"దుర్గ నచ్చిందా మరదీ? చక్కని చుక్క. అయితే ఏం, పాపం! పేదపిల్ల; వాళ్ళ నాన్న దగ్గిర డబ్బు లేదు. ఎవరి చేతుల్లో పడుతుందో యేమో? బ్రతుకంతా పడి ఉండి అనుభవించాలి. అన్నట్లు నువ్వు ఆ అమ్మాయిని చేసుకోరాదా మరదీ? కలిసిన సంబంధమే నాయె. రవ్వలాంటి పిల్ల. అక్కా తమ్ముడు ఇద్దరు అందక్కాగా బొమ్మల్లా ఉంటారు" అన్నది.

* * *

సర్వే ఉద్యోగుల డేరాలనుంచి తిరిగి వస్తూ నీరేన్ ఆ రోజున ఊరికి వెనుకగా ఉన్న మామిడితోట దారిన వచ్చాడు. చుట్టూ తోట-మధ్యగా సన్నటి దారి దాటి వస్తూంటే, తోటలోంచి ఓ అమ్మాయి బయటికి వస్తూ తన యెదుట పడింది. నీరేన్ గుర్తుపట్టాడు-అపూ అక్క, దుర్గే ఆ పిల్ల.

"ఈ తోట మీదేనా అమ్మాయీ?" అని అడిగాడు.

దుర్గ వెనక్కి తిరిగిచూసి సిగ్గుపడింది. ఏమీ మాట్లాడలేదు. తర్వాత తాను కొంత ప్రక్కకు ఒత్తిగిలి నీరేన్‌కి దారి వదలబోయింది.

"అహఁహఁ. వద్దు, నువ్వు ముందునడు. నువ్వు కన్పించటం మంచిదే అయింది. ఇటు ఈ దారినే ఒక చెరువుగట్టుకి వెళ్లి పడ్డా. తర్వాత ఇహ దారి తెలియలా—మీ తోటలిలా ఉంటాయి!"

దుర్గ వెడుతూ వెడుతూ ఉన్నదల్లా ఆగి వెనక్కి తిరిగి నీరేన్ ముఖంకేసి చూడబోయింది. ఇంతలో ఆ పిల్ల ఒళ్ళో ఉన్న కాయలేవో కాసిని క్రింద పడిపోయాయి.

"ఏమిటో పడిపోయాయి అమ్మాయీ! ఏం కాయలు అవి?" అని అడిగాడు నీరేన్.

దుర్గ వంగి వాటిని ఏరుకుంటూ, ఏరుకుంటూ "ఏం లేదు 'మేటే ఆలూ'" అన్నది సంకోచిస్తూ.

"తింటానికి బాగుంటాయా?"

ఆ ప్రశ్న దుర్గకి కుతుకాన్ని కల్గించింది. అయిదేళ్ళ కుర్రవాడికూడా తెలిసిన సంగతి, కళ్ళజోడూ అదీ పెట్టుకున్న—పెద్ద చదువు చదివిన అతడికి తెలియదు. "వీటిని తినరు. కొంత చిరుచేదుగా ఉంటాయి" అన్నది.

"మరి నువ్వు—"

దుర్గ కొంత సిగ్గుపడుతూ "నేను ఊరికినే తీసుకు వెడుతున్నాను—ఆడుకోటానికి" అన్నది. ఈ కళ్ళజోడు అబ్బాయినే ఆ రోజున వేళాకోళంగా వాళ్ళ పిన్ని పెళ్లి చేసుకుంటావా అని అన్న సంగతి గుర్తుంది. ఆ అబ్బాయిని పరిశీలనగా చూడాలని మహా అనుకుంది దుర్గ. కాని మధుసంక్రాంతిరోజునా అలా చూడలేకపోయింది. ఇప్పుడూ చూడలేకపోయింది...

"అపూని రేపు పుస్తకాలు తీసుకుని రమ్మన్నానని చెప్పు. చెపుతావా?"

దుర్గ వెడుతూ వెడుతూ అలాగే నన్నట్లు తల ఊపింది.

కొంత ముందుకువెళ్లి ప్రక్కనున్న దారి చూపించి, "ఈ దారిని వెడితే తిన్నగా వెడతారు మీరు" అన్నది.

"సరే, నేను కనుక్కోగలనులే ఇహ. నిన్ను కొంచెం దూరం పంపిస్తా ముందు నువ్వు ఒక్క తెవ్వా వెళ్లగలవా?

దుర్గ వ్రేలితో చూపిస్తూ "ఇదుగో కొంత దూరం వెడితే మా యిల్లు: నేను ఈ కొంత దూరం వెళ్లగలను మరి మీరు—"అన్నది.

దుర్గను ఇంతకుమునుపు నీరేన్ సరిగ్గా చూసి యెరుగడు. కళ్ళలో అంత సౌందర్యం. ఆ పిల్ల తమ్ముడు అపూ కళ్ళలో మాత్రమే చూశాడు. పల్లెప్రాంతాల్లో వరుసగా దట్టంగా క్రమ్ముకుని ఉండే, వకుళ చూత వృక్షాల్లోని శ్యామస్నిగ్ధత ఆ పిలదాని, విశాలనేత్రాల్లో అర్థస్ఫుటంగా ఉన్నట్లు తోస్తుంది. తెల్లవారిపోతే దింకా వేకువఝాము చీకటింకా విచ్చిపోకుండా అలాగే ఉంది. అయినా తెల్లవారబోతోందని తెలివిడి చేస్తూ ఉంటుంది. ఎంతో మంది పడుచులు ఏటికినీటికిబయలు దేరటం, ఇంటింటా కొత్తజంటలు ఎందరో జాగరణాలుసల్పటం-ప్రతి కిటికీలోనూ అగరుధూపవాసనలు క్రమ్ముకుని ఉండటం—ఏవేవో ఊహాకి పొడకడుతున్నాయి—అతడికి.

దుర్గ కాసేపు ఆగింది ఏదో చెప్పబోతున్నట్లు. చెప్పదలచుకున్న దేదో ఆ పిల్లకి జ్ఞాపకంరాలేదల్లే ఉంది అనుకున్నాడు నీరేన్. "అహఁ. నిన్ను కొంతదూరం పంపించనా అమ్మాయ్? పద, పోనీ మీ యింటిమీదుగానే వెడతాను నేను" అన్నాడు.

దుర్గ కొంచెం వెనకాముందాడింది. తరువాత ముఖం ప్రక్కకు తిప్పుకుని నవ్వుకుంది. ఈసారిహ మాట్లాడుతుంది అనుకున్నాడు నీరేన్. కాని మరుక్షణంలోనే దుర్గ అతడివెంట రాను అన్న భావాన్ని తెలిచ్చి, ఇంటివైపు వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం గోకుల్ భార్య డాబామీద బట్టలారవెయ్యటానికని వచ్చి, గదిలోకి తొంగిచూసింది. నీరేన్ పక్కమీద పడుకుని, ఎండ తపనకి అటూ ఇటూ దొర్లి, నిద్రకు ఇహ నీళ్లు వదులుకుని, క్రింద చాప వేసుకుని ఇంటికి ఉత్తరం రాస్తూ కూర్చున్నాడు.

గోకుల్ భార్య "నిద్రపోలేదా మరదీ? నిద్రపోయివుంటావని అనుకున్నాను నేను. ఇవాళ అరటిపువ్వు కూర తిననేలేదే! — విస్తట్లోనే వదిలేశావ్. మొన్న నా మధ్య ఓసారి మామూలుగానే తిన్నావుగా!" అని అడిగింది నవ్వుతూ.

"రా, వదినా... అరటిపువ్వు కూర ఎలా తినేది? తూర్పు బెంగాలీలంతా ఇంతే. ఆ కారం తింటూంటే కళ్లు కన్పిస్తాయా ఇంక! బయర్లుకమ్మవూ? ఏది కూరో, ఏది పులుసో ఎలా తెలుస్తుంది?"

గోకుల్ భార్య గుమ్మానికి చేరగిలపడి, అలవాటుప్రకారం పైటచెంగు గడ్డంక్రిందకు లాక్కొని నుంచుంది.

"పో మరదీ! బస్తీనాజూకులు పోతావ్ నువ్వు మరీను! ఈ మాత్రం 'కాస్త' కారం మీ బస్తీల్లో ఎవరూ తినరంటావా?"

"క్షమించు వదినా! ఇది కాస్తకారమే అయితే, మీరు మామూలుగా వేసే కారం ఎంత వుంటుందో, అదికూడా తినిచూడనిదే వెళ్లను నేనిక్కడినుంచి! ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. ఓ నాడెప్పుడైనా మొహమాటపడక వెయ్యి, నీ యిష్టం వచ్చినంత కారం వెయ్యి—"

"అమ్మో! అయితే మొహమాటపడే కారంనూరేబండ కాస్తా అవతల పారేసి మెదలకుండా కూర్చున్నానంటావా మరదీ? విసం డితడి మాటలు!..."

'ఎలా రాసిపెట్టిఉంటే'...పొట్ట చెక్కలయేటంత నవ్వు రావటంతో కళ్ళలో నీళ్లు తిరిగాయి ఆమెకి. కొంతసేపటికి ఆ నవ్వు తమాయించుకుని, "సరేకాని మీవైపున అక్కడ ఎండలెలా ఉన్నాయి మరదీ?" అని అడిగింది.

"అక్కడా? ఎక్కడ? కలకత్తాలోనా? పసిమటనా? పసిమట ఎండ లెలా ఉన్నదీ ఇక్కడినుంచి ఎలా తెలుస్తుంది? అవి ఇక్కడుంటే తెలియవు. వైశాఖమాసంలో పగలు కాని, రాత్రిళ్ళుకాని ఇళ్లలో పడుకోగలరా ఎవరైనా? సాయంత్రం మిద్దలమీద నీళ్లు చల్లించి, చల్లబడ్డాక పడుకోవాల్సిందే రాత్రిళ్ళు."

"మీరున్నది ఇక్కడికెంత దూరం ఏమిటి?"

"ఇక్కడినుంచి రైల్లో రెండు రోజులు ప్రయాణం. ఇవాళ ప్రొద్దున్న 'మాఝర్ పాడా' స్టేషన్లో రైలెక్కితే రేపు సాయంత్రానికక్కడికి చేరుకుంటాం."

"అవును గాని మరదీ! గయా, కాశీలవైపున కొండలు తొలిచి రైళ్ళు వేశారని అంటారు నిజమేనా?"

"నిజమే. అటూ ఇటూ పెద్ద పెద్ద కొండలపైన అడవి. వాటిల్లోంచి రైలువెడుతూంటే అంతా చీకటిమయం. ఏమీ కన్పించదు. రైల్లో దీపాలు వెలిగించుకోవాల్సిందే."

"అయితే మరి విరిగిపడవూ?" అని అడిగింది గోకుల్ భార్య ఉత్సుకతతో.

"ఎందుకు విరిగిపడతాయ్? పెద్ద పెద్ద ఇంజనీర్లు సొరంగాలు త్రవ్వారు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టారు. విరిగిపడటమే! ఏదీ మీ రాయ్‌గారి పీఠిపావంచాలు విరిగిపడుతూ ఉంటాయా యెప్పుడూ?"

'ఇంజనీర్లు' నేవాళ్లు ఎలా ఉంటారో గోకుల్ భార్యకి తెలియలేదు. "మట్టికొండలా అవి, రాతికొండలా?"

"మట్టివీ ఉన్నాయ్. రాతివీ ఉన్నాయ్. ఉహూఁ నువ్వు వట్టి పల్లెటూరిదానివి వదినా! రైల్లో ఎంతదూరం వెళ్లావ్?"

గోకుల్ భార్య మళ్ళీ ఓ చిత్రమైన నవ్వు నవ్వింది. కళ్లు ఇంచుమించు మూసుకుపోయాయి. ముఖం కొంచెం పైకెత్తి చిన్నపిల్లలధోరణిలో— "ఓహ్! చాలాదూరం వెళ్లాను. కాశీ, ప్రయాగ, గయ, మక్కా అన్నీ తిరిగాను: అదుగో, ఆ యేడు మా పిన్నత్తగారితో, పత్తూవాళ్ళ తల్లితో కలసి, 'ఆసెంఘాట్' దుగల్ కిశోర్‌ని చూడటానికి వెళ్లాను. అదే జన్మానికల్లా శివరాత్రి—రైలెక్కటం!"

ఈమె కాసేపట్లో ఏదో ఓ సామాన్య విషయాన్ని తీసుకుని సంతోషపరిహాసాల్లో ముంచెత్తగలదు-అది నీరేన్‌కి మహాయిష్టం! మనస్సునిండా సమృద్ధిగా సంతోషాన్ని నింపుకుని, అన్నప్పుడల్లా ఆ ఆనందప్రవాహాన్ని ఊరికేనే అంచులు పొర్లేట్లు చేసుకుని, ఎదుటివారినికూడా అందులోకి లాక్కొగలిగినవారుంటారు కొందరు. అలాంటివారిలో ఈ గ్రామీణవధువుకూడా ఒకతె. ఇప్పుడిప్పుడు ఆమె యెప్పుడొస్తుందా అని యెదురుచూసే స్థితికి వచ్చాడు నీరేన్. రాకపోతే చాలా నిరుత్సాహపడిపోతాడు. అంతేకాదు, మనసులో ఓమూల అభిమానం కూడా తలెత్తుతుంది.

"సరేకాని వదినా, మీరందరూ బయలుదేరండి, ఓసారి పశ్చిమబెంగాలంతా తిరిగి రావచ్చు" అన్నాడు.

"ఈ ఇంట్లోవాళ్లు పడమటంతా తిరిగి రావటానికి బయలుదేరటమూ! నువ్వొకడివేలే మరిదీ! అయితే మరి ఉత్తరపువైపు వంగతోట ఎవరు కాపలాకాస్తారు?" అంటూ చివరకు ఆమె మరొకసారి వ్యంగ్య మిశ్రితమైన పరిహాసంతో ఫక్కున నవ్వింది. కాసేపయాక కొంచెం గాంభీర్యం తెచ్చుకుని, గొంతు తగ్గించుకుని, "చూడు మరదీ! నా మాట ఒకటి నిలుపుతావూ?" అని అడిగింది.

"ఏంమాటో చెప్పాలి ముందు."

"నిలుపుతానంటే చెపుతా."

"ఒట్టి తెల్లకాయితంమీద సంతకం పెట్టటం నావల్ల అయేపనికాదు వదినా! నేను చదువుతున్నది 'ప్లీడరీ'! తెలుసుగా; ముందు అదేమిటో చెపితే విని, తర్వాత దానికి సమాధానం చెపుతా."

గోకుల్ భార్య గుమ్మం వదిలి లోపలికి వచ్చి, బట్ట చాటునుంచి కాగితపు పొట్లం ఒకటి బయటికితీసి, "ఈ దుద్దులు రెండూ నీ దగ్గర పెట్టుకొని నాకో అయిదురూపాయ లిస్తావూ?" అని అడిగింది.

నీరేన్ ఆశ్చర్యపోతూ "ఎందుకో చెప్పు" అన్నాడు.

"అది యిప్పుడు చెప్పను. ఇస్తావా మరి?"

"ఆ డబ్బు ఏంచేస్తావో ముందు చెప్పాలి లేకపోతే—"


గోకుల్ భార్య గొంతు తగ్గించుకుని, "నేనది ఒకచోటుకు పంపాలి. ఈ ఉత్తరంమీద ఇంగిలీసులో ఏదో చిరునామా రాసిఉంది చూడు" అన్నది.

నీరేన్ అది చదివి, "నీ తమ్ముడనుకుంటాను. అవునా?" అని అడిగాడు.

"ఉష్, ఉరుకో, ఈ యింట్లోవాళ్ళతో ఎవరితో అనకు. అయిదురూపాయలు కావాలని రాసిపంపాడు. ఎక్కడినుంచి తీసుకురాను చెప్పు? నేనెంత అస్వతంత్రురాలినో చూస్తున్నావుగా. అందుకని నేనేమనుకున్నానంటే—ఈ దుద్దులు రెండూ పెట్టుకుని అయిదు రూపాయ లిచ్చి వెళ్లు మరదీ! ఆ దౌర్భాగ్యపు కుర్రకుంకకి నాకంటె ఇంకెవరున్నారు లోకంలో?" గోకుల్ భార్యకు గొంతు బొంగురుపోయి, కళ్ళలో నీళ్లు తిరిగాయి.


'డబ్బు నేను యిస్తాన్లే వదినా! అయిదు కాదు, పదికావాలన్నా ఇస్తా. ఎప్పుడో అప్పుడు ఇస్తే ఇద్దువుగానిలే మళ్లీ, కాని దుద్దులుమాత్రం నా దగ్గర పెట్టుకోను".

గోకుల్ భార్య పరిహాసంగా తల "ఊగించి" అలా వీల్లేదు మరదీ! మంచివాడివేనే నువ్వు! తర్వాత నేను నీ ఋణం అట్టేపెట్టుకునే చచ్చిపోతే నువ్వు మరి-? అలా వీల్లేదులే. నువ్వు వీటిని తీసుకోక తప్పదు. సరె వస్తాను మరదీ! క్రింద బోలెడు పనులున్నాయి నాకు—" అంటూ గబగబా గదిలోంచి బైటికి వెళ్ళింది. కాని మెట్లదాకా వెళ్ళి మళ్ళీ తిరిగివచ్చి, "డబ్బు సంగతి ఎవరితోనయినా



శ్రీనగర్ సుందర దృశ్యాలు

ఫొటో: ఎస్. సుబ్రహ్మణ్య—వరంగల్.



★ పథేర్ పాంచాలి ★

అశేష్ మరదీ! ఎవ్వరితో అనకు. తెలిసిందా?" అన్నది.

* * *

దుర్గ బొంతలోనుంచి ఎంతో హుషారుగా" "అపూ, ఒరే, అపూ!" అని పిలిచింది.

అపూ మేలుకునే ఉన్నాడు. కాని ఇంతవరకు ఏమీ మాట్లాడలేదు. "అక్కా! ఆ కిటికీతలుపులు మూస్తావ్ కాస్త? భలే చలిగాలి వేస్తోంది" అన్నాడు. దుర్గ లేచి కిటికీతలుపులు మూసివచ్చి, "రాణూవాళ్ళక్క పెళ్లి ఎప్పుడో తెలుసా? ఇంకన్నాళ్ళో లేదు. చాలా హడావిడిగా జరుగుతుంది. ఇంగ్లీష్‌బ్యాండువాళ్లు వస్తారట. నువ్వెప్పుడైనా ఇంగ్లీషుబ్యాండు చూశావురా?" అన్నది.

"ఆఁ. అందరూ నెత్తిన టోపీలు పెట్టుకుని వాయిస్తారులే. పెద్దపెద్ద తూతువులూ, పెద్దపెద్ద డోళ్లు-నేను చూశానులే. ఇంకో రకం తూతువు కూడా వాయిస్తారు. సన్నగా ఉంటుంది. అంత పెద్దదిగా ఉండదు, దాన్ని 'ఫ్లూట్' అంటార్లే. ఎంతబాగా మోగుతుందనుకున్నావ్? ఫ్లూట్ ఎప్పుడైనా విన్నావ్?"

దుర్గ ఆలోచన ఇంకెక్కడికో పోయింది.

నిన్న సాయంత్రం తాను అపీథి పిన్నిగారింటికెళ్లింది. ఆ మాటలూ ఈ మాటలూ అయాక "దుర్గా! మరది నువ్వా ఎక్కడే కలుసుకున్నది?" అని అడిగింది పిన్ని. "ఎందుకుపిన్నీ?" అని అడిగి, తర్వాత ఆ నాటి సంగతంతా చెప్పింది. పరిహాసంగా అన్నది-"దారితప్పి, అక్కడే ఆ కందకం చెరువుదగ్గిరే పిన్నీ-ఆ అడవిలో-"

పిన్ని నవ్వుతూ "నిన్న నేను నీ సంగతి మరదితో చెప్పాను. 'పేదపిల్ల మరదీ! పెట్టుపోతలకు పెద్దశక్తి ఉన్నవాడు కాదు వాళ్లనాన్న. కాని పిల్ల బుద్ధిమంతురాలు. ఈకాలపు పిల్లలవంటి పిల్ల కానేకాదనుకో. దాన్ని చేసుకోరాదూ!' అన్నాను. దానిమీద మరది నీ సంగతులన్నీ చెప్పాడు. ఆ రోజున దారిలో నువ్వెక్కడ కన్పించిందీ, మరది దారితప్పి ఎటు వెళ్లిందీ అన్నీ చెప్పాడు. అది లగాయతు నేను మూడురోజులనుంచి మామగారిచేత మీ నాన్నకు చెప్పిద్దామని అనుకుంటున్నాను. మరదికి ఇష్టం ఉన్నట్లు తోచింది, నీకు కూడా నచ్చితే-" అన్నది....

దుర్గ గొడ్లచావడిలోంచి దూడను తీసుకువచ్చి బయట కట్టేసింది. కాని మామూలు రోజుల్లో అయితే ఇంట్లో పనికూడా ఏదో ఒకటి చెయ్యటం పరిపాటి. కాని ఇవాళ అలాంటిదేమీ చెయ్య బుద్ధిపుట్టలేదసలు. ఒక్కొక్కరోజున ఇలాంటి ఊహలేవో పుట్టుకొస్తాయి ఆ పిల్లకు. అలాంటి రోజున ఏమయినా ఇంట్లో నాలుగ్గోడ్లలమధ్య కట్టేసినట్లు పడిఉండలేదు-తన నెవరో దారుల వెంట, వీథులవెంట త్రిప్పుతూ తీసుకుపోతున్నట్లే ఉంటుంది. అలాంటిరోజున ఏదో చక్కనిగాలి వేస్తున్నట్లు-ఉదయం, అంత ఎండగానూ అంత చల్లగానూ లేనట్లు, నిమ్మపూలు ఏదో సువాసనలు వెదజల్లుతున్నట్లు—అలాంటి భావమేదో తట్టుతూ ఉంటుంది మనస్సుకి ; పైకిమాత్రం చెప్పలేదది.

ఇంట్లోంచి బయలుదేరి రాణూవాళ్ల యింటికి వెళ్లింది దుర్గ. భువనముఖర్జీ మంచి స్థితిమంతుడు. ఇది అతడి పెద్దకూతురి వివాహం. చాలా ఆడంబరంగానే జరగబోతుంది......గారడీవాళ్లు వచ్చి తమ యేర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో నాగస్వరం వాయించటంలో సీతానాథ్ చాలా పేరున్నవాడు. అతడికి బయానా ఇచ్చారు. వివాహానికిగాను ఎక్కడెక్కడినుంచో కుటుంబాలతో సహా వస్తున్నారు బంధువులు. వాళ్ల పిల్లల అల్లరితో మెల్లా అంతా రణగొణధ్వనిగా ఉంది.

దుర్గకి ఎంతో సంబరంగా వుంది. ఇంక కొద్దిరోజుల్లో ఈ యింట్లోనే ఎంతో బాణసంచా కాలుస్తారు. తారాజువ్వలూ అవీ కాల్చగా దుర్గ యెప్పుడూ చూడలేదు. ఒకసారి మాత్రం గంగూలీగారింట్లో ఏదో ఉత్సవంలో జువ్వల్లాంటివేవో కాల్చారు. జుఁయ్ మంటూ ఆకాశంలోకి ఎగిరి, మబ్బులకు పోయి తగులుకున్నాయి. అక్కడినుంచి మళ్ళీ క్రిందపడతాయేమో అన్నంత చిత్రంగా ఉన్నాయి అవి...రాకెట్లు అవి అన్నాడు అపూ.

మధ్యాహ్నం దాటాక తల్లి వసారాలో కొంగు వేసుకుని పడుకుంది. దుర్గ మళ్ళీ రివ్వున యింట్లోంచి వెళ్ళిపోయింది. ఫాల్గున మాసపు రోజులు. ఎండ చుర్రుమంటోంది. వేడివేడిగాలికి రాణూవాళ్ల తోటలోని పెద్ద వేపచెట్టు పండుటాకులు యెగిరి సుళ్లు తిరుగుతూ పోతున్నాయి ఎక్కడికో. ఎక్కడా ఎవరూ లేరు. పాలానివాళ్లయింటికి దగ్గరలో ఎవరో డబ్బా మోగిస్తున్నారు. ఏదో తమాషా చప్పుడయింది. ఆకుపచ్చపురుగులా వుంది ఏదో! దుర్గ తనకు తెలియకుండానే గుప్పిటతో కొంగు మెలివేసుకుంటూ చకితదృష్టితో చూడసాగింది దానికేసి.

ఆకుపచ్చ పురుగు కాదు—సుదర్శన్ అనే రెక్కలపురుగు.

గుప్పిటతో మెలేస్తున్న కొంగు దానంతటదే జారిపోయింది. దుర్గ ఎంతో ఆసక్తితో నెమ్మదిగా ఆ రెక్కలపురుగుకైపు నడిచింది. ఎదురుగా దారిలో వాలిఉంది. దాని రెక్కలమీద శ్వేత-రక్త చందన బిందువులు చిలకరించినట్లు మచ్చలున్నాయి.

"సుదర్శన్ పురుగు—అంటే పురుగు కాదు. భగవత్స్వరూపం అది. అది అసలు కంటపడడమే అదృష్టం అంటారు—ఆ మాట వాళ్ల అమ్మ అనగా విన్నది. ఇంకా చాలామందినోటకూడా విన్నది. నెమ్మదిగ క్రింద మట్టిలోనే కూర్చుని చేతులు రెండూ జోడించి, మెల్లిమెల్లిగా ఆ పక్షిదగ్గిరకు జరుగుతూ 'శుభాన్ని కలిగించు సుదర్శన్!...' అని ఇతరుల నోటివెంట తాను విన్నట్లే మూడుమాట్లు ఉచ్చరించింది.

తర్వాత తన స్వంతమాటలుకూడా ఆ మాటలకు కలుపుతూ—"అపూని కాపాడు, అమ్మని రక్షించు, నాన్నను రక్షించు, అపీథి పిన్నిని కాపాడు—"అని కాసేపు సంకోచించి, "నీరేన్‌బాబును కాపాడు—అతడితోనే నాకు పెళ్ళి అయేట్లు చెయ్యి సుదర్శన్. రాణూదీది పెళ్ళికిలాగా ఆడంబరాలేవి వద్దు" అని దణ్ణం పెట్టుకుంది.

భక్తురాలి అపరిమితభక్తిభావానికి ఉక్కిరిబిక్కిరి అయినట్లు ఆపక్షి భూమ్మీద చక్రాకారంగా తిరిగింది. దుర్గ మనసులోని కోర్కెలన్నీ వెల్లడించుకుంటూ ప్రార్థన పూర్తిచేసి, భక్తిశ్రద్ధలతో ప్రక్కకు తప్పుకుని వెళ్ళింది.

వీథిమధ్యనుంచి చూస్తూంటే పైన చెట్ల ఆకుల సందులనుంచి ఫాల్గునమాసపు నీలిమబ్బులు, నెమలిపింఛంరంగు మబ్బులు తనకేసి తొంగిచూస్తున్నట్లున్నాయి.

శాఖోటకపుచెట్లమధ్యనుంచి ఏటికి కాలిబాట ఒకటుంది. ఆ ఇరుకుదారి కటూ ఇటూ మామిడిచెట్లు. మామిడిపూతల మధుర వాసనలతో, సీతాకోకచిలుకలు — తుమ్మెదల రొదలతో, ఒత్తుగా ఉన్న మామిడిచెట్ల నీడల్లోని కోకిలల కూజితాలతో ఆ వీస్తున్న వేడిగాలిలోకూడా హాయిగానే ఉన్నట్లుంది.

ఆతోట దాటితే చైత్రపూర్ణిమ తిరునాళ్లు జరిగేచోటు. మైదానం అంతా దట్టంగా పెరిగిన మొక్కల్లో వుల్లరేగు మొక్క లేమైనా కన్పిస్తాయేమో అని వెతుక్కుంటూ నడుస్తోంది దుర్గ. వుల్లరేగుపళ్లు ఆట్టే ఉండే రోజులు కావు ఇవి. శీతకాలం వెనుకట్టగానే ఆచెట్లూ ఎండిపోవటం మొదలెడతాయి. అదుగో ఆ ఎత్తుగా ఉన్నచోట చెట్లని మొన్న యీమధ్య కూడా తాను ఆ పళ్ళు కోసుకుతిన్నది. ఇప్పుడొక్కటి కూడా లేవు; అన్నీ ఎండిపోయాయి. ఎండి రాలిపోయిన ఆ కాయలు మిరియపుగింజల్లాగా ఆపొదలక్రింద రాలి పడిఉన్నాయి. ఆచెట్లగుబురులక్రింద గోరువంకలు కీచుకీచు మంటున్నాయి. దుర్గ దగ్గిరకు వెళ్లగానే ఎగిరిపోయాయి అవి.

[ఇంకా ఉంది]

దూరాన కొండలపైనుంచీ, ఊరిచుట్టూ వెంకాయతోటలపైనుంచీ, కోనేటి కెరటాలపైనుంచీ మందమారుతం చల్లగా వీస్తూ ఏడు కొండలెక్కి అలసిపోయిన యాత్రికులకు హాయి కలుగజేస్తోంది బంగారు కోనేటి మధ్య నాలుగు కాళ్ళ మండపం లోనూ, కోనేటి కటువైపున రావిచెట్టు రెమ్మల్లోనూ, ఇటు దేవాలయ గోపురం లోనూ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి పాలారబోసినట్లు నింగినుండి నేలకు వ్యాపించిన వెన్నెల, విద్యుద్దీపాల వెలుగు ముందు తెల్లబోతోంది

రఘునాథరావు కోనేటినీటిలో బుడుంగున మునిగి పైకిలేచి, మెట్లపైన కూచున్న భార్యని చూస్తూ "ఇంతమాత్రానికే భయపడతా వెందుకు సుశీ! తెంపుచేసి నీళ్ళల్లో మునిగేయాలంతే, మళ్ళీ చలీ, గిలీ ఏమీ వుండదు" అన్నాడు

"నే నెప్పుడూ చన్నీటిలో స్నానం చేయలేదు బాబూ, నన్ను తొందరపెట్టకండి, మీకు పుణ్యముంటుంది" అంది సుశీల

సుశీల ఒడిలో కూచున్న చిట్టిపాప మాత్రం, తల్లి గనుక తనని వదిలిపెడితే ఒకసారి మెట్లన్నీ దిగి క్రింది మెట్టుపైన కూచుని నాన్నగారితోబాటే స్నానంచేయాలను కుంది ఓయబ్బో, ఒక్కసారిగా ఎందరు స్నానంచేస్తున్నారీ కోనేట్లో! అక్కడక్కడా కొందరు తల్లులేమో, నీళ్ళను చూచి పారిపోతున్న పిల్లల్ని బలవంతాన తీసుకొచ్చి నీళ్ళల్లోముంచి బయటికి పంపుతున్నారు మరి అమ్మమాత్రం తన నెందుకిలా వదలిపెట్టడంలేదు? చిట్టిపాప లేతబుర్రలో యిలా అలోచనలు సాగిపోతున్నాయి

రఘునాథరావు స్నానం ముగించి పైకి వచ్చి బట్టలు వేసుకున్నాడని సుశీల చిట్టితో సహా పాదప్రక్షాళనం చేసుకుని, ముఖం కడుక్కుని మెల్లిగా పైకివచ్చింది భార్యాభర్తలిద్దరూ చిట్టిని చెరోవైపున పట్టుకుని దేవాలయంవైపు నడవసాగేరు

"మరిప్పుడు వెంకాయ కొనుక్కోవద్దా నాన్నా" అని హెచ్చరించింది చిట్టిపాప

"దీని ధ్యాసెప్పుడూ వెంకాయపైన్నే నండీ!" అంది సుశీల

"వెంకాయొకటేకాదు పూలుకూడా కొనక్కోవాలి ఏం నాన్నా, కొనుక్కోవద్దూ?" అంది చిట్టిపాప.

"అన్నీ కొనుక్కుందాం లే పాపా! అంగళ్ళదగ్గరకే వెళ్తున్నాంగా" అన్నాడు రఘునాథరావు

ప్రాకారంముందు డబ్బాలకుల పాకల్లో వెంకాయలు రాసులకు రాసులుగా అమ్ముడు పోతున్నాయి రఘునాథరావు రెండు వెంకాయలకోసం ఐదు నిమిషాలు బేరం చేశాడు కానీ అర్ధణా కోసం అదోకపట్టింపుగా భర్త బేరమాడుతూ బజారులో నిలబడడం సుశీల కాదినుంచీ అంతమనస్కరించే విషయంకాదు అవసరాన్నిబట్టి వస్తువుకు కొంచెం అదనపు మూల్యం ముట్టజెప్పడానికి సుశీల ఎప్పుడూ వెనుకాడదు రూపాయల్ని చిల్లపెంకులుగా చూసే భాగ్యకుటుంబంలో పుట్టిన ఆడపడుచాయె మరి! ఆమెలో అంతమాత్రం దుబారాతత్వం ఉండడంలో ఆశ్చర్యమేముంది?

పరిస్థితులు కలిసిరానందంచేత రఘునాథరావు ప్రస్తుతం అణాకానీలకోసం అంత పట్టింపు చూపవలసిన అవసరం లేనిమాట నిజమే! కానీ అతడు లేమిలో పుట్టి లేమిలో పెరిగాడు ఇప్పటి సంగతంత గట్టిగా చెప్పలేం గానీ ఒకప్పుడతడు అణా కానీల విలువ బాగా ఎరుగును రైలుచార్జీ కొక అణా కొఱతగా వుండడంవల్ల, అతడు పదేళ్ళఈడప్పుడొకసారు పదిమైళ్ళదూరం నడిచాడు సినిమాహాల్లో ప్రవేశించేందుకు రెండణాల డబ్బులకోసం అతడొకసారు బస్సుస్టాండుదాకా ఒక బట్టల మూటని మోసుకెళ్ళాడు కానీ అలా ఎంతోకాలం జరుగలేదు రఘునాథరావు జీవితపథం వున్నట్టుండి ఒకచోట మలుపు తిరిగింది అది రఘునాథరావుకు అచ్చివచ్చిన మలుపు! అదృష్టం చేకూర్చిన మలుపు!

వెంకాయలు చేతిసంచిలో వేసుకుని రఘునాథరావు సతీసుతలతో పూలంగళ్ళవైపు నడిచాడు వేయికాళ్ళ మండపానికి ప్రక్కగా పెద్ద పెద్ద పూలంగళ్లు బారలు తీరి వున్నాయి గులాబిపూలసరాలు అంగళ్ళముందు వ్రేలాడుతున్నాయి మల్లెపూల మధురసుగంధం ముత్తెక్కిస్తోంది రఘునాథరావక్కడ ఒక క్షణంసేపు ఆగి

"ఏం పువ్వులు కొనుక్కోమంటావు సుశీ" అని అడిగాడు

"కదంబం కనబడదేమిటండీ యిక్కడ" అంది సుశీల

చేమంతులు అందంగా వుంటాయి మల్లెపూలు కమ్మని వాసన వెదజల్లుతాయి కనకాంబరాల సౌకుమార్యం మెచ్చుకోతగ్గది ఐతే ఈ మూడింటి కలయికవల్ల అందం, సుగంధం, సౌకుమార్యం కలసిపోయిన కదంబం ఏర్పడుతుంది సుశీలకు కదంబమంటే మహాయిష్టం!

రఘునాథరావు కదంబంకోసం చుట్టుప్రక్కల కలయజూచాడు అంగళ్ళకు కొంచెం దూరంలో ఒక ముసలావిడ పూలగంప ముందరుంచుకుని దండలమ్ముకుంటోంది "అదిగో సుశీ కదంబం" అంటూ అతడు అడుగు ముందుకు వేయబోయి అంతలో అక్కడే హఠాత్తుగా ఆగిపోయాడు

"ఏమండీ! వెళ్ళి పూలు కొనుక్కుందాం వేళ మీరిపోతోంది" అంది సుశీల

"అదికాదు సుశీ! ఆ పూలమ్ముకుంటున్న దెవరో పరకాయించి చూడు" అన్నాడు రఘునాథరావు అతడి కంఠంలో గాద్గద్యం సుశీలకు స్పష్టంగా వినిపించింది

ముసలావిడని పోల్చుకోడానికి సుశీలకి ఒకటి రెండు నిమిషాలు కావలసివచ్చాయి ఆమె చేష్టలుడిగి బొమ్మలా భర్త ప్రక్కన నిలుచుండిపోయింది

తల్లిదండ్రు లెందుకలా కొయ్యబారిపోయారో అర్థంగాక చిట్టిపాపసైతం తెల్లబోయింది.

దిగ్భ్రమలోనుంచి తేరుకున్న తర్వాత రఘునాథరావు సుశీలవైపు చూస్తూ "మమకారాలు గొప్పవే సుశీ! కానీ వాటికీ ఒక హద్దు వుంది ఆ హద్దు దాటినతర్వాత మనిషిలో మమకారం నశించి నిర్లిప్తత నెలకొంటుంది అందుకు ఆ ముసలావిడే సాక్షి" అన్నాడు

ఎదుటవారి కష్టనష్టాలు సుశీల గ్రాహ్యశక్తికి ఎప్పుడూ అంత అందుబాటులో వుండేవికావు కానీ ఆ క్షణానమాత్రం ఆమె కనుకొలకుల్లో రెండు కన్నీటి చుక్కలు నిలచాయి

"ఏమంటావ్ సుశీ! ఈ పరిస్థితిలో ఆమె ఎదుట నిలబడగల మనస్థైర్యం మనలో ఎవరికీ లేదుగదూ" అన్నాడు రఘునాథరావు

ఉన్నట్టుండి సుశీల చిట్టిపాపని చేత

బ్లౌజ్ తీసుకుని "నాకు చిట్టీ! అదిగో మా కేకెట్స్" అంది. [illegible] కుని కావలసిన ప్రవాహ జలంలా ఆమాటలు సుశీల లోపలినుంచి [illegible] బయటికి వచ్చాయి.

[illegible]

[illegible] సుశీల [illegible]

[illegible]


[illegible]

"[illegible]" అంది సుశీల.

[illegible]

[illegible]

[illegible]



ఏకాకి

ఫోటో: కె. ఎస్. ఎస్. [illegible]

[illegible]

[illegible] రఘునాథరావు.

[illegible]

[illegible]

★ ఏకాకి ★

మురవూ హెచ్చింది. నీకూ మరపైతే ఎలాగ! ఈ పూలుంచుకో తల్లో. నీకు కదంబమంటే మరీ యిష్టంకదూ! ఇవిగో, ఈ పువ్వులు నీకు, ఇవి చిట్టికి. చిట్టికి కొంచెం ఏకువ గానే వుండనీ, రెండు జడలు కద్దూ!" అంటూ పక్కన నవ్వింది.

*   *   •

అగోక పనిగా యిల్లాండ్రను వేపుకతినే యింటియజమానుల కోవకు చెందినవాడు కాదు సీతారామయ్య. అతడు భార్యని ప్రాణాధికంగా గాకపోయినా, ప్రాణసమానంగా నయినా చూచుకుంటూ వచ్చాడు. ఆమెకు కావలసినన్ని నగలు చేయించాడు. ప్రతి పండుగకూ క్రొత్త చీర కొని పెట్టాడు. ఆమెముద్దు ముచ్చటలు తీరడానికని ఆమె గర్భంగా వున్నప్పుడు సీమంతం పెళ్లి చేయించుకున్నాడు. బిడ్డలు పుట్టిన తర్వాత వాళ్లకి నామకరణమహోత్సవం భారీఎత్తున జరుపుకున్నాడు.

భర్త యిన్నినగలు చేసి పెట్టినా, యిన్ని చీరలు కొని పెట్టినా, బిడ్డలకు నామకరణమని, అన్నప్రాశనమనీ, అక్షరాభ్యాసమనీ అప్పుడప్పుడూ కొన్ని పబ్బాలు చేస్తున్నా అవన్నీ తనకోసం. కానట్టు సంచరించేది కామాక్షమ్మ. 'ఈ చీర ఎందుకు కట్టుకున్నావు కామాక్షమ్మా, ఈ పువ్వులే ఎందుకు పెట్టుకోవాలి కామాక్షమ్మా' ఇలాటి ప్రశ్నలకు 'ఈ చీరంటే మావారికిష్టం, ఈ పువ్వులంటే మావారికి చాలా ప్రీతి' ఇలాటి రెడీమేడ్ సమాధానాలు వచ్చేవి కామాక్షమ్మనుంచి. ఆమె ఏపని చేసినా, భర్తసుఖంకోసం, భర్తతృప్తికోసం చేసింది. తనవంటూ కొన్ని స్వంత అభిప్రాయాలను, అభిలాషలను ఆమె ఎప్పుడూ ఏర్పరచుకోలేదు. సీతారామయ్య పూవైతే ఆమె తావి. పూవులేక తావి వుండదు. తావిలేని పువ్వు వుంటుంది. తావికి ప్రత్యేకవ్యక్తిత్వం లేదు.

తొలిచూలు మగబిడ్డ. మలిచూలేమో ఆడబిడ్డ. పుట్టినబిడ్డ లిద్దరూ ఒక ఆకూ, డోకూ లేకుండా ఎదిగి చేతికొచ్చారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సీతారామయ్య ఆ యిద్దరికీ పెళ్ళిళ్లుచేసి అంతటితో తన బాధ్యత తీరిపోయినట్టు ఒకానొక నాటిమధ్యాహ్న భోజనానంతరం ఈజీచెర్లో కూచున్న మనిషి కూచున్నట్టుగానే కళ్లు మూసేశాడు.

భర్త మరణంతో కామాక్షమ్మకు యిహలోకంతో సంబంధం తెగిపోయినట్టే తోచింది. కొడుకు సంసారాన్ని చక్కదిద్దుకుంటున్నాడు. వాడిచేతిక్రింద ఇరవై వేల రూపాయల బట్టలవ్యాపారం సాగుతోంది. ఇటీవల ఒక హోటలుకూడా ప్రారంభించాడు. పైగా కృష్ణమూర్తికి పిల్లనిచ్చినమామగారు లక్షాధిపతులు! ఇక కూతురుంది. కామాక్షమ్మ ఎప్పుడు ఆలోచించినా ఆ కూతురునిగురించే ఆలోచించేది. అది నోట్లో నాలుకలేనిపిల్ల. అందుకు తోడు అల్లుడు వట్టి బోళాబాయి మనిషి. బొగ్గులనీ, కట్టెలనీ, ఎముకలనీ, ఏవేవో తలకు మించిన వ్యాపారాలు చేసి ఆస్తిని గుల్ల చేస్తున్నాడు. దూరాభారం ప్రయాణం కావడంచేత అప్పుడప్పుడూ కుమార్తెని చూచిరావడానికి పోసగడంలేదు. తనెప్పుడో మనవడి కర్ణభూషణోత్సవాని కని వెళ్ళి రెండునెలలపాటు వుండివచ్చింది ఆ మనవడికీపాటికి నాలుగేళ్ళు దాటివుంటాయి. ఈ మహారాజేమో ఆ వ్యాపారమేమిటో, ఆ హోటలేమిటో, వాడి మామగారి నిరవాకాలేమిటో, అవి తప్పా చెల్లెలిసంగతే పట్టించుకోడంలేదు.

ప్రక్కింటి పంతులుగారిని, ఎదురింటి అబ్బాయిని ప్రతిమాలుకుని కామాక్షమ్మ నెలకొకసారైనా అన్నపూర్ణకు జాబు వ్రాయించేది. ప్రత్యుత్తరాలు చాలా నిరాశాజనకంగా వుండేవి. ఏదో చెప్పరాని బాధను హృదయంలో దాచుకుని కుమిలిపోతూ ఆ బాధని వ్యక్తం చేయడానికి మాటలు స్ఫురించక వ్రాసిన నాలుగైదు పంక్తుల్లోనే కొండంత ఆవేదన వెలిగ్రక్కే అన్నపూర్ణని తలచుకుంటే కామాక్షమ్మ గుండె చెరువైపోయేది.

ఓరోజు సాయంత్రం కృష్ణమూర్తి ఒక కాగితం చేత బట్టుకుని వంటగదిదాకా వచ్చి "అమ్మా! టెలిగ్రాం వచ్చింది" అన్నాడు. కామాక్షమ్మకు గుండె ఆగిపోయి నంతపనైంది ఆమె తేరుకునేలోపలే కృష్ణమూర్తి "బావకు ఒళ్ళు జబ్బుగావుందట! తక్షణం ఎవరినైనా బయలేరి రమ్మంటున్నారు" అన్నాడు.

"అతడికొ జబ్బనేది మొదటినుంచీ వున్న కేకదరా! అదికాదులే. ఇప్పుడు మరీ ఏకలమీది కొచ్చివుంటుంది. లేకుంటే టెలిగ్రా మెందుకొస్తుంది" అంటూ కామాక్షమ్మ కంగారుపడిపోయింది

ఎప్పటిలాగే కృష్ణమూర్తి పనులతొందర వల్ల ఇల్లుకదలి వెళ్ళలేకపోయాడు. కామాక్షమ్మ రాత్రి ఎనిమిదిగంటల మెయిల్లో బయల్దేరింది. మెయిల్ శరవేగంతో పరుగిడుతోంది. కుమార్తెకూ తనకూ మధ్య దూరం తగ్గనూ తగ్గనూ కామాక్షమ్మ, హృదయంలో ఆరాటం ఎక్కువకాసాగింది నిర్నిమిత్తంగా తనకలాటి ఆరాటమూ, ఆందోళన కలగదనీ, నిజాని కేదో అనర్థం జరిగిపోయేవుంటుందని ఆమె మాటిమాటికీ అనుకోసాగింది.

ఆమె అనుమానం అక్షరాలా నిజమే అయింది. కామాక్షమ్మ యిక్కడ రైలెక్కిన ఎనిమిదిగంటల వేళకే అక్కడ అన్నపూర్ణభర్త ఆఖరిశ్వాస విడిచిపెట్టాడు.

కామాక్షమ్మ కూతుర్ని కావిలించుకుని కన్నీరుమున్నీరుగా విలపించింది. "ఇంత చిన్నతనంలోనే నీకూ నారాతేపట్టిందే అన్నపూర్ణా" అంటూ ఆక్రోశించింది

ఆశ్చర్యమేమంటే అన్నపూర్ణ ఉలకలేదు, పలకలేదు. శోకరసాధిదేవతలా సాక్షాత్కరించిన తల్లిని సైతం ఆమె పోల్చుకుందో లేదో చెప్పడంకష్టం. ఆమె అరవిచ్చిన కళ్ళతో ప్రపంచాన్ని శూన్యంగా చూస్తోందంతే!

దగ్గరున్నవాళ్ళు కామాక్షమ్మకు పరిస్థితిని వివరించిచెప్పారు భర్త కాయిలాపడినప్పటినుంచి రెండుమూడు నెలలుగా అన్నపూర్ణకు నిద్రాహారాలు సరిగ్గాలేవు. ఆహారంసంగతి ఎలావున్నా నిద్రమాత్రం బొత్తిగాలేదన్నా తప్పులేదు. అలా కంటికి రెప్పలా కాచుకుని వున్నప్పటికీ రోగి ప్రాణవాయువులు ఎప్పుడో బొందిని విడిచిపోయాయి. భర్త చనిపోయాడని తెలియగానే అన్నపూర్ణ శవంపైనపడి గుండె బ్రద్దలైపోయేట్టు ఏడ్చి మొత్తుకుంది తల బాదుకుంది ఆమెని ఓదార్చడానికి ఎవరికీ సాధ్యంకాలేదు తెల్లవారేవరకూ అలా ఏడుస్తూవుండిపోయి, ఆపైన ఆమె స్మారకం తప్పి క్రిందపడిపోయింది. ఉదయం తొమ్మిదిగంటలప్పుడు బలవంతాన నోరు తెరచి పాలుపోశారు. దాంతో కొంచెం తెప్పరిల్లుకున్నా మళ్ళీ మామూలు మనిషి కాలేకపోయింది. ఎవరు మాట్లాడినా ఓకర్రించి చూస్తుంది. బదులు మాట్లాడదు ఎవరేమడిగినా బదులు చెప్పదు. ఏడవబోతుంది గొంతు పెగలక మానేస్తుంది, అప్పుడప్పుడూ నవ్వుతుంది కూడా!

అల్లుడి చావు గోరుచుట్టయితే, కూతురి

పిచ్చివాలకం ఆ గోరుచుట్టుపైన రోకటి పోటులా తయారైంది కామాక్షమ్మకు!

ఆ సాయంత్రం శవదహనం రివాజు మేరకు జరిగిపోయింది. తరువాతి కర్మకాండలు సైతం యథావిధిగా జరిగిపోయాయి. కాలం యథాప్రకారం గడచిపోతూనే వుంది. కానీ అన్నపూర్ణలో మాత్రం మార్పు రాలేదు. మెడలోనుంచి మంగళసూత్రం తీయబోయినవాళ్ళని ఆమె రక్కి గిల్లి వాళ్ళపైన వెయ్యి శాపనార్థాలు ప్రయోగించింది. చేతుల్లోనుంచి గాజులు తీయబోయిన ఒక పూర్వసువాసినిని కాలువలో పడత్రోసింది. రేవుదగ్గరినుంచి యింటికి పారిపోయి గదిలో గడియ వేసుకుని పడుకుంది.

రాత్రంతా ఎందరో తలుపు తీయమని ప్రాధేయపడ్డారు. కూతుర్ని పిలిచీ పిలిచీ అలసిపోయి కామాక్షమ్మ తలుపుదగ్గరే పడుకుని నిద్రపోయింది. భళ్లున తెల్లవారేసరికి గదిలో చడీ చప్పుడూ లేవు. గునపాలు తెచ్చి తలుపును పగలగొట్టవలసివచ్చింది. లోపల అన్నపూర్ణ లోకవ్యవహారాలతో తనకేమాత్రం సంబంధం లేనట్టు నేలపైన పడుకునివుంది. కదిలించి చూశారు. లేపి కూచోబెట్టారు. పట్టువిడ్చగానే మేను మళ్ళీ నేలపైనే పడిపోయింది. వచ్చినవాళ్లు పెదవి విరచి, నిట్టూర్పు వదిలి బయటికి వచ్చేశారు. నుదుట కుంకుమ తిలకంతోనే, మెడలో మంగళసూత్రంతోనే అన్నపూర్ణ భర్తని వెదుక్కుంటూ వెళ్ళిపోయింది!

* * *

నాలుగేళ్లప్రాయాన్నే తల్లిదండ్రుల్ని గోల్పోయిన దురదృష్టజాతకుడు రఘు అమ్మమ్మతోగూడా మామగారిల్లు చేరాడు.

ఆ బుడుతడి రాకపట్ల కృష్ణమూర్తి కుటుంబంలో ఆసక్తి కనబరిచినవారెవరూ లేరు. రఘు చుట్టపుచూపుగా వచ్చి నాలుగురోజులుండి పోయేవాడైతే ఆ సంగతి వేరు. అతణ్ణిక ఎల్లకాలమూ ఈ కుటుంబమే భరించవలసివుంటుంది. ఇలాంటి ఆలోచనవల్ల వుత్పన్నమయిన ఉదాసీనభావమే రఘుకు ఆ యింట్లో స్వాగతం పలికింది.

కృష్ణమూర్తికి అత్తగారివైపున చెప్పుకోతగ్గ బంధుబలగముంది. పరస్పరవయోగుణభేదాలతో అతనికి మరదళ్ళే ఏడెనిమిదిమంది వున్నారు. ఆ ఏడెనిమిదిమందిలో హైస్కూలు చదువుకోసం కృష్ణమూర్తి యింట్లో నేవున్న యిద్దరుగాక, మిగిలిన వాళ్ళల్లో సైతం ఏ ఒకరిద్దరో అక్కడే వుండి చీరలు బేరం చేయడంలోనూ, నౌఖర్లను అదుపులో వుంచడంలోనూ, చాకలి పద్దులు వ్రాయడంలోనూ అక్కగారికి తోడ్పడుతుంటారు. ఇంట్లో ఆమూలనుంచీ ఈమూలవరకూ చేసతిరుగుతుండా ముచ్చటగా కుర్చీలో కూచుని కావలసిన వస్తువుల్ని తెమ్మని నౌకర్లకు హుకుం జారీ చేయడం ఆ అక్కచెల్లెళ్లకు చిన్నప్పటినుంచీ అలవాటయిన సుగుణాల్లో ఒకటి. ఇంట్లో 'మంది' హెచ్చినకొద్దీ నౌకర్లను హెచ్చించడానికీ, కృష్ణమూర్తి పొదుపరితనానికి పొత్తు కుదరకపోవడంచేత ఆ అక్కచెల్లెళ్ళకు కాలిపనీ చేతిపనీ చేసిపెట్టడానికి రఘు చక్కగా వుపకరించాడు.

కామాక్షమ్మ ఓ మంచిరోజు చూచి పలకాబలపం కొనిపెట్టి రఘుని పొరుగింటి పిల్లలతోబాటు బడికి పంపించింది. ఆ సాయంత్రం అతడింటికి రాగానే దగ్గర కూర్చోబెట్టుకుని "ఏదీ బాబూ! ఈ రోజు ఏం నేర్చుకున్నావో వ్రాయి" అంది. రఘు పలకనిండుగా 'ఓనమాలు' వ్రాసి సగర్వంగా అమ్మమ్మముఖంకేసి చూచాడు. కామాక్షమ్మ మనవణ్ణి ఒడిలో పడుకోబెట్టుకుంటూ "నా బాబుకి చదువెందుకు రాదు! వాడికే రాకపోతే ఆ చదువింకెవరికి వస్తుంది" అంటూ పరవశించిపోయింది.

తన పర్యవేక్షణక్రింద రఘు చదువు నిరభ్యంతరంగా సాగిపోగలదని కామాక్షమ్మ భావించింది. కానీ ఆమె కోరిక సఫలం కావడానికి ఆ యింట్లో అనేక ప్రతిబంధకాలు ఏర్పడసాగాయి.

ఓ రోజు ఉదయం కామాక్షమ్మ తోటలోకి వెళ్ళి దేవతార్చనకోసం పూలు కోసుకరావడంలో కొంచెం ఆలస్యమయింది. తిరిగివస్తూ, ఆమె, ఆ పాటికి రఘు బడికి వెళ్ళిపోయివుంటాడనుకుంది. కానీ అలా జరుగలేదు. సావిట్లో రఘు పలకా పుస్తకాలు అలాగే వున్నాయి. బడికి పోకుండా పిడుగా యింట్లో ఏంచేస్తున్నట్టు అనుకుంటూ ఆమె ఇల్లంతా వెదుకసాగింది. రఘు మేడమెట్లదగ్గర స్లిప్పర్సును తుడిచి, పాలిష్ వేస్తూ ఆమెకు ప్రత్యక్షమయ్యాడు.

"అదేమిట్రా! బడిమానేసి చెప్పులు తోముకుంటున్నావు" అని విస్తుపోయింది కామాక్షమ్మ.

"ఇవి నిర్మలత్తయ్య స్లిప్పర్సు అమ్మమ్మా! బాగా తోమి పెట్టమంది" అన్నాడు రఘు.

కామాక్షమ్మ కోపంతో ఆపాదమస్తకమూ కంపించిపోయి "నిర్మలత్తయ్య చెప్పులు తోమి పెట్టమంటుంది. కమలత్తయ్య బట్టలుతికి పెట్టమంటుంది. లీలత్తయ్య నీళ్ళు కావమంటుంది. ఇంకొకరింకొక పని చేయమంటారు. ఏతే నువ్వీ అందరివాళ్ళకీ చేస్తూ బడి మానుకుంటావట్రా" అంది.

ఏదో పనిమీద అక్కడ వచ్చిన యింటి యిల్లాలు ఆ విషయంలో స్వయంగా కలుగజేసుకుంటూ "ఏరేం పరవాలేదులే అత్తయ్యా! ఒకరోజు బడిమానుకున్నంతమాత్రంలో మీ మనవడిచదువు పాడుగాదులే" అంది.

★ ఏకాకి ★

"ఇక్కడ నిన్నెవరు మాట్లాడించా రమ్మా" అంటూ కౌమాతమ్మ ముఖం మరో వైపుకు త్రిప్పుకుంది.

"మాట్లాడించకపోయినా అవసరం వచ్చింది గనుక చెబుతున్నాను. మీ మనవణ్ణి ఒక దొరగారిలా చూచుకోవలసిన అవసరం మాకేమీ కనిపించడంలేదు. వాడి కిక్కడ రాచరికపు మర్యాదలు జరగాలంటే అదెలా కుదురుతుంది" అంటూ ఒక విసురుతో గృహిణి లోపలికి వెళ్ళిపోయింది.

కౌమాతమ్మ అభిమానం కలిగినమనిషి. "భర్త దగ్గరకూడా ఆమె ఒక మాట పడి ఎరుగదు. తనపట కోడలు చూపిస్తున్న నిర్లక్ష్యమూ, మనవడిపైన ఆయింట్లో అందరూ నెరపుతున్న అధికారమూ తలచుకున్న కొద్దీ ఆమె మనసు పరిపరివిధాల పోయింది. నిజానికీ యింటికి రఘు పరాయివాడేం కాదు. ఇక్కడ వాడికి కాకపోతే మరెవరికి జరగాలి రాచరికపు మర్యాదలు! మర్యాదల సంగతి దేవుడెరుగు, వేళకు పట్టెడన్నానికైనా పెటిపుట్టలేదా! ఆదిలోనే యిలా హింసపాదైతే, యింక రఘు బ్రతుకేం కావాలి! అబ్బే, తనకట్టె వుండగా అలా జరగడానికి వీల్లేదు.

కౌమాతమ్మ ఆరోజు సాయంత్రమే కుమారుడి దగ్గర మెల్లగా ఈ విషయాన్ని ప్రస్తావించింది. "ఒరే బాబూ! మీ ఆవిడతో చెప్పు. వాడు కాలంగాక ఈ యింట్లో పడివున్నాడు. అందరిలా వాడికీ తల్లీ దండ్రీ వుంటే వాడు మారాజులా బ్రతికేవాడే. వాడికి మీ కేమీ సిరిసంపదలు తలపై కెత్తవలసిన అవసరంలేదు. పట్టెడు తిండి పెటండంతే! వాణ్ణి చదువుకోనివ్వండి చాలు. వాడి బ్రతుకు వాడు బ్రతుక్కుంటాడు." అంటూ సంగ్రహంగా తన హృదయావేదన వెలిబుచ్చుకుంది.

కృష్ణమూర్తి తల్లి మాటలు తనకేమీ అర్థం కానట్టు తెల్లబోయి "అదేమిటమ్మా! ఇప్పుడు వాడికి మేము తిండి పెట్టడంలేదంటావా" అన్నాడు.

"తిండి సంగతలా వుండనీ! దాడిని బడికి వెళ్ళనీకుండా చెప్పులు తోమి పెట్టమనడం నీ కిష్టంగావుంటే చెప్పు" అని నిలదీసి ప్రశ్నించింది కౌమాతమ్మ.

"చెప్పులుతోమితే నీమనవడు అరిగిపోతాడనుకుంటున్నావామ్మా! కృష్ణమూర్తంటూ ఒకడు కాస్తా సిరిసంపదలతో బ్రతుకుతున్నాడు కాబట్టి సరిపోయిందిగానీ, లేకుంటే నీ మనవడు నిజానికి బూట్ పాలిష్ చేసుకుంటూ బ్రతకాల్సిందే! వాడిని గురించి నువ్వింత పట్టింపు పెట్టుకుంటే ఏం బావుంటుంది. అమ్మా! ఇదేం బావుండలేదు. ఎప్పటికయినా యిది చిక్కే. ఈ చిక్కును ఆదిలోనే విడిపించుకోవాలి వాడినెక్కడైనా అనాథశరణాలయంలో చేర్చేయడం మంచిది."

కౌమాతమ్మ ఎందుకో పకాలుననవ్వింది నవ్వి "ఒరేబాబూ! ఆమాట నీనోటంట వచ్చినందుకు నవ్వాను వాడిని అనాథల్లో చేర్చెయ్యాలంటున్నావు వాడి తండ్రి చనిపోయాడు. తల్లి చనిపోయింది. కానీ నేను చావలేదు, బ్రతికేవున్నాను. నేను బ్రతికున్నంతవరకూ వాడనాథ కాడు, నీ కిష్టంలేకపోతే చెప్పు, వాడూ, నేనూ నీ యింట్లోనుంచీ వెళ్ళిపోతాము" అంది.

"పోయే వాళ్ళని ఎవ్వరాపగలరు" అంటూ కృష్ణమూర్తి పైకిలేచి, గబగబా మేడమెట్లెక్కసాగాడు.

కౌమాతమ్మ ప్రశాంతమైన స్వరంతో నే "మంచిమాటన్నావురా బాబూ! నువ్విలా అన్నప్పుడు, యిక్కడ మాకేముంది! పోతాములే" అంది

అన్నంతపనీ చేసింది కౌమాతమ్మ మరునాడు తెల్లవారేసరికి ఆయింట్లో అవ్వా మనవళ్లు కనిపించలేదు

*   *   *

కొడుకు అమాకీ తీయడానికి వీల్లేని దూరప్రాంతానికి వెళ్ళిపోయింది కౌమాతమ్మ. ఒక పట్టణానికి చేరువగా, తనకి సీతారామయ్యగారేనాడో చేసిపెటిన చెవుల కమ్మలు అమ్మి ఒక చిన్న గుడిసె వేసుకుంది. మిగిలిన డబ్బుతో ఒక పాడిగేదె కొనుక్కుంది. రఘు మళ్ళీ బడిలో చేరాడు. కౌమాతమ్మ తెల్లవారుఝామున అయిదు గంటలకే లేచి దీపం వెలిగించి రఘుని లేపుతుంది. రఘు వాచకం చదువుకుంటూ వుండగా చెత్తతోసి, గుడిసెముందు కళ్ళాపు చల్లి, వచ్చీరాని ముగ్గులు రెండు వేసి నీళ్ళకోసం బిందెతీసుకుని కాలువకు వెళ్తుంది. ఆమె తిరిగి వచ్చేసరికి తెల్లగా తెల్లవారుతుంది రఘు ఆపాటికి పళ్లు తోముకుంటాడు. వాడికి చద్దన్నం పెట్టి, కౌమాతమ్మ పాలుపిండుకుంటుంది. క్రితం రోజు తట్టి పెట్టిన పిడకల్ని గంపలోవుంచుకుని తల కెత్తుకుని, కుడిచేతిలో పాలచెంబు తీసుకుని రఘు వెంటరాగా, పటణంలోకి బయల్దేరుతుంది మార్కెట్టురోడ్డుదగ్గర ఇద్దరూ చీలిపోతారు. చర్చిరోడ్డువెంబడే రఘు స్కూలుకి వెళ్ళిపోతాడు. కౌమాతమ్మ తను వాడుకగా పాలిచ్చేవాళ్లయిళ్లకు వెళ్ళి పాలుపోసి ఎన్నికవ్వలిచ్చిందో అన్ని ఎర్రటిచుక్కలు గోడపైన బెటి, తిరిగి యింటిదారి పడ్తుంది. త్రోవలో పిడకలుసైతం అమ్ముడుపోతాయి చిల్లరగానైతే కానీకి ఆరు చొప్పునా, టోకుగా నయితే అణాకు ఇరవై అయిదు చొప్పునా పిడకలు అమ్ముడుపోయేవి

ఐనా కౌమాతమ్మకు బ్రతుకు భారమనిపించలేదు రఘు శ్రద్ధగా చదువుకుంటూ ప్రతిక్లాసులోనూ మొదటివాడుగా ప్యాసౌతూ వచ్చాడు. వాడు హైస్కూల్లో చేరిన రోజున కౌమాతమ్మకు మహదానందం కలిగింది. రఘు హెడ్మాస్టరుదగ్గరికి వెళ్ళి, తనకు అమ్మమ్మతప్ప నెవరూ లేరని మనవి చేసుకుని అర్ధజీతానికి సిఫారసు చేయించుకున్నాడు. ఐదు రూపాయలు పెట్టి, అన్నీ సెకండుహాండు పుస్తకాలే కొని,

వాటిని స్వయంగా ఖైందుచేసుకున్నాడు. కాలానికి పరుగెత్తడం సహజగుణమైనా, మనుష్యుల జీవితంలో అదెవరికైనా మరింత వేగంతో పరుగెత్తినట్టు తోస్తుంది. రఘు హైస్కూల్లో చదువుకున్న ఆరేళ్లు ఆరు క్షణాల్లో గడచిపోయాయి.

కామాక్షమ్మ అంతటితో తన బాధ్యత తీరిపోయినట్టు భావించలేకపోయింది. రఘు కాలేజీలో చేరి కనీసం బియ్యే అయినా పూర్తిచేయాలి. అంత మాత్రం చదువు లేకపోతే ఈరోజుల్లో చెప్పుకోదగ్గ ఉద్యోగం దొరకడంలేదు. నా అన్నవారు తృణీకరించి దూరంచేసినవాడు రఘు, తన తల్లితోబాటు రక్తం పంచుకుని పుట్టిన మేనమామ దృక్పథంలో బూట్సులు పాలిష్ చేయవలసినవాడు, అనాథల్లో కలసిపోవలసినవాడు రఘు. అలాటి రఘు ఆ మేనమామ తలదొక్కేటట్టు తాశీల్దారు కావాలి! అడ్వోకేటు కావాలి! ఇంకా మాట్లాడితే కలెక్టరు కావాలి! అంతకంటే ఉన్నతోద్యోగాలు కామాక్షమ్మకు స్ఫురించలేదు.

గవర్నమెంటు స్కాలర్‌షిప్పుతో కాలేజీ చదువు ముగించిన రఘు ఉద్యోగ విషయంలోమాత్రం అమ్మమ్మకు కొంచెం అశాభంగాన్నే కలిగించాడు. రఘూ దెప్పుడూ మనుషులతో కలిసిపోయే కలుపుగోలు స్వభావం. కాగితాలపైన రాతకోతలు చేసుకుంటూ కాలంగడిపివేయడం అతడి మానసికప్రవృత్తికి నచ్చలేదు. అందుచేత అతడు ఏరికోరి తను చదివిన కాలేజీలోనే లెక్చరరు వుద్యోగం స్వీకరించాడు.

ఉద్యోగం దొరికిన తర్వాత రఘు జీవితం సాఫీగా గడచిపోసాగింది. కాపురాన్ని గుడిసెలోనుంచీ తన హోదాకి తగినట్టు ఒక చిన్న మేడలోకి మార్పించాడు. వంటచేసి పెట్టడానికొక వంటలక్కని కుదుర్చుకోమని కూడా అమ్మమ్మకి సలహాయిచ్చాడు. కానీ కామాక్షమ్మమాత్రంససేమిరా అలాటి పని జరగ్గూడదంది. "బుద్ధి తెలిసినప్పటినుంచీ చెమటోడ్చి, ఎముకలు విరిచి, నజ్జుగుజ్జయిన కట్టెరా బాబూ! ఇదింకా పదేండ్లపాటు పనికొస్తుందిలే, ఆపైన పెట్టుకొందువుగానీ లే వంటలక్కను" అందామె.

"అదేమిటే అమ్మమ్మా! పదేళ్ళ తర్వాత గూడా వంటలక్క ఎందుకు? నన్నొక యింటివాణ్ణిగా చేసే వుద్దేశం యిప్పుడప్పుడే నీకు కలిగేట్టు లేదే!" అంటూ నవ్వాడు రఘు.

"కాలంకలిసిరావాలిరాబాబూ! అంతా దేవుడి దయ" అంది కామాక్షమ్మ.

కామాక్షమ్మ ఆశించినట్టు కాలం కలిసి వచ్చింది. అనతికాలంలోనే రఘుజీవిత కావ్యంలో సరిక్రొత్త ఆశ్వాసం ప్రారంభమైంది.

ఓ రోజు సాయంత్రం రఘు కాలేజీనుంచీ తిరిగివచ్చి "రేపు మనింటికొకరు రాబోతున్నారమ్మమ్మా! మనం ఆతిథ్యమివ్వాలి" అన్నాడు.

"నీ స్నేహితుల్లో నాకు తెలియనివారెవర్రా! పేరు చెప్పకూడదూ" అంది కామాక్షమ్మ.

"స్నేహితుడు కాదులే అమ్మమ్మా! నువ్వు మరేం కోప్పడకుంటే చెబుతాను. రేపు రాబోయేదొక స్నేహితురాలు."

"స్నేహితురాలా! అదెవర్రా బాబూ!" అంటూ నివ్వెరపోయింది కామాక్షమ్మ. రఘు సిగరెట్ గాల్లో ఊపుకుంటూ, నవ్వుతూ వెళ్ళిపోయాడు. కామాక్షమ్మ మాత్రం రాబోతున్న రఘు స్నేహితురాల్ని గురించి ఆలోచించుకుంటూ తలుపు దగ్గరే కూర్చుండిపోయింది!

మరునాటి వుదయం రఘు పనిగట్టుకుని అమ్మమ్మతోసహా వంటగదిలో కూచున్నాడు. "విందు దివ్యంగా వుండాలి అమ్మమ్మా! వంకాయలు కూర చెయ్. చిక్కుడుకాయలు వేయించు మజ్జిగ తిరగబోతపెట్టు. శ్రమ అనుకోకుండా, పాయసం..." అంటూ అమ్మమ్మ కెక్కడ కోపం వస్తుందోనని ఆగాడు.

కామాక్షమ్మకు కోపం రాలేదు. జంకుతున్న మనవణ్ణిచూచి నవ్వుతూ ఆవిడ "ఇంతకూ ఆ వచ్చేది ఏవూరి దొరసానిరా" అంది.

"దొరసానేమిటి! తినబోతూ రుచులడగడమెందుకు? నువ్వే చూద్దువుగానీ వుండు" అన్నాడు రఘు.

పదకొండు గంటలకు యింటిముందు రిక్షా ఆగింది. చెంపకు చేరడేసి కళ్ళతో ఓ పిల్ల లేడిపిల్లలా అందులోనుంచీ బయటికురికి ద్వారందగ్గర నిల్చునివున్న కామాక్షమ్మకు నమస్కారం చేస్తూ లోపలికొచ్చింది. ఆ క్షణాన కామాక్షమ్మలో చెలరేగిన భావాల్ని మాటల్తో వ్యక్తం చేయడం సులభసాధ్యంకాదు. అప్రయత్నంగా ఆమెలో అనురాగం ప్రవాహంలా ఉప్పతిల్లి, ఆ ప్రవాహం అదృశ్యంగా ఆ అమ్మాయిని అభిషేకించసాగింది. ఆమె చేతులు చాచి ఆ అమ్మాయిని కౌగలించుకోవాలని కూడా అనుకుంది. కొంతసేపు గడచిన తర్వాత ఆ అమ్మాయిపట్ల తన కెందుకిలాంటి అకారణమైన అవ్యాజానురాగం కలిగిందో తెలియక కామాక్షమ్మ తెల్లబోయింది.

వచ్చిన అమ్మాయి నట్టింట్లో పరచిన చాపమీద శరీరం ముడుచుకుని ముచ్చటగా కూర్చుంది. ఆమె నెలా మాట్లాడించాలో తెలియక కామాక్షమ్మ నాలుగైదు క్షణాలపాటు ఊరుకుంది. ఒక పెళ్ళికాని అమ్మాయి ఇలా జంకుగొంకులు లేకుండా పాయింటికి రావడమనేది కామాక్షమ్మకు అనూహ్యమైన విషయం. అందువలన కలిగిన అబ్బురం ఒకవైపున అలా వుండగానే ఆమె ఆ అమ్మాయి దగ్గరికివచ్చి చాపపైన కూచుంటూ "చదువుకుంటున్నావా అమ్మాయీ" అని ప్రశ్నించింది.

"ఈ సంవత్సరమే కాలేజిలో చేరానండీ" అంది ఆగంతుక యువతి.

"ఐతే మా రఘుకి శిష్యురాలివన్నమాట! అవునుకదూ" అంటూ కామాక్షమ్మ మెల్లగా నవ్వడానికి ప్రయత్నించింది.

ఆ అమ్మాయి అవునన్నట్టు తలఆడించి అలమారానుంచీ ఒక పుస్తకంతీసి తిరగవేయసాగింది.



వికచ మందారం
ఫొటో: ఎ. ఆర్. జోనేపల్లి—రేపల్లె.

★ ఏకాకి ★

"కొత్తలో వచ్చావు. మీయిల్లక్కడికి చాలా దూరమనుకుంటాను" అంటూ మళ్ళీ ప్రారంభించింది కామాక్షమ్మ.

"ఇల్లుకోఠండీ! దగ్గరే. నేను హాస్టల్లో వుండి చదువుకుంటున్నాను."

"ఐతే మా రఘుకు తోడన్నమాట."

"అందుకు ప్రత్యుత్తరం రాకముందే అన్నం చేసి వచ్చిన రఘు "అక్కా కొంచెమన్నా. తరువాత తెలుసుకుందువుగాని ఆ వివరాలన్నీ" అన్నాడు.

కామాక్షమ్మ గదిలో పీటలు వేసి అన్నం వడ్డించింది. సుశీలతోపాటే రఘు కూడా భోజనానికి కూచుంది. కామాక్షమ్మ వడ్డిస్తూ "ఐతే యింతవరకూ ఎక్కడ చదువుతున్నావమ్మాయీ" అని మళ్ళీ సంభాషణ కుపక్రమించింది.

"గూడూరులోనే నండీ"

"గూడూరులోనే! ఏంరా రఘూ! ఐతే ఈ అమ్మాయిది మనూరేనన్నమాట!" కామాక్షమ్మకు నిజంగా చాలా ఆశ్చర్యమే కలిగింది.

"మీదికూడా గూడూరేనని నాకు చెప్పలేదేమండీ!" అంటూ ఆ అమ్మాయి సైతం రఘుని చూస్తూ ఆశ్చర్యం ప్రకటించింది.

రఘు ఏమీ చెప్పకుండా ఎంతో బుద్ధిమంతుడిలా వంటకాల రుచి చూస్తూ కూచున్నాడు.

"వా చెప్పడమా అంతేలే అమ్మాయీ! చెప్పవలసింది తప్పా మిగిలినవన్నీ చెబు తాడు. పోనీలే, గూడూరులో మీయిల్లే క్కడుంది" అంది కామాక్షమ్మ.

"[illegible] నండీ"

"[illegible]! అమ్మాయీ, అంతకంతకూ దగ్గరౌతున్నావు. మీనాన్నగారి పేరేమిటి?"

"కృష్ణమూర్తిగారు."

కామాక్షమ్మ చేతిలోనుంచి నేతిగిన్నె జారి టకీమని క్రిందపడింది. కాని నెయ్యి నేలపాలు మాత్రం కాలేదు. అరపడి నేయి సరాసరి రఘు ఆకులో జారిపోయింది.

"ఇంత నెయ్యి నేనేం చేసుకోనే అమ్మమ్మా" అంటూ రఘు చిత్తరుపోయి అమ్మమ్మవైపు చూశాడు.

కామాక్షమ్మ గరిటె క్రిందవుంచి రఘు ఆకులోవున్న నేతిలో సగంతీసి అమ్మాయి విస్తరిలో వేసింది.

"అదేమిటే అమ్మమ్మా! ఎంగిలి కదూ?" అంటూ ఆశ్చర్యపోయాడు రఘు.

"మన [illegible] నీకూ ఆ అమ్మాయికీ మధ్య ఎంగిలేం వుంది బాబూ! ఇది రక్తసంబంధం [illegible]" అంది కామాక్షమ్మ.

ఆరోజు సాయంత్రం కామాక్షమ్మ మనవరాలికి తల దువ్వుతూ "[illegible] అమ్మాయీ [illegible]!" అని అడిగింది.

"పదిహేడో ఏడు జరుగుతోంది బామ్మా" అంది సుశీల.

"నేను రఘుతో యిల్లు విడిచిపెట్టినప్పుడు నువ్వు ఏడాది దాటని పసిదానివి. మేము యిల్లువిడిచి పదహారేళ్ళు కావస్తున్నాయి. ఇప్పుడు రఘుకి ఇరవైమూడేళ్ళు నీకు పదహారేళ్ళు. మీ రిద్దరూ ప్రక్క-ప్రక్కన నిలబడినప్పుడు చూశాను. నువ్వు వాడి భుజాలదాకా వస్తావు. నేనీజన్మలో మీ నాన్న ముఖం చూడనని అనుకున్నాను. అంతేందుకూ! నాకు కొడుకే లేడని భావిస్తున్నాను. కాని మనసు అనుకోవడంలో ఏముంది? దేవుడు మరోవిధంగా అనుకున్నాడు" అంటూ సుశీల తల్లో పువ్వులు తురిమింది కామాక్షమ్మ.

రఘుకూ సుశీలకూ వివాహమైన తర్వాత కామాక్షమ్మకు తన జీవితంలో నిర్వహించవలసిన కార్యభారాలన్నీ ఒక కొలిక్కి వచ్చినట్టు ఇటుపైన తనకు విశ్రాంతి మాత్రమే మిగిలినట్టు తోచింది. ఐనా గోళ్ళు గిల్లుకుంటూ వృథాగా కాలం గడిపి వేయడం ఆమె స్వభావానికి విరుద్ధం. లోకంలో మానవులు వ్యక్తిగా రెండు తరగతులుగా వుంటారు. మొదటితరహా వారేమో ఇతరులపైన పెత్తనం చెలాయించ

డానికి మాత్రమే బ్రతుకుతారు. రెండో తరగతివారేమో పిన్నలకూ, పెద్దలకు చాకిరీ చేయడంలోనే బ్రతుకు వెళ్ళబుచ్చుతారు కామాక్షమ్మ రెండో వర్గానికి చెందిన మనిషి.

పెళ్ళయిన తర్వాత నాలేళ్ళకు రఘుకి మరో వూరుకి ట్రాన్స్‌ఫరు వచ్చింది. ఆ వూళ్ళో రఘు అంతస్తు మరో మెట్టు పెరిగింది. అంతకుముందుండిన వూళ్ళో రఘుని చిన్నప్పటినుంచీ అందరికీ తెలుసు కామాక్షమ్మ పిడకలమ్మి, పాలమ్మి రఘుని చదివించిన సంగతి వాళ్ళకు సుపరిచితం. క్రొత్తవూళ్ళో రఘు అందరికీ అపరిచితుడు పైగా వరకట్నం తాలూకు వస్తువాహనాలతో అతడు వాళ్ళకొక పిల్ల జమీందారులా కనిపించాడు. అందుకుతోడూ సుశీల మహిళాసమాజంలో సభ్యురాలుగా చేరి తన మాటకారితనంవల్ల దానికి కార్యదర్శి కాగలిగింది. కలెక్టరుగారి కూతుళ్ళు, ప్లీడరు భార్యలు ఇంటికి రావడం పోవడం సాగించారు వీథంట వెళుతున్న రఘుకి ఆడు తగిలి నమస్కరించి కుశల ప్రశ్నలు వేసేవారి సంఖ్య ఎక్కువైంది.

ఈ క్రొత్త వాతావరణం రఘుకి, సుశీలకి ఎంత ఆనందప్రదమయిందో అంతగా కామాక్షమ్మ అక్రొత్తపరిస్థితుల్లో ఉక్కిరిబిక్కిరైపోయింది. పడకకుర్చీలో చేరగిల బడి తనతో తీరిగ్గామాట్లాడ్డానికి రఘుకిప్పుడు వ్యవధి చిక్కడం లేదు మహిళాసమాజపు కార్యకలాపాల్లో చిక్కుకున్న సుశీలకు రెండేళ్ళ చిట్టిపాపకు పాలివ్వడానికైనా అవకాశం దొరకడం లేదు.

క్రొత్త పరిసరాలకు తగినట్టు నడచుకోవడం కామాక్షమ్మకు చేతకాలేదు. ఆమె తన అలవాటుప్రకారం ఉదయం 5 గంటలకే లేచి ఏటికి వెళ్ళి నీళ్ళు తెచ్చేది ఆ తరువాత నీళ్ళు కాచి బిడ్డకు స్నానం చేయించి, గంప తీసుకుని ఊరి బయటికి వెళ్ళేది. గంపనిండుగా చిదుగులు ప్రోగుచేసుకొని తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం దాటుతుంది. మధ్యాహ్న భోజనానంతరం కాసేపు మేనువాల్చి, ఆ తరువాత ట్రంకురోడ్డు వెంబడే నాలుగు ఫర్లాంగులు వెళ్ళి పేడగింజలు ప్రోగుచేసి తెచ్చేది.

సుశీల కామాక్షమ్మ చేస్తున్న పనులు చూసీ చూడనట్లు కొంతకాలం ఊరుకుంది. ఐనా ఎంతకాలమని ఓపిక! తను అంతసుశీ, ఆమె చేస్తున్న పనులకూ ఎక్కడా పొత్తుకుదరడం లేదు. ఇంటికెందరెందరో వస్తుంటారు—పోతుంటారు. వాళ్ళకీ విషయం తెలిస్తే ముఖం చాటుచేసుకుని నవ్వరూ! ఇకపైన నవ్వడమేమిటి, ఈపాటికి నవ్వుతూనే వుంటారు. కానీ తనందుకేం చేయాలి! అప్పటికీ ఒకసారి తీవ్రంగా మందలించింది కూడా! ఆ మందలింపు చెవిటికి శంకు ఊదినట్లే అయింది.

ఓరోజు ఉదయం పెద్దపెద్ద కుటుంబాలనుంచీ నలుగురైదుగురు స్నేహితురాండ్రు సుశీలకోసం వచ్చారు. వాళ్ళు హాల్లోకూచుని బాతాఖానీ వేస్తుండగా చిదుగుల గంపతో కామాక్షమ్మ ప్రత్యక్షమైంది.

మట్టుకు, మర్యాదకు కొంచెం యెడంగా వుంటే స్నేహితురాలొకతె "ఆ మనిషి యెవరే సుశీ" అని ప్రశ్నించింది.

మరో విషయాన్ని ప్రస్తావించి అందుకు జవాబు చెప్పకుండా తప్పించుకోజూచింది సుశీల. కానీ స్నేహితురాలు మాత్రం ఆవిషయం మరిచిపోలేదు.

"మీ ఇంట్లో ఎన్నోసార్లు చూచాను. పనిమనిషా ఏమిటి సుశీ!" మళ్ళీ ప్రశ్నించిందావిడ.

"అవును" అంది సుశీల మరేం చెప్పడానికీ మనస్కరించక!

చిదుగులగంపతో పెరట్లోకి వెళుతున్న కామాక్షమ్మ నఖశిఖపర్యంతం షాక్ తగిలినట్లయి, గంప నోకమూలకు విసరి కుప్పకూరలా నేలపైన కూలబడిపోయింది. మధ్యాహ్నమై, ప్రొద్దు పడమరకు వ్రాలింది. వంటలక్క ఒకటి రెండు సార్లు భోజనానికి పిలిచినా కామాక్షమ్మ అక్కడినుంచి కదల్లేదు.

సాయంత్రం ఐదుగంటలకు రఘు కాలేజీ నుంచి వచ్చి "అదేమిటే అమ్మమ్మా! అలా వున్నావు" అని అడిగాడు.

"ఏం చెప్పన్రా బాబూ! నీకైతే నేను ఇంకా అమ్మమ్మలా కనిపిస్తున్నాను. అది నా అదృష్టం! నీభార్యపాలిటి కేమో నేను పనిమనిషినైపోయాను" అంటూ పమిట చేరగుతో ముఖం కప్పుకుంది కామాక్షమ్మ

రఘు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ఫోజు పెట్టి హాల్లో పచారు చేయసాగాడు. ఏదుగంటలకు సుశీల క్లబ్బునుంచి తిరిగివచ్చి "అదేమండీ! ఏం జరిగిందని అలా విచారంగా వున్నారు" అంది.

"ఇలారా సుశీ" అంటూ రఘు లైబ్రరీ గదిలోకి వెళ్ళాడు.

కామాక్షమ్మ కెప్పుడూ పొంచివినే వాడుక లేదు ఐనా ఆరోజు మాత్రం మనమడు భార్యనెలా మందలిస్తాడో వినాలని బుద్ధిపుట్టి లేచివెళ్ళి హాల్లో నిల్చుంది.

భర్త భార్యని మందలిస్తున్నాడు: "అమ్మమ్మ నేనువ్వావు సుశీ! ఆమె మాడు ఎలా ఖిన్నురాలై కూచుందో."

"ఏంచేయమంటారండీ ఆమె చేసేవన్నీ నామర్దాపనులు. అక్కడికీ నా అంతట నేనే ఆమె పనిమనిషని చెప్పలేదు. ఆ క్లాసుమేటు సుందరరావుగారి భార్య అడిగితే, మరేం చెప్పడానికీ తోచక అవునన్నాను."

"ఆ అనడమేదో అమ్మమ్మకి వినబడకుండా అనరాదా సుశీ!"

కామాక్షమ్మ గిరుక్కున వెను దిరిగింది. ఐతే భార్య తనని పనిమనిషిగా వ్యవహరించడంలో వీడికభ్యంతరం లేదన్నమాట! ఆ అనడమేదో యీ ముసలిదానికి వినబడకుండా చెప్పకోవాలంతే! యింతకంటే దగా లోకంలో ఉండదు. దాదాపు ఇరవైయేళ్ళ తను సర్వసౌఖ్యాల్నీ విడనాడుకుని వీడిని సాకి సంతరించి విద్యాబుద్ధులు నేర్పినందుకు ప్రతిఫలంగా వీడు తను తన పక్షంలో పనిమనిషిగా వ్యవహరింపబడడానికి అంగీకరిస్తున్నాడు. ఈ ఇరవైయేళ్ళు తను భగవంతుడికి సేవ చేసివుంటే ఈపాటికి ముక్తి లభించి వుండేదేమో! మనుష్యుల్ని నమ్మి తనకంటే మోసపోయినవాళ్ళు మరొకరుండరు. ఛీ! ఏం లోకం, ఏం మనుషులు!


ఆరాత్రి రఘుకి, సుశీలకి మామూలుగానే గడచిపోయింది. ఆ నిశీథం తనునుంచీ ముసలావిడని వేరుచేసిందన్న విషయం వాళ్ళకి తెల్లవారినతర్వాత గానీ తెలిసిరాలేదు.

* * *

మందమారుతంస్థానే చలిగాలి వీస్తోంది. ఆకాశాన దూదిపింజెల్లాంటి మబ్బులు వడయాడుతున్నాయి వెన్నెల మసకబారిపోతోంది రాత్రి బాగా మీరిపోయేదాకా ఆవేళ కామాక్షమ్మ జీర్ణకుటీరంలో వంట పూర్తికాలేదు. ఒకసారి ఆమె బయటికి వచ్చి "ఏంరా రఘూ! ఆకలౌతోందా" అని అడిగింది. రఘు "లేదులే అమ్మమ్మా" అన్నాడు "ఏం చేయమంటావు రఘూ! మమకారం తెగిపొమ్మంటే తెగిపోయేదా! నాకు చిన్నప్పటినుంచీ ఒక కోరికుండేది. ఈరోజు నీతో చెబుతున్నాను. ఇంటినిండుగా చుట్టాలు రావాలి నేను స్వయంగా వంటచేసి వడ్డించాలి పిన్నా పెద్దా, పిల్లా జెల్లా తింటుంటే చూడాలి అనుకునేదాన్ని. భగవంతుడు నా కోరికలన్నీ నెరవేర్చాడు. అదిమాత్రం తీరకనే ఉండిపోయింది. ఎవరెవరి అదృష్టం ఎప్పుడు పండుతుందో ఎవరు చెప్పగలరు! వెంకటేశ్వరుడు మిమ్మల్ని ఈరోజు నా దగ్గరికి తీసుకొచ్చాడు. మీరు ముగ్గురూ కూచుంటె ఈపాక నిండిపోతుంది. అప్పడాలు వేయిస్తున్నాను నువ్వు లేచి కాళ్ళుచేతులు కడుక్కో" అంటూ కామాక్షమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

తెల్లవారింది. రఘు సతీసుతలతో ప్రయాణమై గుడిసెముందు నిలుచున్నాడు. కామాక్షమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకోకుండానే లక్షణంగా భార్యాభర్తల్ని సాగనంపాలనుకుంది. కానీ పొంగి పొరలిపోతున్న నీటి

(55-వ పేజీ చూడండి)



వృధా!



హ్న విశ్రాంతి

—ఫొటో: శ్రీపాద వెంకన్న.



'బారిష్' చిత్రంలో నూతన్.



కొలంబియావారి సినిమాస్కోప్ చిత్రం "లాస్ట్ ఫ్రాంటియర్"లో ఆన్ బాన్‌క్రాఫ్ట్,

డాక్యుమెంటరీ చిత్రాలు

డాక్యుమెంటరీ చిత్రాలపై భారతదేశం చూపుతున్నంత శ్రద్ధ మరే దేశమూ చూపించడం లేదని నా నమ్మకం. ఇక్కడ తయారవుతున్న డాక్యుమెంటరీల సంఖ్య చాలా ఎక్కువ. సాంఘిక చైతన్యానికి ఫలితంగా, సంఘ శ్రేయోభావాన్ని పెంపొందించాలనే ఆసక్తి మూలంగా డాక్యుమెంటరీ చిత్రాలు మనకు అత్యవసరమైనాయి. ఈ అవసరాన్ని, ఆ చిత్రాల ప్రయోజనాన్ని భారతప్రభుత్వం గుర్తించినట్లు విదితమవుతోంది.

మీరు భారతీయ డాక్యుమెంటరీలు చాలా చూసి ఉంటారు కనుక డాక్యుమెంటరీ అంటే ఏమిటో నేను చెప్పనక్కరలేదనుకుంటాను. కాని ఈ చిత్రాల చరిత్రను గూర్చి తెలుసుకోవాలని మీకు ఆసక్తి ఉండవచ్చు.

1895 లో మొట్టమొదటి చలనచిత్రం ప్రదర్శిత అయినప్పుడే డాక్యుమెంటరీ కూడా పుట్టిందని చెప్పవచ్చు. మొట్టమొదటి చలనచిత్రాలు యథార్థసంఘటనలనే చిత్రించేవి. స్టేషనులోకి వస్తున్న రైలు, పడిపోతున్న గోడ—ఇలాంటివి. అయితే డాక్యు-

హారీ సీటన్


మెంటరీ అంటే ఇది కాదనుకోండి. కాని డాక్యుమెంటరీ చిత్రం యథార్థాన్ని చూపించేది కనుక, పడిపోయే గోడని చూపించిన మొదటి చిత్రంలో డాక్యుమెంటరీకి కావలసిన లక్షణాలు కొన్ని ఉన్నాయని చెప్పవచ్చు.

వార్తాచిత్రం జరిగిన సంఘటనలను యథాతథంగా చూపిస్తుంది. కాని డాక్యుమెంటరీ చిత్రం ఒక యథార్థసంఘటనలోని వేర్వేరు అంశాలలో కావలసినవాటిని మాత్రమే స్వీకరించి, ఒక పద్ధతిలో వాటన్నిటినీ అమర్చి ఒక దృక్పథాన్ని ఒక సారాంశాన్ని వ్యక్తీకరిస్తుంది. ప్రేక్షకునిలో తనదృక్పథం పట్ల సానుభూతి కలిగించడానికే నిర్మాత సాధారణంగా డాక్యుమెంటరీ చిత్రం తీస్తాడు. అయితే ఆ దృక్పథా లిష్టంలేని వారు డాక్యుమెంటరీలను ప్రోపగాండా (ప్రచారం) చిత్రాలని దూషిస్తారు. అయితే సినిమాలో ప్రచారానికి స్థానమున్నది. నిజానికి ఇప్పటికి తయారైన కొన్ని అద్భుతశక్తివంతమైన చలనచిత్రాలు ప్రచారంకోసం తీయబడినవే.

మొట్టమొదటగా సినిమా సాధనాన్ని కనుక్కున్న మూలవ్యక్తులు తమ చుట్టూ



జూపిటర్ వారి "ఉమాసుందరి"లో నాగయ్య, కన్నాంబ.



లక్ష్మీప్రొడక్షన్స్‌వారి "ఇలవేల్పు"లో శారద, గణపతి, శేఖర్.

ఉన్న యథార్థప్రపంచంలోని సంఘటనలను పునర్నిర్మించడమే పనిగా పెట్టుకొన్నారు. కాని వారు కనుక్కున్న ఈ అద్భుతసాధనాన్ని అచిరకాలంలో వినోదం కోసం ఉపయోగించడం మొదలైనది. కథాచిత్రం ఈ రీతిగా పుట్టి ప్రజానీకంమీద అశేషప్రభావం కనబరుస్తోంది. ఇంత ప్రభావం లేకపోయినదైనా, వార్తాచిత్రం, డాక్యుమెంటరీ చిత్రంకూడా కథాచిత్రంతోపాటే అభివృద్ధి పొందాయి

మొట్టమొదటి నిజమైన డాక్యుమెంటరీ చిత్రం ఏదో చెప్పడం కష్టం. కాని నా ఉద్దేశంలో ఫ్రెంచి నిర్మాత, గొప్ప ప్రయోగశీలి అయిన జార్జెస్ మెలియస్ 1913 లో నిర్మించిన చిత్రమే మొదటి డాక్యుమెంటరీ "ది కేస్ ఆఫ్ ఆల్ఫ్రెడ్ డ్రేఫస్" అనే ఈ చిత్రం యథార్థంమీద ఆధారపడి, జనులలో చైతన్యం రేకెత్తించడానికి తీసింది. యూదు జాతీయుడైన డ్రేఫస్ అనే ఫ్రెంచి సైన్యాధికారిపై శత్రుగూఢచారి అని అక్రమంగా అభియోగం మోపి, ద్వీపాంతరవాసశిక్ష విధించడం ఈ చిత్రంలో వస్తువు. ఈ కేసు తాలూకు యథార్థదృశ్యాలను మెలియస్ 'షూట్' చెయ్యలేకపోయాడు. కాని ఆ దృశ్యాలన్నిటినీ పునర్నిర్మించాడు. డ్రేఫస్ కేసులో అతని తరఫున పనిచేస్తున్న వ్యక్తులకు ఈ చిత్రం సహాయకారిగా ఉండేటట్లుగా, అమాయకుడైన డ్రేఫస్ విడుదలకు దోహదం అయేటట్లుగా అతడు ఈ చిత్రం తీశాడు. న్యాయంకోసం ప్రచారం చేస్తూ నిర్మించబడిన మొదటచిత్రం ఇదేనని నా ఉద్దేశం.

డాక్యుమెంటరీల చరిత్ర, అభివృద్ధి రెండు భిన్నశాఖలలో నడిచింది. ఒక శాఖ సాంఘిక సమస్యల జోలికి పోకుండా నడిచింది దీన్ని రొమాంటిక్ డాక్యుమెంటరీ అన్నారు. మరొకశాఖ సాంఘికసమస్యలను అంటిపెట్టుకుని వృద్ధిచెందింది దీన్ని రియలిస్ట్ (వాస్తవిక) డాక్యుమెంటరీ అన్నారు.

ఈ రెండు శాఖలకు ఇద్దరు మూలవ్యక్తులను పేర్కొనవచ్చును. మొదటులో 'ఎలిఫెంట్ బోయ్' చిత్రం నిర్మించిన అమెరికన్ నిర్మాత రాబర్ట్ ఫ్లాహర్టీ మొదటిశాఖవాడు. సెర్గీ ఐజెన్‌స్టీన్ రెండోశాఖవాడు.

వీరిద్దరి చిత్రనిర్మాణదృక్పథాలు పరస్పరవ్యతిరేకమైనవి.

ఫ్లాహర్టీ మొదటినుంచీ సినిమారంగంలో లేడు. మొదటిప్రపంచ యుద్ధం తరవాత అతడు ఉత్తర కెనడాలో హడ్సన్ బేఫర్ ట్రేడింగ్ కంపెనీలో ఉద్యోగిగా చేరాడు. ఉద్యోగరీత్యా అతడు భార్యతోసహా ఎస్కిమో జాతివారి మధ్య కాలం గడపాల్సి వచ్చింది. ఎస్కిమోల దైనికజీవితం చూస్తుంటే అదంతా చిత్రం తీయాలనే సంకల్పం కలిగింది ఆ చిత్రం పేరు "నానూక్ ఆఫ్ ది నార్త్." ఇది చలనచిత్ర చరిత్రలో ఒక మైలురాయి ఇది మామూలు కథాచిత్రంవంటిదే కాని, అసలైన ఎస్కిమోలే అసలైన పరిసరాల్లో తమ దైనిక జీవిత నాటకాన్ని నటించారు 1922 లో ఇది విడుదల అయింది చలనచిత్ర నిర్మాణంలో ఇది కొత్తశాఖకు మార్గదర్శిని



మహీవారి "శ్రీ గౌరీమహాత్మ్యంలో" సి. ఎస్. ఆర్. సరసం.

డాక్యుమెంటరీ చిత్రాలు

అయింది. ఆధునిక డాక్యుమెంటరీ చిత్రాలకు ఇది నాంది పలికింది.

ఆ సంవత్సరమే కొందరు రష్యన్లు జీగా వెర్టావ్ నాయకత్వాన కొన్ని వార్తా చిత్రాలు తీయ నారంభించారు. వీటిలో 'కినో ఐ' (సినీ నేత్రం) అనే పద్ధతి ఉపయోగింపబడింది. ఒక దృక్పథం వ్యక్తమయ్యే రీతిగా ఈ చిత్రాలు ఎడిట్ చెయ్యబడినాయి. కొత్త సోషలిస్టు సమాజానికి ప్రచార సాధనాలుగా ఈ చిత్రాలు ఉపకరించాయి. మూడేళ్ళ తరువాత 1925 లో రష్యన్ దర్శకుడు సెర్గీ ఐజెన్‌స్టీన్ "పోటెమ్కిన్" చిత్రం తీశాడు. 1905 నాటి రష్యన్ విప్లవంలో పోటెమ్కిన్ యుద్ధనౌకలో జరిగిన తిరుగుబాటు సంఘటనలను ఈ చిత్రంలో అతడు పునర్నిర్మించాడు. పునర్నిర్మించినప్పటికీ ఐజెన్‌స్టీన్ అసలు తిరుగుబాటు జరిగిన ఒడెస్సా రేవుపట్టణంలోనే, నటీనటులబదులు అసలైన నావికులను, సామాన్య ప్రజలను, అసలైన యుద్ధనౌకను తీసుకొని దృశ్యాలు తీశాడు. దీని వలన, ఆ చిత్రం, చూసిన వారందరినీ గొబరమకు నేటంత గొప్ప వాస్తవికతతో రాణించింది. ఈ చిత్రం, ఐజెన్‌స్టీన్ తీసిన తరువాతి రెండు చిత్రాలు, జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లండులలో గొప్ప సంచలనం కలిగించాయి. అతని చిత్ర నిర్మాణ సిద్ధాంతాలు అనేకులకు మార్గదర్శకాలు అయ్యాయి. ముఖ్యంగా ఇంగ్లండులో దర్శకులకు సాంఘిక యాథార్థ్యాన్ని చిత్రించాలనే అభిలాష కలగజేశాయి.

ఐజెన్‌స్టీన్ చిత్రాల ప్రభావంతో ప్రోత్సాహం తెచ్చుకున్న బ్రిటిషు దర్శకులలో జాన్ గ్రీర్సన్ ఒకడు. బ్రిటిషు డాక్యుమెంటరీ ఉద్యమానికి గ్రీర్సన్ నాయకుడు. ఇతడు చరిత్రతో జీవితం ప్రారంభించాడు. తరవాత చలనచిత్ర ప్రభావం అతనిపై పని చేసింది. స్వదేశమైన స్కాట్లండు వెళ్ళి, హెరింగ్ చేపలను పట్టి జీవించే స్కాటిష్ జెస్తవారి జీవితాన్ని చిత్రం తీశాడు. "డ్రిఫ్టర్స్" అనే ఈ చిత్రం బ్రిటిషు డాక్యుమెంటరీ ఉద్యమానికి నాందీవాక్యం పలికింది.

వ్యాపార వాతావరణంలో పడి కొట్టుకుంటున్న చలనచిత్రపరిశ్రమలో అటువంటి చిత్రాలకు తావు దొరకదని గ్రీర్సన్ గ్రహించాడు. కార్మికుల జీవితాన్ని వాస్తవికంగా చూపించే చిత్రాలతో ప్రజలకు విజ్ఞానం కలిగించడానికి, ఫిలిం టెక్నిక్‌ను అభివృద్ధి చేయడానికి అతడు చిత్రాలు నిర్మించదలచాడు. అందుకు పెట్టుబడి పెట్టేవారికోసం అన్వేషించాడు. మొదటి పెట్టుబడిదారులు బ్రిటిషు ఎంపైర్ మార్కెటింగ్ బోర్డువారు. తరువాత గ్రీర్సన్ బృందాన్ని జనరల్ పోస్టు ఆఫీసువారు ఉద్యోగానికి తీసుకుని చిత్రాలు తీయించసాగారు. ఈ విధంగా సోవియట్ యూనియన్‌లో మాదిరిగానే ఇంగ్లండులో కూడా

ప్రభుత్వయాజమాన్యంలోనే సినిమాకళలో కొత్త పద్ధతులు అభివృద్ధిఅయ్యాయి.

ఇక ఫ్రాన్సు, హాలెండ్, జర్మనీ దేశాల్లో 1920 ప్రాంతాలనుంచీ డాక్యుమెంటరీలు తీస్తున్నారు. కాని వీటికి ప్రైవేటు పెట్టుబడిదారులే డబ్బివ్వడం వల్ల అభివృద్ధి మందకొడిగా సాగింది. ఫ్రాన్సులో డాక్యుమెంటరీలు సాంఘిక ప్రయోజనంకంటే టెక్నికల్ ప్రయోగాలే ముఖ్యంగా పెట్టుకుని తీయబడినవి. ప్రసిద్ధ ఫ్రెంచి డాక్యుమెంటరీ దర్శకుడు జాఁ పాఁ లెవ్ ప్రకృతిచిత్రాలను, ముఖ్యంగా సముద్రాలను గూర్చిన చిత్రాలను ఎక్కువగా తీశాడు.

హాలెండులో జోరిస్ ఐవెన్స్ అనే యువకుడు వర్షాలను, వంతెనలను పాత్రలుగా పెట్టుకుని గొప్పచిత్రాలు తీశాడు. డాక్యుమెంటరీ చిత్ర నిర్మాతలలో జోరిస్ ఐవెన్స్ మాదిరిగా అంతర్జాతీయతత్త్వం గలవారు అరుదు. ఇతడు కొంతకాలం రష్యాలో పనిచేశాడు. తరువాత ప్రపంచమంతటా పర్యటించాడు. స్పానిష్ అంతర్యుద్ధం గూర్చి "స్పానిష్‌భూమి" అనే గొప్పచిత్రం తీశాడు. తరవాత చైనా వెళ్లి "నలభైకోట్లమంది" అనే చిత్రం తీశాడు. రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభ సమయంలో అతడు అమెరికాలో ఉన్నాడు. డచ్చివాడైనప్పటికీ, వలసవిధానవ్యతిరేకి. యుద్ధానంతరం ఆస్ట్రేలియా వెళ్లి ఇండోనీషియన్ స్వాతంత్ర్య సమరానికి అనుకూల ప్రచారంచేస్తూ ఒకచిత్రం నిర్మించాడు. డచ్చిప్రభుత్వం అతన్ని స్వదేశంలో అడుగుపెట్టనీకుండా నిషేధించింది. అప్పటినుంచి ఐవెన్స్ ఒకదేశంనుంచి ఇంకో దేశం, ముఖ్యంగా సోషలిస్టుదేశాల్లో, తిరుగుతూ సోషలిస్టు సమాజ నిర్మాణంగూర్చిన చిత్రాలు తీస్తున్నాడు. నవజీవనంకోసం మానవజాతి చేసే నిర్విరామకృషిలోని మహత్తరసందేశం అతని చిత్రాలలో వినబడుతోంది.

అమెరికా, కెనడాలలో డాక్యుమెంటరీ చిత్రాల అభివృద్ధి ఎప్పుడూ చురుకుగా లేదు. చివరకు రూపొందిన అమెరికన్ డాక్యుమెంటరీలో బ్రిటిష్‌ప్రభావం బాగా కనబడుతుంది. రూజ్‌వెల్ట్ కాలంలో అమెరికన్ ప్రభుత్వం కొన్ని మంచి డాక్యుమెంటరీలు తీయించింది. వరదలు, భూసారనష్టం, శిశు సంరక్షణ మొదలైన సాంఘిక సమస్యలను ఇవి చిత్రించాయి. ఈ చిత్రాలు ఎక్కువ తీసినవ్యక్తి పేర్ లారెంజ్.

క్రిందటి యుద్ధానికి సరిగ్గా ముందు రోజుల్లో లారెంజ్ చిత్రాలు రెండు చూశాను. అవి నాకు బాగా జ్ఞాపకం ఉన్నాయి. 'యథార్థజీవితాన్ని ప్రజలకు తెలియజేయడమేగదా డాక్యుమెంటరీల ప్రయోజనం. ఆ రెండు చిత్రాలు చూసే క్షణంవరకూ నాకు అమెరికామీద సదభిప్రాయం ఎన్నడూ లేదు. ఆ చిత్రాల్లో నిజమైన అమెరికా నాకు కనబడినట్లయింది. అవి చూసినతర్వాతనే నేను అమెరికా వెళ్లి కొన్నేళ్లు ఉండి పనిచెయ్యడం జరిగింది.

ఈరకంచిత్రాలు వివిధదేశాలలో జరుగుతున్న రక్షణకృషికి దోహదాలైనందువల్ల గత యుద్ధకాలంలో వాటి ప్రాముఖ్యం, సంఖ్య పెరిగాయి. గ్రీర్సన్, మరికొందరు బ్రిటిషు డాక్యుమెంటరీ దర్శకులు కెనడా



ఇటీవల బొంబాయిలో విడుదల అయిన 'సైలాబ్'లో అభిభట్టాచార్య, గీతాబాలి.

డాక్యుమెంటరీ చిత్రాలు

వెళ్ళి కెనేడియన్ ఫిల్మ్ బోర్డు స్థాపనకు కారకులయ్యారు. అచిర కాలంలో కెనడాను, ఆ దేశ ప్రజలను వాస్తవికంగా చూపించే అనేక డాక్యుమెంటరీలు వెలువడినాయి. ఈ డాక్యుమెంటరీలు బ్రిటిషు అమెరికన్ చిత్రాలకు అనుకరణలు కాకుండా స్వతంత్రమార్గంలో నడిచాయి.

యుద్ధం మంచిముమ్మరంగా ఉన్న రోజుల్లో డాక్యుమెంటరీ చిత్రం ఒక ఆయుధంగా పనికివచ్చింది. అనేక దేశాలు ఈ కృషిలో సహకరించి పనిచేశాయి. ప్రసిద్ధ హాలీవుడ్ డైరెక్టరు ఫ్రాంక్ కాప్రా అమెరికన్ సమాచార శాఖలో చేరి, "బ్రిటన్ యుద్ధం" అనే చిత్రం తీయడానికి సహకరించాడు.

అమెరికన్ జర్నలిస్టు క్వెంటన్ రెనాల్డ్స్ మాస్కో వెళ్ళి "రష్యాయుద్ధం" అనే చిత్రానికి కామెంటరీ వ్రాశాడు. ఈ చిత్రానికి ఐజెన్‌స్టీన్ కూడా సలహాదారుగా పనిచేశాడు. యుద్ధాంతకాలంలో ఫ్రాన్సులో మిత్రరాజ్యాల సైన్యాలు ప్రవేశించడాన్ని గూర్చిన ఒక చిత్రంలో అమెరికన్, బ్రిటిష్ దర్శకులు కలిసి పనిచేశారు.

యుద్ధకాలపు డాక్యుమెంటరీల ప్రభావం కథాచిత్రాలపై ఎంతో ఉన్నది. అనేక కథాచిత్రాలు డాక్యుమెంటరీ వాతావరణంతో వెలువడినాయి. వార్తా విలేఖరులు రచించిన గ్రంథాలను హాలీవుడ్ వారు చిత్రాలుగా తీశారు. యథార్థ వాతావరణంతో బ్రిటిషు నిర్మాతలు కొల్లలుగా చిత్రాలు తీశారు. యుద్ధానంతరం ఇటలీ "నవవాస్తవిక" చిత్రాలనబడే అత్యంత వాస్తవిక చిత్రాలతో ముందుకువచ్చింది. ఉదాహరణకు: "బైసికిల్ తీవ్స్" చిత్రంలో అంతవరకూ డాక్యుమెంటరీలలో మాత్రమే కనబడే యథార్థ సాంఘిక ప్రయోజనం స్పష్టమైన రూపు దాల్చి కథాచిత్రంద్వారా వ్యక్తీకరింపబడింది. జపాను కూడా ఈ పద్ధతి అనుసరించింది. "హీరోషిమా శిశువులు" అనే చిత్రంలో ధ్వంసమైపోయిన హిరోషిమా నగరం, అటంబాంబు జరిపిన సంహారకాండ, బ్రతికి బయటపడిన కొందరు స్కూలుపిల్లలు పడే యమయాతన చూపబడింది.

యుద్ధాత్పూర్వం చలనచిత్రాలంటూ లేని దేశాల్లో, ఉన్నా హీనంగా ఉన్న దేశాల్లో యుద్ధానంతరం కథాచిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలుకూడా అభివృద్ధి అయ్యాయి ఉదాహరణకి హంగరీ దక్కని ప్రకృతి చిత్రాలు నిర్మించింది.

స్వీడన్‌లో ఆర్నాల్డ్ షక్స్‌డార్ఫ అనే దర్శకుడు కథాచిత్రాలువదిలి శిశువులకు, జంతువులకు సంబంధించిన డాక్యుమెంటరీలు తీయసాగాడు. ఈయన ఇప్పుడు భారతదేశంలో పెద్దపులుల, చిరుతపులులకు సంబంధించిన డాక్యుమెంటరీ తీస్తున్నాడు.

ఇక ఆస్ట్రేలియా యుద్ధకాలంలో హారీవాట్ అనే బ్రిటిష్ డాక్యుమెంటరీ దర్శకుడు ఆస్ట్రేలియా వెళ్ళి "ఓవరి లాండర్స్" అనే చిత్రం తీశాడు. తరువాత ఆస్ట్రేలియను స్వయంగా తమ జీవితాన్ని ప్రతిబింబించే ప్రత్యేకపద్ధతి చిత్రాలు నిర్మించసాగారు.

ఇది ముగించేముందు భారతీయ డాక్యుమెంటరీలను గూర్చి రెండుముక్కలు చెబుతాను. నేను మీ డాక్యుమెంటరీలు చాలా చూశాను. అన్నిట్లోకీ "స్పిరిట్ ఆఫ్ ది లూమ్" అనే చిత్రం నాకు చాలా నచ్చింది. భారతదేశపు చేనేతపరిశ్రమ చరిత్ర వర్ణించే ఈ చిత్రం భారతీయాత్మను చక్కగా ప్రతిబింబిస్తోందని నా నమ్మకం. ఇక్కడి పరిస్థితులను, జీవితగమనాన్ని అది చాలా హృదయంగమంగా చిత్రించింది. దీని కిటీవల బహుమతి రావడం నాకు సంతోషంగా ఉంది. డాక్యుమెంటరీల అభివృద్ధికి భారతదేశం బాగా అనువైన స్థలమని నాకు తోస్తోంది. "డార్జిలింగ్" అనే మీ చిత్రం ఇంగ్లండులో సర్వత్రా ప్రదర్శింపబడుతుందనికూడా నాకు తెలిసింది.

నాకు డాక్యుమెంటరీ చిత్రాలమీద పూర్తి విశ్వాసం ఉన్నది. ఒక దేశపు జీవితాన్ని మరొక దేశానికి ఎరుక పరచడానికి అది అద్భుతసాధనం. ప్రపంచ శాంతికి, సామరస్యానికి కూడా అది సాధనం కాగలదు.

(మద్రాసు 'ఆలిండియా రేడియో సౌజన్యంతో)

* * *

సినిమా వార్తలు

ఝనక్ ఝనక్ నర్తకుడు గోపీకృష్ణ

"ఝనక్ ఝనక్" చిత్రంతో తారాపథాన్నందుకున్న కథక్ నర్తకుడు గోపీకృష్ణ ఇటీవల నృత్యప్రదర్శనలకోసం మద్రాసు వచ్చారు. దక్షిణభారత చిత్రపత్రికారచయితలసంఘం వీరి గౌరవార్థం అల్పాహారపు విందు ఏర్పాటు చేశారు. రిపబ్లిక్ పిక్చర్సువారి కార్యాలయంలో విందు జరిగింది. శ్రీ బి. ఎస్. రంగా, ఎ. నాగేశ్వరరావు, ఆదినారాయణరావు, ఆత్రేయ, పేకేటి మొదలైన సినిమాప్రముఖులు హాజరయ్యారు.

గోపీకృష్ణ కథక్ నాట్యంగూర్చి మాట్లాడుతూ ఇది భరతనాట్యంవలెనె శాస్త్రీయ నాట్యమైనప్పటికీ, భరతనాట్యం అంత ప్రచారంలోకి రాలేదని, ఝనక్ ఝనక్ చిత్రంతో దీని పేరు, సంప్రదాయం అందరికీ తెలిసి, దానికొక గౌరవం ఏర్పడిందనీ చెప్పారు. మణిపురి నాట్యానికీ, కథక్ కూ భేదం వివరిస్తూ, మణిపురిలో లాలిత్యం, సౌకుమార్యం ఎక్కువనీ, కథక్ లో లయ, వేగం ఎక్కువని ఆయన అన్నారు. ★

రిపబ్లిక్ వారి చిత్రంలో గోపీకృష్ణ

ఝనక్ ఝనక్ పాయల్ బాజే నృత్యదర్శకుడు శ్రీ గోపీకృష్ణ, రిపబ్లిక్ పిక్చర్స్ వారి తొలి చిత్రానికి నృత్యదర్శకుడుగా పనిచేయడానికి అంగీకరించారు. ఇందులో ఒక నృత్యంలో ఆయన స్వయంగా పాల్గొంటారు.

ఈ చిత్రానికి ఈ నెల 16 న షూటింగ్ ప్రారంభం అవుతోంది. కథ ఆచార్య ఆత్రేయ వ్రాశారు. అంజలీ, నాగేశ్వరరావు రేలంగి, గుమ్మడి పాల్గొంటున్నారు. దర్శకుడు శ్రీ బి. ఎస్. రంగా, నిర్మాత శ్రీ సి. సీతారాం.

ఇప్పటికి రెండు పాటలు రికార్డు చేశారు. ★

చిత్రమాలిక:

ఒకటీ రెండూ మూడూ

1

మద్రాసు కలకత్తా మెయిలు శరవేగంతో పోతూంది. కాని, ఏంలాభం? ఆ రోజంతా ఏవో అవాంతరాలు వస్తూనే ఉన్నాయి. దారిలో ఏదో ఒక లెవెల్ క్రాసింగువద్ద ఒక లారీని ఢీకొన్నంతపనయింది. మరోకచోట ఒక పెద్ద దున్నపోతు రైలుకింద పడిపోయింది. రాజమండ్రీ దాటాక కాబోలు ఒక పెట్టెలో ఇద్దరు వాదోపవాదాలు పెంచుకొని, చివరికి కొట్టుకోడం ప్రారంభించడంతో మధ్యవర్తులు తగాదా తీర్చలేక గొలుసులాగి రైలు ఆపారు.

ఆయా కారణాలవల్ల రైలు ఆగినప్పుడల్లా, రామచంద్రరావుకి "ఇక ఈ రైలిలా ఆగిపోకూడదా, ఏమో ఎన్నటికీ మరి బయలుదేరకపోతే ఎంత బాగుంటుంది" అనిపించేది. కాని కొంచెంసేపటిలోనే, కర్ణకఠోరమయిన గార్డువిజిలూ, ఇంజను కూతా, గుఫ్‌గుఫ్‌మని పరుగెత్తే ధ్వనీ వినిపించేది. అన్ని కారణాలవల్ల కలిగిన ఆలస్యమూ కలిసి గంటన్నరకంటె ఎక్కువ కాలేదు వాల్తేరుకూడా విడిచిపెట్టేసింది. ఇంక మహా అయితే మరొక్క గంటలో విజయనగరం చేరుకొంటుంది. అక్కడినుండి తమ ఇంటికి జట్కాలో ప్రయాణం పావుగంటకంటె ఎక్కువ పట్టదు. అంతతో సరి అమ్మ, అత్తయ్య, అక్కచెల్లెళ్లు అందరూ తన వొక వింతజంతువుగా చూసి, హితబోధ అనే కార్యక్రమాన్ని వేర్వేరు పంథాలలో ఆరంభిస్తారు. మరింక తనకి తప్పుకొనే అవకాశంలేదు అక్కడ రాజమండ్రీ స్టేషనులోనే, నాన్న కాఫీకని క్యాంటీను దగ్గరికి వెళ్లినప్పుడే తను చల్లగా జారుకోవలసింది. అప్పుడూ నాన్న తను నిద్రపోతున్నాననుకొని, బండి దిగి వెళ్లేరు. ఊహుఁ తనకి సాహసం చాకచక్యం రెండూ శూన్యమే. ఇప్పుడు మరేంచేద్దామన్నా అవకాశం లేదు, లేదు, లేదు.

ఒక్కొక్క క్షణం గడుస్తున్నకొద్దీ తాము ఇంటికి మరీ మరీ దగ్గరపడుతున్నారు. తనకు క్రమక్రమంగా నిస్పృహా, నిరాశ ఎక్కువవుతున్నకొద్దీ నాన్నకు సంతోషమూ, విజయగర్వమూ ఎక్కువవుతున్నాయి. ఖారాకిల్లీమీద ఖారాకిల్లీ నములుతున్నారు. చుట్టమీద చుట్ట కాలుస్తున్నారు. మామూలుగా ఎవరితోనైనా మాట్లాడ్డానికి చీదరించుకొనే మనిషి తోటిప్రయాణీకులతో రాజకీయాలు చర్చిస్తున్నారు. అందులోనూ ఎదుటివాళ్లు ఏది మంచిదంటే అవునంటే అని ఏకీభవించవలసినంత హుషారుగా ఉంది ఆయన పరిస్థితి.

ఉండదూ మరి, ఆయన నిర్వహించుకొని వచ్చిన పని సామాన్యమయినదా? ఎవతెనో వర్ణాంతరురాలిని లేవదీసుకొనిపోయిన బుద్ధిహీనుడయిన పుత్రుణ్ణి మద్రాసువంటి మహానగరంలో మూడురోజుల్లో గాలించి పట్టుకొని, మారు మాటాడనీయకుండా తనతో ఇంటికి తీసుకొనిరాగలగడానికి ఎంత ప్రజ్ఞ ఉండాలి! ఇక, ఆప్తబంధుమిత్రులతో ఆజన్మాంతం ఎన్నెన్నో విధాలుగా తన సామర్థ్యాన్ని, చాకచక్యాన్ని, కొడుకు తెలివితక్కువతోనూ, అసమర్థతతోనూ మిళాయించి ప్రకటించుకోవచ్చును.

పంతుల శ్రీరామశాస్త్రి

నిజమే తాను బుద్ధిహీనుడే—కాకపోతే వెళ్ళిన ప్రతి స్థలంలోనూ తననుగూర్చిన ఆరా తియ్యడానికి తగిన ఆధారం ఒకటి విడిచిపెడుతూనే వచ్చాడు. అడిగిన ప్రతివారితోనూ యథార్థంగా తనపేరు చెప్తూ వచ్చాడు. అంతేకాదు, వెళ్ళిన క్షణంనుండి ఉద్యోగప్రయత్నం ఒకటి తగలబెట్టాడు. అదే తాను సులభంగా దొరికిపోవడానికి కారణభూతమయింది. ఉమ అంటూనే ఉంది, "ఎందుకిప్పటినుండి తొందరపడతారు? ఒక్క నెల్లాళ్లపాటు హాయిగా గడుపుదాము ఇంకా మరేమైనా స్థలాలుకూడా తిరుగుదాము. మనదగ్గర ఉన్న డబ్బుతో జాగ్రత్తగా వాడుకొంటే, ఒక ఏడాది గడిచిపోతుంది—తరవాత ఎలానూ ఉద్యోగం చెయ్యడం తప్పదు. ముందు కొన్నాళ్లపాటు సరదాగా ఉండకూడదా?"

ఆమె మాటలు వినిఉంటే ఈ అవస్థ పట్టి ఉండకపోయేది.

కాని, విని ఉండటమెలాగ? తాను కేవలం ఆమె డబ్బుమీద ఆధారపడటం ఇష్టంలేని ప్రయోజకుడని ఆమె అనుకోవాలని ఉద్యోగాన్వేషణకి బయలుదేరేడు. అదే చివరికిలా కొంప ముంచింది.

సింహాచలం దాటింది. పెందుర్తిదగ్గర పడినట్టుంది. ఇకనింతే, మరెట్టి అవాంతరాలు లేకుండానే, మెయిలీరోజున విజయనగరం చేరుకుంటుంది. వార్తాపత్రికలు చూస్తూ ఉంటే, ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట రైళ్లు ఢీకొన్నట్టో, పట్టాలు తప్పిపోయినట్టో ఏవో వార్తలు కనిపిస్తూనే ఉంటాయి. కాని హఠాత్ప్రమాదాలు మాత్రం సరిగా కావాలన్న సమయానికే వస్తాయా?

చీకటి పడుతూంది. మధ్యలో ఆలస్యం లేకపోతే ఈపాటికి తాను ఇంటికి చేరుకొని ఉండును చేరుకొని ఉండడం కాదు, తీసుకొనిపోబడి వుండును తాను ఇంతటి అసమర్థుడు—పరాయిఊళ్ళో ఒంటరిగా కనుపించినప్పుడు సైతం. "నీ లక్ష్యం నాకేమిటి, నాయిష్టం వచ్చినట్లు చేస్తాను" అని తండ్రిని ఎదిరించలేకపోయాడు. ఇక ను ఇంటికి వెళ్లినతరవాత తన ఇష్టానిష్టాలతో ప్రసక్తి ఏముంటుంది? అమ్మా నాన్నా ఏది చెయ్యమంటే అది చేస్తాడు. ఏది తప్పంటే అది మానేస్తాడు. ఇటువంటి గంగిరెద్దుబతుకు బతకవలసిన తాను, ఉండవలసినట్టు ఉండక ఇంకొకవ్యక్తిజీవితాన్నికూడా పాడుచేశాడు.

నిన్న ఈపాటివేళకు తాను బసకు చేరుకొని ఉండవలసిన మాట. ఉద్యోగంకూడా దొరికినంతపనయింది.

సంతోషంగా కాఫీహోటల్లో ఫలహారం చేసి, ఉమకని జిలేబీ, మైసూరుపాక్, పకోడీ పొట్లం కట్టించి బయలుదేరాడు. వక్కపొడి నోట్లో వేసుకుని, సిగరెట్టు రెండు పీల్పులు పీల్చి, బస్సుస్టేండువంక నాలుగడుగులు వేసేడో లేదో—చిన్నయ్యసూరిగారు, బడితె చేతధరించి రెండవ యమునివలె కాలముకొపు ప్రత్యక్షమైనాడన్నట్టు మెళ్ళో జరీఅంచుల వాణీ, బుగ్గను ఖారాకిల్లీ, చంకను దినపత్రిక, వంకచేతికర్ర—వీటితో నాన్న ప్రత్యక్షం. ఆసమయంలో నిజమైన యముడు కనిపించి

★ ఒకటీ రెండూ మూడు ★

వస్తావా అన్నా అంతకంటె యెక్కువ సంతోషించి ఉండేది తనమనస్సు - కాదు, తక్కువ బాధపడి ఉండేది. యముడు వస్తే అతనివెంట వెళ్ళిపోవడంలో ఉమకు బుద్ధిపూర్వకంగా పెద్ద అన్యాయం చెయ్యడం ఏమీ లేదు. ప్రస్తుతం తన ప్రవర్తనలో స్వార్థం, మోసం, క్రౌర్యం, కౌటిల్యం అన్నీ అంతర్లీనమయి ఉన్నాయి. తన ఈ ప్రవర్తనను ఇతరు లెవ్వరయినా క్షమించినా, తానుమాత్రం ఆజన్మాంతం క్షమించుకోలేడు.

తానెందుకంత అసమర్థుడుగా ప్రవర్తించాడు? నాన్న కనిపించి, "నాతో రా" అనేసరికి ఎందుకలా మేకపిల్ల అయిపోయేడు? మేకపిల్లఅయినా వధ్యశాలకు తీసుకొనిపోబడేటప్పుడు ఫలితంలేకపోయినా తన అసమ్మతిని ప్రదర్శించకపోదే—తాను వధ్యశాలకంటె నికృష్టమయిన చిత్రవధశాలవంటి ఇంటికి గొంపోబడడానికి లేశమాత్రమయినా తన అసమ్మతిని ప్రదర్శించలేకపోయాడే. ఇంతకంటె పతనం ఇంకేముంటుంది?

తాను రానని ఎదురుతిరిగిఉంటే? ఏమయి ఉండేది? అక్కడ నడిరోడ్డుమీద దండించి ఉండేవారా? పదిమందీ చుట్టూచేరి ఉండేవారు. అయితేనేం, కొందరు తనను సమర్థించేవాళ్లు మాత్రం ఉండకపోదురా? ఇతరులు సమర్థించడంలో ఏముంది, తనకు తాను సమర్థించుకోనేశక్తి శూన్యమయినప్పుడు.

ఒక్క కఠినమయినమాటయినా అనకుండా తన చిత్తంవచ్చినట్లు నడిపించి తీసుకొని వచ్చారు నాన్నగారు. ఇప్పుడిలా ఎందుకూ పనికిరాని ఆలోచనలు చేస్తూ కూర్చున్నట్టుగానే, నిన్న సాయంత్రం అంతాకూడా తలా తోకా లేని, ఆలోచనలతో మెదడు చించుకొన్నాడుగాని, పనికివచ్చేపని లవలేశమయినా చెయ్యలేకపోయాడు.

టిక్కట్లు తెచ్చేపని తనకే అప్పజెప్పారు నాన్నగారు. అప్పుడు ముందు అనుకొన్నట్టుగా, ఒక్కటే టిక్కట్టు కొని, "నాన్నా! నేను రాలేను, మీరు వెళ్ళండి" అనిఉండవలసింది. ఏమయినాసరే ప్రస్తుతానికి ఈ ప్రయాణం తప్పిపోయిఉండును. ఉమను మరోకమారు చూసివస్తా ననడానికి కూడా నోరు వచ్చిందికాదు. అలా అనకపోయినందువల్ల ఆయన తననేమీ ఎక్కువగా మంచివా డనుకోవడం లేదే.

కొత్తవలసకూడా దాటిపోయింది. చీకటి బాగా కమ్ముకొంటూంది. ఈసరికి పాపం. ఉమ ఏంచేస్తూ ఉంటుందో? ఆమె ఎంత గాభరాపడిందో నిన్న రాత్రంతా రాకపోయినందుకు. ఇక మరి ఆమెగురించి తల్చుకొందికికూడా తనకి అర్హతలేదు. ఇందులో నాన్నగారి ప్రమేయం ఏమీ లేదు. ఆమెకు జరిగిన ఈ అన్యాయానికి పూర్తి బాధ్యత తనదే, తనదే, తనదే—రైలు క్రమం తప్పకుండా ఝుక్ ఝుక్ ఝుక్ అంటున్నట్టుగానే 'తనదే బాధ్యత, బాధ్యత తనదే, తనదే తనదే బాధ్యత' అని లోపలినుండి ఎవరో అంటున్నట్టు వినిపించసాగింది.

కళ్ళలో నీళ్ళు తిరిగాయి—పదిమందిముందను కూర్చొనికన్నీ ళ్ళుకార్చడమేనాతనకర్తవ్యం! ఛీ! ఇంతకంటె గేటుదగ్గరకువెళ్ళి నిలబడడం నయం. కళ్ళల్లో ఏదో నలుసు పడినట్టుగా తుడుచుకొని, కొంచెం సర్దుకొన్నాక మళ్ళీ వచ్చి కూర్చోవచ్చును.

అలమండ స్టేషనూ దాటిపోయింది చిన్నప్పుడు మామయ్యగారి ఊరు వెళ్ళేటప్పుడు ఇలా ఒక్కొక్క స్టేషను దగ్గరపడుతున్నప్పుడు ఎంత ఆనందంగా ఉండేది! ఇప్పుడు ఒక్కొక్క టెలిగ్రాఫు స్తంభం దాటుతున్నకొద్దీ తనకీ ఊరుకీ నడుమ ఏర్పడిన దూరము మరింత ఎక్కువవుతున్నదన్నమాట! కాదు, కాదు, తనుమళ్ళ రావలసిన ఏమంతా నిన్న సాయంత్రం నాన్నగారి ఎదుటపడిన క్షణాన్నే వచ్చేసింది. ఇప్పుడిలా దూరం ఎక్కువవుతున్నకొద్దీ ఆమెకు మరీ దగ్గరపడుతున్నాడేమో భూమికుంద్రనిదికదూ, ఒక దారిని దూరదూరంగా పారిపోవడం అంటే రెండవదారిని సమీపించడం అన్నమాటే కదూ! అవునంతే, అదుగో ఉమ నవ్వుతూ "ఎమిస్కా రాలండీ! ఆఫీసరుగారూ! మమ్మల్నీ ఓ కంట కనిపెట్టాలి సుమండీ" అంటున్నాది...... అదుగో, చేయూచి పిలుస్తున్నాది. వస్తున్నాను, మరేమీ ఆలస్యంలేదు వస్తున్నాను వస్తున్నానిది...

ఆవేళ మెయిలు మరోక అరగంట లేటయింది విజయనగరం చేరుకునేసరికి. గేటుదగ్గర నిలబడి చేతులు పట్టువిడిపోయి, క్రింద పడిపోయిన ఒక ఇరవైఏళ్ళ విద్యార్థికుడయిన యువకుడినిగూర్చి ఆరాత్రి ప్రయాణికు లందరూ బాధపడ్డారు. చాలామంది తమ జీవితాల్లో నే నాటి ఘటనని మరచిపోలే మనుకున్నారు. తర్వాత ఎప్పుడైనా రైలుప్రమాదాల ప్రసక్తి వచ్చినప్పుడల్లా ఈ సంగతినిగూర్చి చెప్పకుండా ఉండలేకపోయేవారు.

2

"క్షమించండి. మరి నేను చేయగలిగిందేమీ లేదు."

"అదికాదమ్మాయి! నీకు జరిగిన అన్యాయానికి నేనే కాదు, మా వాడుకూడా బాధ్యుడే. కాదని నే ననడంలేదు; కాని జరిగిపోయినదానిగురించికంటె, జరగవలసినదానిగురించి ఆలోచించలేవా?"

"నేను దేనిగురించి ఆలోచించినా ఒకటే. రైలుప్రమాదంలో కాలుపోగొట్టు

లేకుండా మీ రాముం స్వయంగా తిరిగి వచ్చి అడిగివుండినా నా సమాధానం ఇంతే. నాలో ఒకప్పుడు అతనికి భార్యకావడానికి లేకపోయిన అర్హత ఇప్పుడెలా వస్తుంది? నమస్కారం! వెళ్ళండి!"

"వెళ్ళలేను — ఏ ముఖం పెట్టుకుని వాడి దగ్గరకు వెళ్ళగలను? ఒక కాలులేని యీ జీవితంకంటె, ఆనాడు వాడుపోయివుంటే నే ఇంత కంటె నయం."

"అవును మరి, చనిపోయినవాళ్ళకి ఎవళ్ళనో అమాయికులను వంచించి తెచ్చి పెళ్ళి చెయ్యనక్కరలేదు."

"వంచన, మోసం, హత్య — నీ యిష్టం ఏమను, అన్నీ భరిస్తాను. అన్నిటికీ నా బాధ్యతను అంగీకరిస్తాను. కాని చూడు, నేను వాడికి తండ్రిని, కేవలం స్వార్థబుద్ధితోనే వాడి సుఖాన్ని అభిలషిస్తున్నాను; అందుకుగాను నిన్ను శక్తికి మించిన త్యాగం చెయ్యమంటున్నాను."

"ఒకరిని త్యాగం చెయ్యమని చెప్పడం సులువే."

"నిజమే, నా వంటివాడికి అంతకంటె మరేమీ చేతకాదు. కాని, నాతో సంబంధం లేకుండా వాడిగురించి కొంచెం వేరేగా ఆలోచించలేవూ? వాడూ కొంచెం అసమర్థుడే అనుకో. అయినా నీ నుంచి వేరయిపోడం ఇష్టంలేక నిండుప్రాణాన్నే బలిపెట్టేడే. అయితే ప్రాణాపాయం కలగలేదు. అదీ దైవసంకల్పమే కావచ్చును. అటువంటివాడిని నువ్వు క్షమించి, ప్రేమించలేవా?

"నా సమాధానం ఏదో నేనిదివరకే చెప్పాను — అనకూడని మాటే గాని, ఆయన మీకు దక్కి ఉండలేదనుకోండి. అప్పుడు ఇక్కడ ఎన్ని పక్కలూ ముక్కలూ పీక్కుతింటున్నాయన్నా సంతోషించి ఊరుకోనేవారే గాని, ఏమయినా సహాయం చేసి ఉండరురా?"

"బాగా అడిగావు. నాలో స్వార్థం తప్ప మరొకటి లేదు. అంగులో నీగురించి నాకు మొదట్లో కలిగిన స్నేహం అంతా ఇంతా నా? అయితే దానితో నీకేం సంబంధం? నా పెద్దవాళ్ళతో ఏ సంపర్కమూ లేకుండా, నీ డబ్బు, నీ యిల్లు అంతా వేరే ఏర్పాటు చేస్తాను. వాడికి వేరే మరెక్కడా పెళ్ళి చెయ్యడానికి పిల్ల దొరక్క నేనిలా ప్రాధేయపడుతున్నాననుకోకు — మా వాళ్ళలో ఇప్పటికీ మేము చేసుకొంటేనే చాలునని చూసేవాళ్లు కావలసినంతమంది ఉన్నారు. అయితే వాడికి నీమీద ఉండే ప్రేమను నేను ఎన్నటికీ మరిచిపోలేని విధంగా గుర్తించి ఉన్నాను. నువ్వు నర్సువయి మానవసేవ చెయ్యాలని కదా అనుకొంటున్నావు — నిన్నొక దేవతగా ఎంచు



ఛాయా చిత్రం

ఫొటో: వసలకృష్ణకుమార్—మద్రాసు.

★ ఒకటీ రెండూ మూడు ★

...నే మనిషికి సేవ చెయ్యడంలో ఆనందం పొందలేవూ?"

"మీరు పెద్దవారు, చాలా బాగా మాటలు చెప్పగలరు. కాబట్టే అంత సులభంగా ఆయనని నాదగ్గరనుండి తీసుకొనిపోగలిగారు. కాని, ఇప్పుడు మీ మాటల నేర్పువల్లా, తెలివితేటలవల్లా ప్రయోజనంలేదు. మనిషికి తా నేమో గొప్పపని చేస్తున్నాననిపించి చెయ్యాలేగాని, ఒకరి బలవంతంవల్ల ఏం చెయ్యబడుతుంది? నేనిప్పుడు మీ మాటలకు లొంగిపోయినా, మనలో ఎవ్వరికీ తృప్తి సంతోషం ఉంటాయని నాకు నమ్మకంలేదు. అయితే మీరు నేను ఆయన్ని నిజంగా ప్రేమించి ఉంటే, ఆయనకోసం ఈ మాత్రం త్యాగం చెయ్యలేనా అన్నట్టు సూచించారు. మీవల్లా ఆయనవల్లా నేను వంచింపబడకుండా ఉంటే, ఒక కాలు కాదు, ఇంకా ఎటువంటి వైకల్యాలు సంభవించినా, ఆనందంగా భరించి, కూలిపని చేసయినా ఆయనని పోషించి సుఖపెట్టి ఉందును. ఇప్పుడు ప్రధానమైన అడ్డంకి అంగవైకల్యం కాదు, నా అనర్హత. మరి మీరు వెళ్లండి. కావాలంటే నేను పోయానని చెప్పండి. లేదా తన ప్రేమకు అర్హత నాలో లేదన్నట్టుగా మీ యిష్టంవచ్చినట్టు కల్పించి చెప్పండి. మీకు నేను అందుకు మాత్రం మాట యిస్తున్నాను-ఎన్నడూ ఇక ముందు నే నున్నానని ఆయనకి తెలియనియ్యను. మరి వెళ్లండి, మీకు మెయిలుకి లేటవుతున్నట్టుంది—"

3

రైలు పెట్టెల్లో తలుపుతీసి అడ్డంగా నిలబడడం సర్వసాధారణంగా జరిగే సంగతే. అయితే అసాధారణంగా ఎప్పుడో ఒకప్పుడు చేతులు పట్టువదిలి, మనుష్యులు ముందుకి తూగి పడిపోవడం తటస్థిస్తుంది. అలాగే మేడమెట్లు మామూలుగా ఎక్కి దిగడానికి ఉద్దేశించినవేగాని, కాలుజారి పడి దొర్లడానికి కాదే. కాక, మెటుమీదనుండి పడిపోయినంతలో ప్రాణాపాయం కలగాలా? ఏమో ఏమిటి చెప్పగలం, ఒక్కొక్కప్పుడు అలా తటస్థిస్తాయి- రైలులోంచి కావాలని కింద పడిన మనిషి అంగవైకల్యంతో బైటపడడం, మెటుమీదనుంచి జారి దొరిపడిన మనిషి మరొక గంటలో నే ప్రాణం పోగొట్టుకోవడమున్నూ—

ఆ సందర్భాలు జరగక పోతే పోవాలిగాని, మొదలయితే వాటికొక అంతు ఉండదు- అంతవరకు ఏమాత్రం సందేహం లేకుండా నిశ్చయించుకొన్న వ్యక్తి తన ఉద్దేశం మార్చుకొని, చనిపోయిన మనిషి ఆత్మశాంతికని అతను చివరి ఘడియల్లో హాస్పిటల్లో కోరిన విధంగా అతని కుమారుణ్ణి పెళ్ళిచేసుకోవడం చూడవడి-ఆ తరువాత వాళ్ళ జీవితాల్లో సంభవించిన సందర్భాసందర్భాలగురించి తెలుసుకునే ఓపిక మనకిలేదు. ★



పిల్లలు కీలుబొమ్మలా?

ఇల్లిందల సరస్వతీదేవి

నలుగురు పెద్దవాళ్లు కలిస్తే పిల్లలనుగురించి ఎట్లా చెప్పుకుంటారు! 'మా పిల్లలు మొండివాళ్ల'ని ఒకరంటే, 'మా పిల్లలు మూర్ఖుల'ని ఇంకొకరు అంటారు. 'మాపిల్లలు గుండెగొయ్య'లని ఒకరంటే 'మాపిల్లలు సోమరిపోతుల'ని మరొకరు అంటారు. తల్లిదండ్రులలో అనేకరకాలు. కొందరు పిల్లలలో లోపాలనుతప్ప మరేమీ కనిపెట్టలేరు. ఒకవేళ స్వల్పముగా కనిపెట్టకలిగినా, వాటిని పైకి చెప్పలేనివారు కొందరు ఉంటారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలలోని అవగుణాలనుగురించి మాత్రమే కన్నెచిన్నెలుగా వర్ణించి చెప్పుకుంటారు. వారికి అది ఒకవిధమయిన సరదా. బుద్ధిమంతులయిన బిడ్డలనుగురించికూడా అల్లరి పిల్లలని ముద్దుగా చెప్పుకొనే ఆనందించే తల్లిదండ్రులు ఉన్నారు.

బిడ్డలనుగురించి తల్లిదండ్రులకు ఏ విధముగా అభిప్రాయాలూ విశ్వాసాలూ ఉంటాయో-తల్లిదండ్రులనుగురించి బిడ్డలకుకూడా అనేకవిధముగా ఉంటాయి. ఈ అభిప్రాయాలు కలగటములో చిన్నా పెద్దా తారతమ్యము అంతగా ఉండదు. మాటలు వచ్చిరాని బిడ్డను 'నాన్న మంచివాడా-అమ్మ మంచిదా' అని ప్రశ్నించితే 'అమ్మ మంచిదికాదు' నాన్న మంచివాడు - అని తనకు చేతనయినట్లుగా వ్యక్తీకరించటానికి ప్రయత్నిస్తుంది. ఈరకమైన అభిప్రాయము తమ అనుభవాలకొద్దీ, పిల్లలు తల్లిదండ్రులనుగురించి ఏర్పరుచుకోగలుగుతారు. వయసు పెరుగుతున్నకొద్దీ బిడ్డల అభిప్రాయాలు అనుభవాలననుసరించి దృఢపడుతూ ఉంటాయి. తల్లిదండ్రులు చెప్పకొన్నట్లే వాళ్లుకూడా తమ మనోగతాలను స్నేహితులతోనూ, సన్నిహితులతోనూ, చెప్పకొంటూ ఉంటారు.

'అదికాదు రంగా! మా నాన్న తెలియక ఇట్లా చేశాడంటావా? తెలిసినా నన్ను ఏడిపించాలని తప్ప మరొకటి కాదనుకో.' అంటుంది సీత.

'పెద్దవాళ్ళంతా ఇంతే సీతా! మా అమ్మ మాత్రము ఊరుకుంటుందంటావా? నేను అందరికంటె పెద్దదాన్ననుకో. నా సంగతి చూడు. పొద్దున్నే కేకలు వేస్తూనే ప్రతి రోజూ అమ్మ నిద్ర లేస్తుందనుకో. రాముడిని లేపు - పాపాయికి గౌను వెయ్యి; నీలకి తల దువ్వు; కోటికి పాలు తాగించు. నాన్నకు పంచ అందివ్వు' అంటూ మొదలు పెట్టుతుంది ఒక్క నిముషము సేపయినా ఆగదు అంటుంది రంగ.

'మా నాన్న ఏం చేస్తాడో తెలుసా!' అంటూ శేషు మొదలు పెట్టుతాడు 'మా నాన్నకు పిల్లలు కంటికి కనబడగానే పని చెప్పాలనిపిస్తుంది. నలుగురు పెద్దవాళ్లు మాట్లాడుకొనేచోటికి పిల్లలు వెళ్ళి నిలబడితే, సరి - మంచినీళ్లు తెమ్మనో - కళ్ళజోడు తెమ్మనో పురమాయిస్తాడు.'

"పని చెప్పగానే చేస్తామనుకో చేసినా చీవాట్లు పడుతునే ఉంటాయి. ఒక్కొక్కనాడు ఊరికే నే అరుస్తూ ఉంటారు" అంటాడు మణి.

"పెద్దవాళ్లు కోప్పడటానికి కారణాలు కనబడవు. మా నాన్న సంగతి చెప్పనా! కచేరీలో ఎవరిమీదనో వచ్చిన కోపాన్ని మామీద చూపెట్టుతూ ఉంటారు"—అంటాడు శేషు.

"సరి! నాన్న అమ్మమీద కోపము చూపిస్తే అమ్మ మామీద చూపిస్తుంది. ఆ నాడు ఇంట్లో నోరు తెరవటానికే భయముగా ఉంటుంది."

"నీవు దీనికి అంటున్నావు కాని-మా అమ్మ

ఏకాదశి ఉపవాసము ఉన్నవాడు మూడాలి. మా పాపాయికి రెండురోజులపాటు దెబ్బలు పడుతూ ఉంటాయి. మాకు సరేసరి. కంటికి కనబడగానే తిట్లు. ఏకాదశి వస్తున్నదంటే మాకు భయము."

"మా యింట్లో ఉపవాసము లేదుగాని- ఎప్పుడూ ఎవరో ఒకరు చుట్టాలు వస్తూఉంటారు. వచ్చిన వాళ్లందరికీ చాకిరి చెయ్యాలి. బడికూడా మానాలి. పరీక్షల్లో మార్కులు సరిగా రాకపోతే నాన్న తంతాడు. ఇంట్లో పని చెయ్యకపోతే అమ్మ తంతుంది. నాన్న 'చదువురాని మొద్దు' అంటే 'పనిచేయలేని బండ'అని అమ్మ అంటుంది."

"మా నాన్న మామయ్యలూ కలిస్తే మా మీదనే చెప్పుకొంటారు. ఊరికే బట్టలు చింపుకొంటారనీ, మాపుకొంటారనీ, పుస్తకాలన్నీ పారవేస్తారనీ ఇవే మాటలు. మా మామయ్య తన కొడుకు పెన్సిళ్లు పోగొట్టుకోవటాన్నిగురించి నాలుగు రోజులు చెప్పగా విన్నాను. వాడు రోజు కొక్క పెన్సిలు పారేస్తాడట. వారానికి రెండు పలకలు పగులగొట్టుతాడట. నా కెప్పుడయినా అడగాలని ఉంటుంది - తాను 'చిన్నప్పుడు పలకలు పగులగొట్టలేదా' అని."

అందరూ అన్నిరకాల సంగతులు చెప్పుతూ ఉంటే రంగరు తన స్నేహితురాలు కనకం సంగతి జ్ఞాపకము వస్తుంది. "అబ్బా! కనకం సంగతి మరీ ఘోరం! మీరు ఎక్కడా అటువంటిసంగతి విని ఉండరు. ఆపిల్లను ఇంట్లో ఉన్నవాళ్ళందరూ ఒద్దిస్తారు. వాళ్లనాన్న మంచి బట్టలు వేసుకోమంటాడు. అమ్మ వద్దంటుంది. వేసుకోకపోతే వాళ్లనాన్న కోపము చేస్తాడు. పెట్టెలోమంచి బట్టలు తీస్తే అమ్మ కొడుతుంది. ఇంట్లో ఒకరు స్నానము చెయ్యమంటారు. తీరా నీళ్ళ గదిలోకి వెళ్లితే మరొకరు వద్దని కేకలువేస్తూ ఉంటారు. అందుకే పాపం-ఏమీ తోచక పిచ్చిదానిలా ఉంటుంది".

ఇట్టువంటివి అనేక రకాలుగా పిల్లలకు తలిదండ్రులనుగురించి అభిప్రాయాలు కలుగుతూ ఉంటాయి. యీ అభిప్రాయాలను కొందరు పిల్లలు తలిదండ్రుల ఎదుట వ్యక్తపరచి చివాట్లు తింటూఉంటారు.

ఈ ప్రశంస వచ్చినప్పుడు చాలామంది 'తల్లిదండ్రులు చెప్పినట్లు బిడ్డలు వినాలిగాని ఎదిరించకూడదు, పిల్లలకు మనము భయపడతామా?' అంటారు.

అవును! తల్లిదండ్రులే పిల్లలకు భయపడాలి. తమయెడ బిడ్డలకు సదభిప్రాయము కలగాలంటే వారితో చాలా మృదువుగా మాట్లాడుతూ వాళ్ళ హృదయాలలో మరొకటి ఆక్రమించుకోకుండా చేయాలి. దీనికి హేతువాదము అనుకూలిస్తుంది.

తల్లిదండ్రులకు శిక్షలు విధేయులుగా ఉండి తీరవలెనన్న పట్టుదలకొద్దీ హేతురహితమయిన ఆదేశాలను ఇస్తూ ఉంటారు. తాము చెప్పినదానిని వెంటనే పిల్లలుచేసితీరవలసినదేనన్న పట్టుదలే వారికి ముఖ్యముగాని తమ ప్రవర్తనయొక్క ప్రభావము పిల్లల మనసుమీద విపరీతముగా పనిచేస్తుందన్న ఆలోచన కలుగదు.

పిల్లలకు వయసుకు తగినట్లుగా సమస్యలు పొటమరిస్తూఉంటాయి. అయిదు ఆరు నెలల పిల్లలకు ఇతరులు ఎవరయినా రమ్మనిపిలిస్తే 'వెళ్లటమా—వెళ్ళకపోవటమా' అన్న దొక సమస్య. తనచేతిలోఉన్న వస్తువును ఇతరులకు ఇవ్వటమా ఇవ్వకపోవటమా అన్నదొక సమస్య. మరి కొంత పెరిగినతరువాత, ఇంటికి ఎవరయినా పిలలువస్తే, 'తనచేతిలోఉన్న బిస్కట్టు వాళ్లకుకూడా పెట్టాలా? పెట్టకపోతే ఏమవుతుంది' అన్నదొక సమస్య. 'తన బట్టలను వాళ్లు ఉపయోగించుకోవటానికి ఇవ్వాలా వద్దా? తన వస్తుసామగ్రి— బట్టలు తనతల్లి ఇతరులకు ఇస్తూ ఉంటే చూస్తూ ఊరుకోవాలా' అన్నదొక సమస్య. మరికొంత పెరిగిన తరువాత స్నేహితులకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయి.

★ పిల్లలు కీలుబొమ్మలా? ★

ఈ భావాలన్నీ అందరిపిల్లలకూ కలుగుతాయా అంటే స్వభావాన్నిబట్టి పరిస్థితులు ఏర్పడుతాయని నిర్ణయించవలసి ఉంటుంది. కొందరికి తల్లిదండ్రులు చెప్పగానే—అదే క్రమముగా కాకపోయినా సలహాగానయినా స్వీకరిస్తారు. కాని కొందరు అవిధముగా స్వీకరించలేరు. 'ఎందుకు ఇవ్వాలి? ఇస్తే తినకేట్లా?' అన్న ప్రశ్నలు వాళ్ళను బాధిస్తూ ఉంటాయి స్వతంత్రముగా యోచించగలిగినవారికే సాధారణముగా ఈవిధమయిన భావాలు ఉదయిస్తాయి ఇటువంటి మానసత్వముగల బిడ్డలకు సామాన్యముగా తల్లిదండ్రులు చెప్పినమాటలు ఏసందర్భములోనూ నచ్చవు; దృష్టికి ఆనవు. ఇటువంటిపరిస్థితులు ఏర్పడినప్పుడు తల్లిదండ్రులు 'ఆ పిల్ల పెంకెపిల్ల — వాడు పెంకెపిల్లడు— చెప్పి లాభములేదు— వాళ్ల యిష్టము ఏమయినా కానీ—ఏంచేస్తాము—ఎవరికర్మ ఎలా ఉన్నదో —' అని నిర్ణయించి - ఆ పరిస్థితులకు వాళ్ళను వదిలి పెట్టటము సాధారణముగా జరుగుతూ ఉంటుంది. కాని పెద్దవాళ్లు తమ అధికారాలను, గౌరవప్రతిపత్తిని దూరముగా పెట్టి, స్నేహభావముతో బిడ్డల మనసులలో ప్రవేశింపగలిగినట్లయితే పిల్లల స్వభావములోని పట్టుదల సడలే అవకాశము ఉన్నదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

మాటవరుసకు, ఆరేళ్ళ పిల్లవాడు ప్రతిరోజూ పాఠశాలకు వెళ్ళేటప్పుడు మోపెడు పుస్తకాలు తీసుకొని వెళ్ళాలంటాడని అనుకుందాము. నిజానికి ఆ మోపెడు పుస్తకాలలోనూ అవసరమయినవి నాలుగో అయిదో ఉంటాయి. కాని—అన్నీ తీసుకొనివెళ్ళాలని పట్టుదల ఈ విధమయిన పట్టుదలకల పిల్లలు తల్లిదండ్రులుగాని మరెవరుగానీ చెప్పింటే వినరు. ఈ సందర్భములో పట్టుదలగల తల్లిదండ్రులు దండించి ఆ పని మాన్పించటానికి సిద్ధపడతారు. కొంతమంది పిల్లలకు దండించినకొద్దీ పట్టుదల ఎక్కువవుతూ ఉంటుంది. కొందరు తల్లిదండ్రులు ఇటువంటి పరిస్థితులలోనూ, ఇటువంటి సమయాలలోనూ అంతగా మనసు నొప్పించరు. కాని నేరిమితో మనము కొన్ని మెట్లుదిగి, ఆ బిడ్డ స్థాయిలో నిలబడి, ఆ విషయాన్ని గురించి కదలిస్తూ, ఏ విధమైన అధికారమూ చలాయించకుండా మనసును ఆకర్షించి, తిప్పటానికి ప్రయత్నిస్తే, కొంతవరకయినా సఫలముకాకపోదని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. మోపెడు పుస్తకాలు నిత్యమూ పాఠశాలకు తీసుకొనిపోవాలని సంకల్పించే బాలుడితో, తల్లిదండ్రులు ఆ రోజే అతడి ఉద్దేశాన్ని పూర్తిగా మార్చాలని ఆశించకుండా క్రమముగా ఫలవంతమయేటట్లు చూడటానికి ప్రయత్నించాలి. 'పాఠశాలకు తీసుకొనివెళ్ళే పుస్తకాలు చాలా ఉన్నట్లున్నాయే' అని మనస్ఫూర్తిగా అన్నట్లు బిడ్డ ఎదుట అనగలిగితే, దాని పరిణామము ఏవిధముగా ఉంటుందో గమనించటానికి వీలు కలుగుతుంది. 'ఆ పుస్తకాలన్నీ నేను సర్దిపెట్టనా?— నేను తీసుకొనిరానా?' అంటూ తోడ్పడటానికి ప్రయత్నము చేస్తున్నట్లు కనుపిస్తే, బిడ్డకు విశ్వాసము ఏర్పడుతుంది కొందరి పిల్లలకు వెంటనే నమ్మకము కలిగినా, కొందరి విషయములో ఆలస్యము జరుగవచ్చు. బిడ్డలకు తమ యెడ నమ్మకమూ విశ్వాసమూ ఏర్పడేటట్లు తల్లిదండ్రులు ప్రవర్తించగలిగితే స్వభావగుణాలను మార్చలేకపోయినా, సంస్కరించటానికి వీలవుతుందని శాస్త్రజ్ఞులు హామీ యిస్తున్నారు. ఈవిధముగా బిడ్డల విశ్వాసాన్ని మనసును స్వాధీనపరచుకొంటే బిడ్డల స్వభావ గుణాలను సంస్కరించటమే కాదు - మంచివారుగా పెరగటానికికూడా అవకాశ మేర్పడుతుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

బిడ్డల మనసు స్వాధీనపరచుకొని వాళ్ళకు ఉత్సాహము కలిగేటట్లు మాట్లాడుతూ, వాళ్ళచేత చిన్న చిన్న పనులు చేయించవచ్చు. ఆ పనులు మనము చెప్పినట్లుగానూ, వాళ్లు చేసినట్లుగానూ కనుపించకుండా, చేయించే నేర్పు తల్లిదండ్రులకు ఉండాలి 'నీవు చేసి తీరాలి - నీవు చేయకపోతే ఊరుకోను'-అన్న బెదరింపులకు బిడ్డల మనసులో కలిగే పరిణామము విప్లవాత్మకమయినదిగా కనబడుతుంది. కొందరిలో, ఎందుకు చేయాలి? నేను చేయకపోతే ఏం చేస్తావు? అన్న ప్రశ్న పరంపరను ఉద్భవింపచేస్తుంది. దీనిని అరికట్టాలంటే తల్లిదండ్రులు తమ ధోరణిని మార్చుకోవలసి ఉంటుంది. పని చేయించదలచుకొంటే 'ఈ పని చేస్తావా? నీవు ఎట్లా చేస్తావో చూస్తాను. నీకెంత వచ్చునో చూస్తాను' అన్న విధానము చెప్పగలిగితే కొనసాగగల మార్గము ఏర్పడుతుంది.

బిడ్డల అభ్యుదయాన్ని కాంక్షించే తల్లిదండ్రులలో శాస్త్రీయదృక్పథము కలవారికి కూడా, అప్పుడప్పుడు బిడ్డలతో అభిప్రాయభేదము కలుగుతూ ఉంటుంది. ఒక బిడ్డకు ఒక రంగు ప్రత్యేకముగా ప్రీతికరమైనదనుకొందాము:- ఆ బిడ్డకు ఆ రంగుబట్టలు ఎప్పుడూ ధరించాలని ఉంటుంది — లేక తరుచుగా ధరించాలని ఉంటుంది. తల్లిదండ్రులు ఆ సందర్భములో నిరుత్సాహపరచి క్రమముగా ఆ అభిరుచిని మార్చటానికి ప్రయత్నించవచ్చుగాని-ఆ రంగు కూడదని పట్టుబట్టి మాన్పించే యత్నము చేయటములో అర్థము యెక్కువగా కనబడదు. కాగా—ఆ రంగు ప్రత్యేకముగా కూడదనటానికి ఏమి కారణము? వస్త్రధారణలో రంగుకు సంబంధించినంత వరకయినా బిడ్డకు వదలిపెట్టి, మనసుకు ఉల్లాసము కలిగించటానికి తలిదండ్రులు ప్రయత్నించటంలో మొత్తమీద లాభం కనబడకపోదు. బిడ్డలకు అన్ని విషయాలు ప్రధానమైనవిగానే కనబడుతాయి అటువంటి పరిస్థితిలో, ఒక విషయములో తల్లిదండ్రులు తమ యిష్టానుసారము నడుచుకొన్నారని గ్రహించిన బిడ్డలు, మరొకదానిలో వారిని సంతోషపెట్టటానికి ప్రయత్నిస్తారు. కనుక ఈ దృష్టితో నిరుపద్రవకరమైన అంశాలలో బిడ్డలకు స్వేచ్ఛ యివ్వటము లాభకరము.

తలిదండ్రులలో చాలామంది బిడ్డల జీవితపథకాలను తమ దృష్టితో—తమ ఆశలతో ఆశయాలతో ముడిపెట్టుతారు. 'జీవితములో ప్రధానాంశాలు, ప్రధానావసరాలు విడిచిపెట్టి, మిగతావిషయాలలో బిడ్డల ఇచ్ఛకు అవకాశము ఎందుకు ఇవ్వరాదు? తమ మనోరథాలను, ఆశయాలను బిడ్డల నెత్తిమీద రుద్దటానికి ఎందుకు ప్రయత్నము చేయాలి?' ఇటువంటివి ఎంతవరకూ సమంజసము? మొదలైన ప్రశ్నలకు సమాధానాలను తల్లిదండ్రులు అన్వేషిస్తూ ఉండాలి. బిడ్డ బుద్ధిమంతుడై, స్వతంత్రతతో బ్రతుకవలెనని ఆశించే తల్లిదండ్రులకు, అతను న్యాయవాదవృత్తి నవలంబించినా, వైద్యవృత్తి నవలంబించినా ఒకటే. ఇంతకూ బిడ్డలు తల్లిదండ్రులచేతిలోని కీలుబొమ్మలు కారు. తల్లిదండ్రులు బిడ్డల అభివృద్ధికి శ్రమించే అవకాశము గల నిమిత్తమాత్రులనుకుంటే అభ్యుదయము కలుగుతుంది. బాగా ఆలోచిస్తే నిరంకుశత్వము బిడ్డలపట్ల ప్రయోజనకారి కాదని తెలియకమానదు. వాళ్ళదగ్గరకూడ గౌరవము ఇచ్చి పుచ్చుకోవాలి గాని, కడుపున పుట్టినవాళ్ళే కదా అని కాలితో తలిపివేయాలనుకోకూడదు. ★

అందమైన విగ్రహం

ఒకరాజు విగ్రహం నడివీధిలో ఎత్తైన గోపురంమీద ఆవిష్కరింపబడివుంది. అతని శరీరం బంగారపుపూత పూయబడి బంగారపు ఆకులతో కూడిన తీగెలు అతని చుట్టు అమర్చబడి వున్నాయి కండ్లలో విలువైన నీలపురాళ్లు పొదగబడినవి. అతని కత్తికి వజ్రాలు పొదిగారు.

ఆ దేశపు ప్రముఖనాయకులు, శాసనసభ్యులు ఆ త్రోవన రావటం సంభవించింది. అందులో ఒక నాయకుడు విగ్రహాన్ని చూపుతూ తనకుగల కళాభిరుచిని తెలియపరచాడు. ఎవరిమనస్సులో వున్న అభిప్రాయాన్ని వాళ్లు వెలిబుచ్చారు.

ఆరోజు పౌర్ణమి. చంద్రుడు వెన్నెల విరజిమ్ముతున్నాడు. పండులాంటి చంద్రుడు కావాలని గగ్గోలుపెడుతున్న 'కుర్రవాడితో "ఎన్నడూ ఏడుపు ఎరుగని అందమైన రాజు విగ్రహాన్ని చూచి ఏడుపు మానలేవు" అన్నది ఒక తల్లి. రాజులకు కూడ కష్టసుఖాలుంటాయని తెలియదు.

ఒక వానకోవిల తన భార్యను ప్రతి సంవత్సరం ఆకురాలు కాలంలో కలుసుకొనేది. కొద్ది రోజులక్రితమే దాని స్నేహితులు, బంధువులు యితరదేశాలకు వెళ్ళిపోయారు, కాని తను తన భార్యను కలుసుకోవలెనను జిజ్ఞాసతో అచ్చటనే వుండిపోయింది. తన భార్య వెంట వస్తుందనే ఆశతో "నేను విదేశాలకు వెళ్ళిపోతున్నాను నాతో వస్తావా?" అని అడింది...

"విదేశాలకు నీతోవచ్చి బాధలు పడలేను, నేను ఇచ్చట నేవుంటాను" అన్నది ఆడకోవిల. తన భార్యకు, తనమీదకంటె, తన సుఖంమీద, తల్లిదండ్రులమీద ఎక్కువ మమకారం వుంది. అందుకొరకే తనతో రానని నిర్మొహమాటంగా చెప్పింది. ఆ జవాబుతో పక్షి మనస్సు పగిలి పదివక్కలైంది. విసిగి, వేసారి, ప్రతి చోట తిరిగి తిరిగి, అలసిపోయి, విగ్రహం దగ్గరవున్న గూటిలో వుండటానికి నిశ్చయించుకొన్నది.

చాలా అందమైన విగ్రహం ఎప్పుడూ చింత ఎరుగని విగ్రహం. బ్రతికివుండగా కష్టాలంటూ ఎరుగని విగ్రహం. అందరినీ పరిపాలించి, చచ్చిన తరువాతకూడ అందరికంటే పైస్థానం అలంకరించిన విగ్రహం... ఎంత అందంగా వుంది అనుకొంటుండగనే ఎక్కడినుంచో ఒక నీటిబిందువు వచ్చిపడింది ప్రశాంతమైన వాతావరణం, ఎచ్చటా మబ్బులు లేవు, వర్షబిందువు తన మీద పడటం ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఇంకొక నీటిబిందువుపడటం జరిగింది. ఎదురుగా యింతవిగ్రహం వుండగా నీటిబిందువులనుండి నన్ను కాపాడలేకపోవటమేమిటి? మూడవ నీటిబిందువు పడటంతో తలపైకెత్తి దీర్ఘంగా విగ్రహాన్ని చూచింది.

కండ్లు ఎర్రగా జ్యోతులవలె కనిపిస్తున్నాయి. కండ్లనుండి వచ్చే నీరు అందమైన బంగారు చెక్కిళ్ళ ద్వారా ప్రవహిస్తున్నాయి. చుట్టు యింత బంగారం, వెండి మొదలగు విలువైన వస్తువులు వుండికూడ ఎందుకు ఏడుస్తున్నాడో అర్థం కాలేదు పక్షికి......ఎవరు నీవు? ఎందుకు ఏడుస్తున్నావు? అని ప్రశ్నించింది పక్షి.

నేను ఒకరాజుని. బ్రతికివుండగా అందరికివలె నాకు హృదయముండేది. బ్రతికివుండగా దుఃఖం కష్టం ఎరుగను. మా కోటలోనికి అలాంటి అసహ్యకరమైన మాటలు వినిపించేవి కావు...కొంతకాలంతరువాత నా భౌతికదేహంమాత్రమే మిగిలింది. దాని చిహ్నంగా యీ

మూలం:
ఆస్కార్ వైల్డ్

అనువాదం:
కందిబండ హనుమంతరావు

ఎత్తైన ప్రదేశంలో ఆవిష్కరించ బడ్డాను. కోటలాంటి అడ్డుగోడ లేకపోవటంతో ఎత్తైన ప్రదేశంలో వుండి అన్ని విషయాలు తిలకిస్తు స్తున్నాను. లోగడవున్నట్లె నిన్నటి వఱకు సంతోషంగానే వున్నాను. కాని, యీ రోజు సాయంత్రం ఒక పూరిగుడిసెలోకి చూచాను. దానిలో ఒక చిన్న పిల్లవాడు జ్వరంతో బాధపడుతూ, మూల నున్న కుక్కిమంచంమీద పండు కొని మూలుగుతూ ప్రక్కనున్న తల్లితో పండ్లు కావాలంటున్నాడు. తల్లికి రెండురోజులనుండి అన్నం లేదు. పిల్లవాడికి మంచినీళ్లకంటే ఎక్కువ యివ్వలేని తన స్థితిని చూచి కుమిలి కుమిలి ఏడుస్తున్నది. వాళ్ళకు ఇప్పుడు డబ్బు చాలా అవసరం. వాళ్ళని చూచి ఏడుస్తున్నాను. నీవు నా కత్తికి వున్న వజ్రాన్ని తీసుకొని యిచ్చినట్లయితే తల్లి చాలా సంతోషపడుతుంది. పిల్లవాడు బ్రతుకుతాడు" అని చెప్పింది విగ్రహం.

"నా బంధువులు, స్నేహితులు కొద్దిరోజులక్రితమే యిచ్చటనుండి వెళ్ళిపోయారు. నేను యీ రాత్రే వెళ్ళిపోవాలనుకుంటున్నాను. అది గాక నాకు పిల్లలంటె మహా చెడ్డ అసహ్యం. కొంతమంది పిల్లలు నామీద రాళ్లు విసరారు, నేను నదీతీరానవున్న చెట్టుమీదవుంటె. ఆపని చేయదలచలేను" అని చెప్పింది నీటికోడి.

కొంతసేపు బ్రతిమాలినమీదట రాజు చెప్పినట్లు అతని కత్తినిగల వజ్రాన్ని నోట కఱచుకొని బయలు దేరింది. త్రోవలో ఒక వుద్యానవనంలో ఎదురుగా ఆభరణాలు ధరించి నృత్యం చేస్తున్న వారినిచూచి ఆనందించేవాళ్ళను చూచింది.... కాక, లోకంలో దుఃఖంలేకుండ ఆనందించేవారున్నారనుకున్నది... నదిదాటి పక్కనున్న పూరిగుడిసెలో ప్రవేశించి తను దెచ్చిన విలువైనవస్తువును వాళ్లకు అందించింది.

వాళ్లు ఆ మణినిచూచి చాలా సంతోషించారని రాజుకు వివరించింది. తెల్లవారింది పక్షి లేచి పోయింది ఆహారంకొఱకు. నదిదగ్గరకుపోయి ప్రయాణికులు యితర దేశాలకు ప్రయాణమై పోవటం చూచి, తన స్నేహితులను చుట్టాలను తలచుకొన్నది. యీ రాత్రికి ఏవిధంగానైన తనవాళ్లదగ్గరికి పోవాలని నిశ్చయించుకొన్నది...

చీకటి పడింది. యథాతథంగా నిన్నటికంటె కొంచెం తక్కువగా వెన్నెలవచ్చింది. తను పోతున్నానని చెప్పటానికి రాజు దగ్గరకు పోయింది. గతించినరోజువలెనే యీరోజుకూడ రాజు కన్నీరు కార్చటం చూచింది. "నేను మావాళ్ళదగ్గరకు పోతున్నాను" అని అన్నది.

"ఈ ఒక్క రాత్రి నాకొఱకు యిచ్చట వుండు" అన్నాడు

"ఏమైనా రాత్నాలు, వజ్రాలు ఎవరికైన యివ్వాలా?" అని అడిగింది.

చూడు!

"మన కెదురుగావున్న చిన్న గదిలో కవి తనశక్తినంతా ధారపోసి ఒక పుస్తకం వ్రాయాలనుకున్నాడు. కొంతవరకు వ్రాసిన తరువాత అతని స్నేహితుడు తన కలం తాను తీసుకొపోయాడు. ఒక వేళ వ్రాసినా దాన్ని ప్రపంచానికి తెలియపరచేశక్తి అతనిలో లేదు. అందుకని నా కంటిలోవున్న నీలపు రాయి తీసుకుపోయి యిచ్చిరా. అతను నీ సహాయాన్ని ఎన్నడూ మరువడు, చిరకాలం నీపేరు చిరస్థాయిగావుండేటట్లు తన పుస్తకంలో వ్రాస్తాడు" అన్నాడు.

రాజు కనిగ్రుడ్డులో రాయి తీయటానికిచాలా బాధపడింది, పక్షి విగ్రహానికి దృష్టిలోపం కలుగుతుందని విచారించింది. రాజు గొప్పతనాన్ని పొగడుతూ కంటిలోనిరాయి తీసుకొని కిటికీలోగుండా కవి గది ప్రవేశించింది. అతనిమేజామీద విలు

★ అందమైన విగ్రహం ★

పైనరాయి ఉంచి, తన రెక్కల సంగీతంతో అతనిని లేపి, తను తెచ్చిన వస్తువు చూపింది. కవి ఎగిరి గంతేశాడు. ఆనందంతో అరిచాడు!

మరునటిరాత్రికూడ అతని ప్రార్థనప్రకారం రెండవకంటిలోని రాయి ఒక బీద విద్యార్థికి యిచ్చివేసింది.

పాపం! విగ్రహం ఇప్పుడు ఏమి చూడలేదు. పగలు రేయి సమానంగానేవున్నాయి. అక్రమాలు అన్యాయాలు ఏమి కనిపించకపోవటం చేత ప్రపంచమంతా ప్రశాంతంగా వున్న దనుకొంటున్నాడు. కొందరిని బీదతనం బాధనుంచి విడదీశాననే సంతృప్తిగా వుంది మనస్సులో. అతడు ఒకళ్ళను చూడటం లేదు కాబట్టి జాలిగాలేదు. కాని అతని దీనావస్థను చూచి జాలిపడేది ఆ పక్షి. అతనిని విడిచి వెళ్ళిపోలేకపోయింది. ప్రతిరోజు సూర్యుడు అస్తమించగనే పక్షి అతని భుజము మీద కూర్చుని తను లోగడ చూచిన వింతలూ, విశేషాలు చెప్పుతుండేది.

ఒకరోజు రాజు పట్టణంలోని విశేషాలు అడిగినందువలన ఆరోజు సాయంకాలం పక్షి తిరిగివచ్చి చెప్పింది: "ధనవంతులు తమ మేడల, మిద్దెలలో హాయిగా, సుఖంగా కాలం గడుపుతున్నారు. బీదవారు వారి గుడిసెలలో నిరాశాజనిత నేత్రాలతో భగవంతుడిచ్చినసంతానాన్ని కాదనలేక దరిద్రం అనుభవిస్తూ నివసిస్తున్నారు" అని పూర్తి చేసింది.

నాచుట్టు వున్న బంగారపు తీగెలు ఆకులు తీసుకొని వెళ్లి బీదవారికి యిచ్చిరమ్మని చెప్పాడు.

కండ్లు పోయినా...... నీ చుట్టు బంగారంపూత పూయబడివున్నది కాబట్టి ప్రజలు నిన్ను చూస్తున్నారు. పొగడుతున్నారు. ఇది లేకపోయిననాడు ఏమీ వుండదు అని పక్షి చెప్పటం విని "నేను చెప్పినట్లు చెయ్యి! ఇది ఆజ్ఞగా భావించు!" అన్నాడు.

పక్షి పలుమారు వక్కాణించలేకపోయింది. రాజు చెప్పినట్లు ప్రతిరోజు తన నోటిద్వారా బీదవారిండ్లలో బంగారపు తునకలు వేసివస్తుండేది. వాటిని చూచి పరవశించేవారు బీదవారు.

తెల్లవారుతుంది. సూర్యుడు మెల్లగా కిరణప్రసారం చేస్తున్నాడు. కోడి కూస్తుంది. పట్టణవాసులు లేస్తున్నారు. పక్షి తన నోటనున్న బంగారపు ఆకు ఒక పూరిగుడిసెలో వేసివస్తుంది. శక్తి పూర్తిగా క్షీణించింది. తూలిపోతుంది. బాధతో మూలుగుతూ విగ్రహందగ్గరకివచ్చి పడిపోయింది "నేను పోతున్నాను" అన్నది పక్షి.

నీవు విదేశాలకు మీ బంధువుల దగ్గరకు పోతున్నావంటె నాకు సంతోషంగా వుంది. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. చివరిసారి నిన్ను చూచేభాగ్యం నాకు లేదు. చేతులతో స్పర్శించి చూస్తాను" అన్నది విగ్రహం.


నేను విదేశాలకు నా బంధువుల దగ్గరకు పోవటంలేదు. నేను చావనే యింటిద్వారం చేరుకుంటున్నా. చావంటె నిద్ర అన్నమాట. ఎక్కువగా చింతపండవలసింది లేదు.

యీమాటలు వినటంతో, విగ్రహంలోపల తెలియనిబాధ ఆవరించింది. ఒక్కక్షణంతరువాత పెద్ద ధ్వనితో విగ్రహంయొక్క హృదయభాగం విడిపోయి క్రిందపడి పగిలి శిథిలమైంది.

విగ్రహం విరిగిపడిన మర్నాడు పురపాలకసంఘం (మునిసిపాలిటి) వారు శాసనసభ్యులు వచ్చారు. విగ్రహం అందంగా కనిపించటం లేదు. ఆ చిత్రకారుని గొప్పతనం వాళ్ళకు కనిపించటంలేదు.

మళ్ళీ కొత్తవిగ్రహం నిర్మింపబడేటందుకు లెక్కలు వేయసాగారు. కంట్రాక్టర్లు ఉద్రూతలూగుతున్నారు విగ్రహాన్ని నిర్మించటానికి. కాని ప్రజాప్రభుత్వంలో రాజులవిగ్రహాలు పనికిరావని అనవసరంగా వాటికొఱకు ప్రజలడబ్బు ఖర్చుపెట్టటం జరగరాదని శాసనసభ్యులు తీర్మానించారు.

పక్షిని, విగ్రహాన్ని ఊరికి దూరంగా పారేశారు. ★



జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒక రోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్నచిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండ గుట్ట కావచ్చుననీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయిఉంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకా ప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్లవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా మరికొందరితో సహా సముద్రంలో పడిపోతారు. సముద్రంలో పడికొట్టుకుపోతూ కొంతసేపటికి ప్రొఫెసర్ అరోనా, కాన్సిల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు.

అనువాదం: "వినాయక"

8

అలాగ మమ్మల్ని అందర్నీ లోపలికి బరబరా ఈడ్చుకుపోవడం అంతా ఒక కనురెప్పపాటులో జరిగిపోయింది. నా సహచరులిద్దరు ఈసంఘటన కేమనుకున్నారో నాకు తెలియదుగాని ఆఘాతంతో నా రక్తనాళాల్లోని రక్తం అంతా ఒక్కసారిగా గడ్డకట్టుకుపోయింది. ఇక మేము జరపవలసిన లావాదేవీలన్నీ ఆ ఓడదొంగలతోనే! అందులో ఏమీ సందేహంలేదు!

నే నా జలాంతర్గామిలోకి దిగేసరికి నా వెనకాల తలుపు ధామ్మని మూసుకుపోయింది. అంతలో నా చుట్టూరా గాఢాంధకారం అలుముకుపోయింది. ఇంతసేపటినించీ వెలుగులో ఉండి హఠాత్తుగా చిమ్మచీకటిలో ప్రవేశించడంవల్ల కొంతసేపటివరకు నాకేమీ అనలేదు! నా కళ్ళు ఇనపనిచ్చెనమెట్లు తగులుతున్నట్లనిపించింది. నెడ్‌లాండు,

కౌన్సెలు నా వెనకాలే వచ్చారు. ఓడదొంగలు వాళ్ళిద్దరినీ గట్టిగా అదిమి పట్టుకున్నారు. ఆ నిచ్చెన కిందికి దిగినతరవాత తిరిగి ఇంకొకతలుపు తెరుచుకుంది. మేము లోపలికి వెళ్లగానే అదికూడా వెంటనే ధామ్మని మూసుకుపోయింది.

మేము ముగ్గురం ఒంటరిగా ఉన్నాము! ఎక్కడ? ఆ ప్రశ్నకెవరికీ సమాధానం దొరకలేదు! ఎంత కన్నుపొడుచుకొన్నా నా చుట్టూరా చీకటి తప్ప ఇంకేమీ కనిపించలేదు.

ఇదంతా చూడగానే నెడ్ లాండు ఒళ్లు మండిపోయింది. రుసరుసలాడుతూ ఇల్లాగన్నాడు:

"ఈ ఓడలోఉండే జనం అంతా మనుష్యుల్ని తినేసే బాపతులాగుందే! అయితే నేనంత సులభంగా లొంగిపోయేఘటాన్ని గాదు!"

కౌన్సెల్ ఇది విని - "తమాయించవయ్యా! తమాయించు! ఇంతకీ మన కిప్పుడు వచ్చిన పెద్ద ఆపత్తేమిటి? ఎందుకలాగ అనవసరంగా తొందరపడతావు?" అన్నాడు.

"ఆపత్తేమీ రాలేదంటావేమిటి? ఒకపక్కనించి కొంప మునిగిపోతూంటేను! ఇదంతా ఏదో ఒక చీకటిగుయ్యారంలా గుంది! అయితే అదృష్టవశాత్తు నా బాకు ఒరలోనే ఉంది. ఎవళ్లైనా కొంచెం చెయ్యి చేసుకున్నారంటే వెంటనే వాళ్ల పని పట్టంచేస్తాను"—

తరవాత నే నతనితో ఇలాగన్నాను:

"అనవసరంగా తొందరపడకు! చెయ్యిజేసుకుంటే తరవాత పశ్చాత్తాప పడవలిసిన పరిస్థితు లేర్పడవచ్చును. మనమాట లెవరైనా వింటున్నారేమో! ఎవరు చెప్పగలరు? ఇంతకీ ఇప్పు డెక్కడున్నామో తెలుసుకున్నాకగదా మనం ఏమి చేసినా?"

అటుపిమ్మట నే నటు ఇటు తడమడం ప్రారంభించాను. అలాగ తడుముతూ నాలుగైదు అడుగులు వేసేనరికి నాకొక ఇనపగోడ తగిలింది. ఇంకొకపక్కకి తిరిగితే ఒక టేబిల్ తగిలింది. దాని పక్కన రెండుమూడు చిన్న బల్లలున్నాయి. మా కాళ్ల అడుగున పీచుతో చేసిన తివాసీలు తగిలాయి గోడలకు కిటికీలున్న సూచనలేవీ కనిపించలేదు. కౌన్సెల్ కూడా ఆ గదిలో అటు ఇటు తిరిగి అన్నీ గాలించాడు. చివరికి ఇద్దరం ఒక చోటికి జేరుకున్నాము. ఆగది పొడవు 20 అడుగులు, వెడల్పు 10 అడుగులు ఉండవచ్చును.

అలాగలాగ ఒక అరగంట దాకా గడిచిపోయినా మా పరిస్థితిలో మార్పేమీ కనిపించలేదు. ఇంతలో హఠాత్తుగా మా గదిలో ఒక పెద్ద వెలుగు వెలిగింది. దానితో మాకళ్లు జిగేలుమన్నాయి! మొదట నే నా వెలుగు భరించలేక కళ్లు మూసుకున్నాను. మొట్టమొదట జలాంతర్గామి చుట్టూ మాకు కనిపించిన వెలుతురు సరీగా అలాగే ఉంది. ఆ వెలుగంతా మా గది తనాబిలో అమర్చిన ఒక అద్దం గుండా లోపలికి ప్రవేశించి దగద్ధగాయమానంగా వెలిగిపోయింది!

నెడ్‌లాండ్ బాకు చేత్తో పట్
కుని ఎవరైనా మీదికివస్తే వాతి
హతమార్చేటట్లుగా సిద్ధంగా ని
బడి ఇలాగన్నాడు:

"ఎలాగయితేనేం ఇంత సేపట్
ఈ గది అంతా చూడడానికి వీల
పడింది!"

"నిజమే! కాని దీనిమూలంగ
మనపరిస్థితి ఏమీ బాగుపడలేదు!

"కొంతకాలం కాస్త ఓపి
పట్టాలి మరి!" అన్నాడు కౌన్సెల్

ఆ వెలుగుమూలంగా నాకాగ
అంతా జాగ్రత్తగా పరిశీలించే అ
కాశం కలిగింది. అక్కడ ఒక బ
దానిచుట్టూ నాలుగైదు చిన్
చిన్నకుర్చీలున్నాయి ఆ సరంగ
లంతా వెళ్ళిపోయిన తరవా
వారు మూసివేసిన తలుపు మరి ఆ
వాళ్లైనా లేనంత గట్టిగా మూసుక
పోయింది. అప్పటినించీ మా క
జలాంతర్గామిలోలో పలి ధ్వన
లేమీ వినిపించలేదు. అసలా జలాం
తర్గామి సాగరగర్భంలో ముని
నడుస్తున్నదో సాగరం పైపైనే తేల
పోతూందో కూడా తెలియలేదు
చివరి కది నడుస్తున్నదో లేదో
కూడా మా కెవరికీ అంతుపట్టలేదు

అయితే ఆ వెలుతురలాగ వెల
దాని కేదో గట్టి కారణం ఉం
తీరాలనీ త్వరలోనే జలాంతర్గామి
నావికు లక్కడికి రావచ్చుననీ ఆశి
చాను. నా ఆశ నిరాశ కాలేదు!

హఠాత్తుగా తలుపు గడియ
తీసిన చప్పుడైంది. వెంటనే తల
పులు తెరుచుకుని ఇద్దరు మనుష
లక్కడ ప్రత్యక్షమైనారు. వారిలో
ఒకడు కొంచెం పొట్టి. చూడడాని
ఉక్కుతునకలాగున్నాడు. జుంజుర
మీసాలు! నల్లని జుట్టు! రెండ

అతడు మిన్ను విరిగి మీదబడినా ఎక్కడా చెక్కుచెదరని మనిషిలా కనిపించాడు. ఇతడు బాగా పొడగరి. విశాలమైన నుదురు. సుమారు 35 సంవత్సరాల వయస్సుండవచ్చును. ఇతన్ని చూసీచూడడంతోనే ఎవరికైనా గౌరవభావం కలుగుతుంది. ముఖంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన వితని నేత్రాలు. అవి అత్యద్భుతమైన దూరదృష్టితో ఎంత దూరంలో ఉన్న వస్తువైనా ఇట్టే పసిగట్టివెయ్యగలవని అనిపిస్తుంది. ఇంతేకాక అతనికి నెడ్ లాండ్ కన్నా బాగా సునిశితమైనదూరదృష్టిఉన్నదని తరవాతజరిగిన విషయాలనుబట్టి స్పష్టపడిపోయింది. అతగాడు కొంచెం అర్ధనిమీలిత దృష్టితో ఒక్క నిమిషంసేపు ఎవరివైపైనా పరీక్షగా చూశాడంటే వారి అంతరాంతరాలన్నీ ఆ క్షణంలో అతనికి అవగాహన అయిపోయాయన్నమాటే! ఆదృష్టితో అతడు సముద్ర గర్భం తిలకించాడంటే సముద్రం అట్టడుగున ఉన్న చిన్న నలుసు కూడా స్పష్టంగా కనబడిపోయిందన్నమాటే!

ఆ ఇద్దరు ఫ్రాన్సు దక్షిణ ప్రాంతాలకుచెందినవారిలాగే కనిపించారు. వారుపెట్టుకొన్న టోపీలు జలజంతువుల చర్మాలతో తయారుచేసినవి. దుస్తులేమో ఒక విచిత్రమైన నారతో తయారుచేసినట్లున్నాయి.

ఆ ఇద్దరిలోను పొడుగుపాటి ఆసామీ మా అందరికేసీ బాగా పరిశీలనగా చూచాడు. అంతేగాని ఒక్క మాటైనా మాట్లాడలేదు. ధోరణి చూస్తే అతడే ఆ జలాంతర్గామి కంతటికీ అధికారి అయి ఉండవచ్చునని అనిపించింది. పిమ్మట అతడు తనపక్కగా నిలబడిన రెండో ఆసామీతో ఏమేమో మాట్లాడాడు. అది ఏభాషో తెలియలేదు. వినడానికి మాత్రం మహా సొంపుగా ఉంది.

రెండో అతడు మొదటిఆసామీ చెప్పినవన్నీ శ్రద్ధగా ఆలకించి అతిముక్తసరిగా సమాధానాలు చెప్పాడు. అయితే అవి మాకేమీ బోధపడలేదు.

రెండో ఆసామీ మాకేసి తిరిగి ఏవేవో ప్రశ్నలడిగాడు. అతని భాష నాకేమీ బోధపడడం లేదని నేను ఫ్రెంచిభాషలో సమాధానం చెప్పాను. నేను చెప్పినదతనికీ బోధపడినట్లు కనబడలేదు. దీనితో మా పరిస్థితి చాలా అస్తవ్యస్తంగా తయారయింది.

“మన పరిస్థితి అంతా మొదటి నించీ పూసగుచ్చినట్టు తెలియజేస్తే కొంచెం లాభం ఉంటుందేమో!” అన్నాడు కౌన్సెల్.

నేను మా కథంతా స్పష్టంగా పూసగుచ్చినట్టు చెప్పడం మొదలు పెట్టాను. పొడుగాటి మనిషి అదంతా చాలా శ్రద్ధగా వింటూన్నట్లే కనిపించాడు. కాని నేనతనికి చెప్పినది బోధపడిన సూచన లేమీ కనిపించలేదు.

అందుచేత ఇక ఇంగ్లీషులో మాట్లాడడంతప్ప వేరే గత్యంతర మేమీకనిపించలేదు. అది ప్రపంచంలో అందరికీ తెలిసేభాష. అదీగాక నాకుకొంచెంజర్మనీభాషకూడా వచ్చును. అయితే అది చదివి అర్థం చేసుకోగలను గాని అంతగా బాగా మాట్లాడలేను. అందుచేత నెడ్ లాండ్ కేసి తిరిగి ఇంగ్లీషుభాషలో మాట్లాడి చూడమని చెప్పాను. అందులో అతని కేమైనా అదృష్టం కలిసిరావచ్చునని నా ఆశ.

నెడ్ లాండ్ మా కథ అంతా మళ్ళీ మొదటినించీ ఇంగ్లీషు భాషలో చెప్పాడు. మేమంతా ఆకలితో నకనకలాడిపోతున్నామని కూడా తెలియజేశాడు. కాని దానివల్లకూడా యేమీ ప్రయోజన కనిపించలేదు. ఆ ఆసామీలను ఫారడే మొదలయిన మహాశాస్త్రవేత్తల

బాలగేయం:

నా పడవ

గందం జోయెల్

అందాల నా పడవ
ఎగిరిపోయింది.
కాగితపు నా పడవ
కదిలి వెళ్లింది

సాగరమ్మును దాట
సాహసించింది.
చేతిలోనుండి యది
జారిపోయింది.

నీలిరంగుల నీటి
మీద నృత్యము సల్పి
మింటి మబ్బుల క్రింద
సొగసుగా నడిచింది.

మా తోటలోనున్న
మల్లెపూలు కొన్ని
మున్నెన్నొ దేశాల
కెగుమతీ చేసింది.

పిల్ల వాయువులోన
పిలుపు లంపించి నే
తిరిగి వచ్చెదనంచు
కబురు పంపింది.

నయనమ్ములో నిలిచి
పయనమ్ము సాగించి,
పెనుగాలి విసరులకు
వణికింది ఒకమారు

అంతలోనే - నీరు
ఆవరించెను - నావ
తల్లక్రిందుగ ఒరిగి
మెల్లగా మునిగింది.

అందాల నా పడవ
తిరుగు నెప్పుడో మరల?
వేయి కన్నులతోడ
ఎదురుచూస్తున్నాను.

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

భాష కూడా బోధపడలేదు! ఆపైన మరి నాకేమీ పాలుపోలేదు.

"తమ రంగీకరిస్తే నేను జర్మనీ భాషలో మాట్లాడి చూస్తాను" అన్నాడు కౌన్సెల్.

"నీకు జర్మనీ భాష కూడా వచ్చునా?"

"ఏదో కొంత మాట్లాడగలను!"

"అయితే శాయశక్తులా ప్రయత్నించి చూడు."

పిమ్మట కౌన్సెల్ జర్మనీభాషలో మాట్లాడి చూచాడుగాని దానివల్ల కూడా పనిజరగలేదు.

తరవాత నేను నాకు వచ్చిన లాటిన్ భాషలో మాట్లాడాను. అయితే అదికూడా పనిలేనిపాట గానే తయారయింది!

అటుపిమ్మట ఆ కొత్తమనుషు లిద్దరూ మాకెవ్వరికీ బోధపడని భాషలో ఏమేమో మాట్లాడుకొన్నారు. వెంటనే వెళ్ళిపోయారు. తలుపు వారి వెనకాలే దఢాలున మూసుకుపోయింది. దానితో నెడ్ లాండ్ ఒళ్లు మండిపోయింది:

"వరసగా ఫ్రెంచి, ఇంగ్లీషు, జర్మన్, లాటిన్ భాషల్లో మన ఘోష అంతా వెళ్ళబోసుకున్నాము గానీ ఆ దరిద్రులు మర్యాదగా రెండు మాటలైనా మాటలాడలేదే!"

"కొంచెం తమాయించు! ఊరికే నోరుపారేసుకోవడంవల్ల లాభమేమీ లేదు!" అన్నాను నేను.

అయినా నెడ్ లాండ్ తగ్గలేదు!

"ప్రొఫెసర్! ఈ ఇనప పంజరంలో మనం అన్నానికి కూడా మొహం వాచి పంచప్రాణాలు విడిచిపెట్టవలసిన అవస్థ పట్టవచ్చును!"

కౌన్సెల్ దీని కెక్కడా చెక్కు చెదరకుండా నెమ్మదిగా ఇలాగన్నాడు: "అయినా మనం ఇంకా చాలాకాలందాకా బ్రతికే అవకాశాలు లేకపోలేదు!"

"ఇదిగో! మనం అంతా ఊరికే కంగారుపడిపోయి కాళ్ళు విరగ దొక్కుకోవడం మూలాన ప్రయోజనమేమీ లేదు! ఈ జలాంతర్గామికి కెప్టెను, నావికులు అంతా ఉంటారు గదా! వాళ్లందర్నీ కలుసుకునే దాకా కొంచెం ఓపికపట్టండి! దయచేసి కొంచెం నా మాట మన్నించండి!" అన్నాను.

"నాకు వాళ్ల సంగతి అంతా ఇంతకుపూర్వమే తెలిసిపోయింది. వాళ్లంతా పరమదరిద్రులు!" అన్నాడు నెడ్ లాండ్.

"అయితే వాళ్లే దేశస్థు లంటావు!"

"పరమదగుల్బాజీ దేశస్థులు!"

"నెడ్ లాండ్! ఆ దేశం మన దేశపటాల్లో ఎక్కడా గుర్తుపెట్టలేదు! తెలిసిందా? వాళ్లిద్దరు ఏ దేశస్థులో నిర్ణయించడం చాలా కష్టం! ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ దేశాలకు సంబంధించినవాళ్లు కారని

(60-వ పేజీ చూడండి)

దైవలిఖితం

ఒకసారి పార్వతీపరమేశ్వరులు, భూలోకంలోని ప్రజల సుఖదుఃఖాలను ప్రత్యక్షంగా చూసి రావడానికి బయలుదేరారు. ఒక్కొక్క వూరూ - అలా చూసుకుంటూ వస్తూండగా, ఒకచోట ఆగవలసివచ్చింది.

అదొక చిన్న పల్లె; ఆ పల్లెచివర ఒక చిన్న దేవాలయం; దాని ప్రక్కగా ఒక తామరగుంట. దానికి సమీపంలో ఓ చిన్న గుడిసె. ఎంతటి చిన్న గాలికైనా ఉన్నపళంగా కూలిపోగలిగినంత దీనస్థితిలోవుందా గుడిసె. ఆ గుడిసె గుమ్మందగ్గిర ముగ్గురు-ఒక భిక్షుక బ్రాహ్మణుడూ, అతని భార్యా, వారి కొడుకూ - బక్కచిక్కిన శరీరాలతో విచారంతో కూర్చుని వున్నారు. ఆ రోజు వాళ్ళకు ఒక్క బియ్యపుగింజైనా భిక్షం దొరకకపోవడంచేత, వారికి ఆ పూట తిండి లేదు. వారి కడుపుల్లో ప్రేవులు ఆకలికి ఆవులించాయి!

సర్వజ్ఞులయిన దేవతలకు ఇవన్నీ తెలియకపోతాయా? ఆ భిక్షుక కుటుంబపు దీనస్థితికి పార్వతీదేవి మనస్సు చివుక్కుమని బాధపడ్డది. మనస్సువుండబట్టక పరమశివుడితో: "ప్రభూ! వాళ్ళెంత దారిద్ర్యం అనుభవించడానికి వాళ్ళేం పాపం చేశారని? పాపం! వాళ్ళెలా బాధపడుతున్నారో చూడండి! ఎందరో భక్తుల కష్టాలను తీర్చిన మీకు, వాళ్ళమీద జాలి కలగడంలేదా?- మీ మనస్సు రాయా యేమిటి?" అంది, కళ్ళనీళ్లు పుట్టుకొస్తూండగా.

"పార్వతీ! ఇందుకు మనం చేయగలిగిందేమీ లేదు. వారివారి విధిలిఖితప్రకారమే, ప్రతిదీ జరిగితీరుతుంది గాని, ఒకవేళ మనం వాళ్లకి సహాయం చేసినా, వాళ్ళ దారిద్ర్యం తీరదు. కాబట్టి, ఇక్కడ వుండడంవల్ల యేం ప్రయోజనం

సి. డి. యస్. రామయ్య

లేదు; రా వెళ్దాం—" అన్నాడు పరమశివుడు.

"ఇవేం మాటలు ప్రభూ... దయాసముద్రులు, సర్వేశ్వరులు అయిన మీవల్ల సాధ్యం కానిదేముంది?—వాళ్ల కష్టాలు కళ్ళారా చూసీ, మనం వాళ్లను రక్షించకపోతే మనకున్న గౌరవమేమిటి?" అంది పార్వతి.

ఆమె మాటలు విని పరమశివుడు నవ్వాడు: "నిజమే పార్వతీ!-కానీ, నిన్ను లోకమాతా, ఐశ్వర్యదాయినీ, దారిద్ర్యనాశనీ అంటూ భక్తులు సేవించుట లేదా? అదీగాక 'శక్తి' లేనిదే శివునకు మహిమ ఎక్కడుంది? నాకున్న మహిమ అంత నీకూ వుందిగా! నీవైతే వెళ్లి, వాళ్ళకేదేనా సహాయం చెయ్యి. విధిలిఖితాన్ని కాదని, సహాయం చేయడం నావల్లమాత్రం సాధ్యం కాదు" అన్నాడు.

పార్వతీదేవికి - ఆ భిక్షుకకుటుంబానికేదేనా సహాయం చేసితీరాలనే పట్టుదల యేర్పడింది. కాబట్టి, శివుడు యెంత చెప్పినా వినకుండా, వాళ్ళవద్దకు బయలుదేరింది.

పార్వతీదేవి ముసలిరూపం ధరించి భూలోకంలోని ఆ గుడిసె వద్దకు వచ్చి, ఆ బ్రాహ్మణుని పిలిచి, "బ్రాహ్మణోత్తమా! మీరనుభవిస్తున్న కష్టాలను చూసి, జాలిపడి, మీకేదేనా సహాయం చేయాలని వచ్చాను. మీలో ఒక్కొక్కరికి ఒక్కొక్క వరం ఇవ్వబోతున్నాను. ఆ వరాలేమిటో మీరు కోరుకొని, వాటిమూలంగా మీ దారిద్ర్యాన్ని పోగొట్టుకుని, హాయిగా జీవించండి" అంది.

తమ కష్టాలను చూసి జాలిపడిన ఆ ముసలామెను - ఎవరో పిచ్చిదై వుంటుందని అనుకున్నాడు బ్రాహ్మణుడు. ఆమెను చూసి "ఎవరమ్మా నువ్వు? మాకున్న కడుపుమంటలు చాలక, నువ్వు వరాలివ్వడానికి వచ్చాననడంకూడా మరొక కడుపుమంటా? నువ్వేం వరాలివ్వనవసరం లేదు గాని, నీ దారిన నువ్వు వెళ్లు!" అన్నాడు.

బ్రాహ్మణుని అలక్ష్యానికి, పార్వతీదేవి కాస్త ఆవేశపడినా, తన పట్టుదలను తీర్చుకోడానికై-"మీరు

నా రూపాన్ని నమ్మలేకపోవచ్చు; కాని, నేనిచ్చే వరాలను నమ్మవచ్చు. ఇదిగో, మీ ఒక్కొక్కరికీ ఒక్కొక్క వరం యిస్తున్నాను. మీరు ఒక్కొక్కరూ మీకిష్టమైనదేదో మనస్సులో తల్చుకుని, పక్కనున్న తామరగుంటలో తల మునిగి లేచారంటే, అది మీకు సిద్ధిస్తుంది" అంది.

"నిజంగానా?" అన్నాడు బ్రాహ్మణుడు.

"సందేహమెందుకూ? నేను చెప్పిన విధంగా చేయండి...ఆ తర్వాత మీకే తెలుస్తుంది" అని చెప్పి అంతర్ధానమయింది పార్వతీదేవి.

ఎదుట మాట్లాడిన ముసలి రూపం వున్నట్టుండి మాయమయ్యేసరికి, ఆ బ్రాహ్మణుడికి ఆవిడమాటల్లో నమ్మకం యేర్పడింది. ఇదంతా భగవంతుడి మాయలీలగానే వుంటుందని, వాళ్లు ముగ్గురూ గ్రహించారు. ప్రాణాలు విడిపోయేటంత ఆకలి వున్నా, దాన్ని లక్ష్యం చేయకుండా, వాళ్లు ముగ్గురూ కలిసి కర్తవ్యమేమిటని ఆలోచించసాగారు. "అదృష్టం మనల్ని వెతుక్కుని వస్తూండగా, నేను రాజుగా యెందుకు కాగూడదు? రాజునైతే రాజ్యాలేలవచ్చు; పెద్దపెద్ద అంతఃపురాలలో హాయిగా వుండవచ్చు. చేతికి అందని ఆనందాలన్నీ అనుభవించవచ్చు" అన్నాడు బ్రాహ్మణుడు. బాగుందన్నారు మిగతాయిద్దరూ.

అంతలో, బ్రాహ్మణుడి కుమారుడు, "నాన్నా!... నువ్వు రాజువైతే, రాజ్యాలేలుదువా, ఆనందాల్ని అనుభవించుదువా? దేశాన్ని, ప్రజల్ని, కాపాడడానికి ఒక సైన్యాధిపతి అవసరం కదా? ఆభారాన్ని నేను తీసుకుంటాను. నువ్వు హాయిగా సుఖాల్ననుభవిస్తూ కూర్చుండవచ్చు" అన్నాడు, తెలివిగా.

"శభాష్! బాగుంది నీ యోచన! ఇప్పటినించీ నువ్వు నా సేనాధిపతివి" అని కొడుకును మెచ్చుకున్నాడు బ్రాహ్మణుడు.

ఇంతవరకూ వాళ్ళ మాటలు వింటూ, వూరక కూర్చున్న బ్రాహ్మణుని భార్య "మీరు రాజుగానూ, అబ్బాయి సేనాధిపతిగానూ కావడం బాగానే వుంది. కాని, నా సంగతేమిటి? - నాకేం తోచడం లేదు" అంది, భర్తతో.

భార్య అమాయకత్వానికి బ్రాహ్మణుడు: "నువ్వా-నువ్వా?- ఓసీ పిచ్చిదానా! ఎంత అమాయకురాలివే! నేను రాజునైతే, నువ్వు రాణివవుతావు! సింహాసనములో నా ప్రక్కన కూర్చొని, అందరిచేతా పనులు చేయించుకునే మహారాణివవుతావు. ఇంకేం తక్కువ నీకు?" అన్నాడు. బ్రాహ్మణుని భార్య ఆనందంతో నిండిపోయింది.

తమ తమ కోరికలను నెరవేర్చుకోడానికి ముగ్గురూ, తామరగుంట వద్దకు చేరారు. ముందట, తనభార్య రాణి కావడం కళ్లారా చూడాలని అనుకున్నాడు బ్రాహ్మణుడు. కాబట్టి, తన భార్య నుద్దేశించి: "ఇదిగో, చూడూ! నీ మనస్సులో-లోకంలోకల్లా అందమైన పడుచుగా మారాలని, రాణినవాలనీ కోరుకుని, నువ్వీగుంటలో తల మునిగి రా!" అన్నాడు. తనకు అందమైన పడుచురూపం రాబోతుందని తలుచుకుని బ్రాహ్మణుని భార్యకు ఒళ్లు పులకరించింది. భర్త మాట ప్రకారమే, మనస్సులో తలుచుకుని, గుంటలో తలమునిగి లేచింది. ఆశ్చర్యం! ఆమె సుందరమైన-పద్ధెనిమిదేళ్ళ వయస్సుగల లావణ్యవతిగా మారిపోయింది. తన భార్య అంత అందవతిగా మారిపోవడం చూసి, బ్రాహ్మణుడూ, వారి కొడుకూ, ఆశ్చర్యపడిపోయారు. ఆమెను వాళ్ళలా చూస్తూ నిల్చున్న సమయంలో-ఎవరూ ఎదురుచూడని విధంగా మరొకటి జరిగింది.

వేటకు వెళ్లి తిరిగివస్తున్న ఆ దేశపు సుల్తాను - ఆసమయంలో అటుపక్కగా వస్తూ-బ్రాహ్మణుని భార్యను చూడడం తటస్థించింది. సాటిలేని రూపవతి ఒకతె కనిపించితే, ఆ సుల్తాను వూరికే వదిలిపెట్టగలడా? - తన సిపాయీలకు - "ఈ సుందరవతి యిక్కడుండడం దేనికీ? మన అంతఃపురానికి తీసుకురండి!" అని హుకుం జారీచేశాడు. బ్రాహ్మణుడు దిగ్భ్రాంతుడయాడు. కనుమూసి తెరచేంతలో, సిపాయీలు ఆ అందాలరాణిని పల్లకీలో కూర్చొనపెట్టారు. ఆమె భయంతో అరుస్తూండగా, సిపాయీలూ, సుల్తానూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

నిమిషంలో జరిగిపోయిన ఈ హడావిడికి, బ్రాహ్మణుడి కళ్ళు చింతనిప్పులై పోయాయి. ఆవేశం అణచుకోలేక, మిగులున్న కరహాలాన్ని మాయబోయాడు. కాని,

అతని కొయ్య అతని తొడమీద పడింది. "ఓహో! నే నింకా తల మునిగి రాజు కాలేదుగదా!" అనుకున్నాడు. కాని అందమైన భార్యను చేజేతులా విదిలించుకోవడంవల్ల అతని మనస్సు వుండబట్టలేకపోయింది. చేసేదిలేక ఆవేశంతోనూ, విచారంతోనూ - భార్యను ఎత్తుకుపోయిన సుల్తానును నోటికొచ్చినట్టు బూతులు తిట్టడం ప్రారంభించాడు. అతని కొడుకూ ఏడవడం మొదలెట్టాడు... భార్య పోయిందన్న విచారంతో - కొంత సేపటికి స్పృహ తప్పి నేలపడిపోయాడు బ్రాహ్మణుడు.

అతర్వాత కొంత సేపటికి బ్రాహ్మణుడు మూర్ఛనుండి లేచాడు. కలలోలాగా జరిగిపోయినదంతా తల్చుకుని - తన భార్యను ఎత్తుకుపోయిన ఆ సుల్తానును చంపి తీరాలనుకున్నాడు. కాని, ఆ సుల్తాను ఎక్కడ? తనెక్కడ? అదెలా సాధ్యం అవుతుంది? అనుకుని ఆలోచించాడు. తను రాజైతే సైన్యాన్ని సేకరించుకుని, సుల్తానుమీద దండెత్తవచ్చుననీ, సుల్తానును చంపి, తన భార్యను తీసుకురావచ్చుననీ అనుకున్నాడు. ఈ విషయంలో అతనికి రామాయణ గాథ జ్ఞాపకం వచ్చింది. ఒకవేళ రాజై సైన్యాన్ని కూడగట్టుకుని, సుల్తానుమీద దండెత్తిన తర్వాత, జయం సుల్తానుకు కలిగి, తనకు అపజయం కలిగితే, తన భార్య గతి ఏమవుతుంది? అనుకున్నాడు. కాబట్టి, తన బుద్ధిబలంతో తప్ప, సుల్తానును మరేవిధంగానూ జయించలేనని తెలుసుకున్నాడు. ఆ ఉపాయమేదో ఆలోచించసాగాడు.

ఆఖరికి మెరపులా ఒక యోచన తట్టిం దతనికి! 'ఒరే, సుల్తాను వెధవా! - ఇదిగో నీ పని పట్టిస్తాను' అనుకుని, ఆ ఆలోచనేదో కొడుకు దగ్గరకూడా చెప్పకుండా, బిరబిరా గుంటలోకి వెళ్ళి, తల మునిగాడు బ్రాహ్మణుడు.

పల్లకీలో తీసుకపోతున్న బ్రాహ్మణుని భార్యను యెన్నో విధాలుగా తన వశం చేసుకోడానికి ప్రయత్నం చేశాడు సుల్తాను. కాని, ఆమె ససేమీరా - ఏడుస్తూ కూర్చుంది. సుల్తాను, తను వేసుకున్న ఒక ముత్యాలహారాన్ని ఆమె మెడలో వేయబోతున్న సమయంలో, బ్రాహ్మణుని భార్య పందిగా మారిపోవడం జరగడంతో - జరిగిన ఈ విచిత్రానికి ఆవేశపడి, "ఇదేమిటి విచిత్రం! సైతాన్!" అంటూ దాన్ని కాలితో తన్ని - పల్లకీనుండి దిగాడు. పల్లకీనుండి నేలపడ్డ పంది, సుల్తానును చూచి ఉరిమింది. దాన్ని అంతటితో వదిలిపెట్టి, సుల్తాను తన సిపాయీలతో వెళ్ళిపోయాడు.

కొంత సేపటితర్వాత, పందిరూపమెత్తిన బ్రాహ్మణుడి భార్య, తనకేసి రావడం చూసి దిగులు చెందిపోయాడు బ్రాహ్మణుడు. 'ఆఖరికి ఈ పందితో నా జీవితం గడపాలని వుందా!' అని విచారించేడు. ఏదో ఆవేశంకొద్దీ, తన భార్యను సుల్తాను నుండి విడిపించుకోవాలనే వుద్దేశంతో - సుల్తానుదగ్గరున్న ఆమె పందిగా మారాలని మనస్సులో కోరుకుని, నీటిలో మునిగాడేగానీ, ఆమె యెప్పుడూ పందిగా వుండవలసివస్తుందని అత నూహించలేకపోయాడు. చేజేతులా చేసుకున్న దానికి విచారపడుతూ కూర్చున్నాడు బ్రాహ్మణుడు.

అప్పుడు బ్రాహ్మణుని కుమారుడు: "నాన్నా! విచారపడకు. ఇప్పుడైనా యేమీ మించిపోలేదు! ఇంకొక వరం నావంతు బాకీ వుంది గదా! దానికి, మొందున్నలాగే అన్నీ మారిపోవాలని కోరుకుని, నేను తలమునుగుతాను" అన్నాడు.

కొడుకు బుద్ధిమతిమాటలకు బ్రతుకు జీవుడా అనుకుని, 'అమ్మయ్యా!' అని నిట్టూర్చాడు. బ్రాహ్మణుని కుమారుడు చెప్పిన విధంగానే కోరుకుని తల మునిగి లేచాడు. పందిరూపంలో వున్న బ్రాహ్మణుని భార్య, పూర్వంలాగా మామూలు బ్రాహ్మణుని భార్యగా

ఏకాకి

(37-వ పేజీ తరువాయి)

కష్టంగా కట్టు ఎంతకాలం నిలబడగలుగుతుంది! ఆమె చిట్టిపాపని మళ్ళీ ఒకసారి చేతుల్లోకి తీసుకుంటూ "ఇదంతా యిలా వుందో చూశావా రఘూ! శ్రీరాముడు శబరిఇంటికి వచ్చాడని చెబుతారు. అలావుంది. మీరు వెళ్ళిపోతున్నారు. నేనేం చెయ్యను! తువ్వాలవ్యాపారంలో ఏం మిగుల్తుంది! అక్కడక్కడికే సరిపోతుంది. ఈ రెండేళ్ళుగా నేను మిగిల్చిందల్లా ఈ కొంగులో ఉంది. ఊరు పొమ్మంటూ, కాడు రమ్మంటూన్న కాలంలో నాకీ బరువెందుకు! తీసుకెళ్ళు. దీంతో మరేం పెద్దగ రాదు. పాపకు మువ్వల కడియాలు చేయించి కాళ్ళకు వేయించు. అది నడిచినప్పుడల్లా మువ్వలు ఘల్లుఘల్లు మంటుంటాయి. అప్పుడల్లా మీరు నేను జ్ఞప్తికొస్తుంటాను. ఈ ముసలితనంలో నన్ను తలచుకునేవాళ్ళు ఒకరిద్దరయినా వున్నారనుకొంటే నేను తృప్తిగా చావగలను" అంటూ కొంగుముడి విప్పి చిల్లర డబ్బుల్ని పాప ఒడిలో పోసింది.

రఘు అమ్మమ్మ దగ్గరనుంచి పాపని తీసుకున్నాడు. సుశీల బామ్మకు నమస్కరించి సెలవు తీసుకుంది. అంతకంతకూ దూరంగా వెళ్ళిపోతున్న ఆ పతీపతుల్ని చూస్తూ కామమ్మ ఆ గుడిసె తలుపుదగ్గరే నిలుచుండిపోయింది.

★

దైవలిఖితం

మారిపోయింది. తన భార్యను మళ్లీ యథాప్రకారం చేజిక్కించుకున్నందుకు సంతృప్తిపడ్డాడు. అప్పటినుండీ వాళ్లు ముగ్గురూ-తీరని దారిద్ర్యంతో భిక్షమెత్తి జీవిస్తూనే వున్నారు.

ఆకాశవీథిలోవున్న పార్వతీపరమేశ్వరులు, బ్రాహ్మణ కుటుంబంలో జరిగిన మార్పులన్నీ చూస్తూనే వున్నారు. ఆఖరికి తను ఇచ్చివచ్చిన వరాలు ఫలించక పోవడం గమనించి, పార్వతి బిక్కమొహం పెట్టింది. "చూశావా పార్వతీ! నువ్వు వాళ్లకు వరాలిచ్చి వచ్చినా, వాళ్లస్థితి ఏమయిందో! వాళ్ల విధిలిఖితం అలా వుంటే - మనం ఏం సహాయం చేసినా అది ఫలించదని నేనప్పుడే చెప్పానా?- ఏదీ విధిలిఖితంప్రకారమే జరిగితీరుతుంది. దాన్ని మార్చడమంటే నీవల్లా కాదు; నావల్ల గూడా గాదు!" అన్నాడు పరమేశ్వరుడు. చెప్పిన మాట వినని పార్వతీదేవి, జరిగిన అవమానానికి కాస్త కోప్పడి "సరేలెండి; ఈ విషయాన్ని మరీ మరీ చెప్పి పొడిపించడం దేనికి!? రండి, పోదాం!" అంది. ★

సాగరగర్భంలోసాహసయాత్ర

(52-వ పేజీ తరువాయి)

మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చును. అయితే, వాళ్ళిద్దరు స్పెయిను దేశస్థులో, టర్కీదేశస్థులో, అరేబియా దేశస్థులో లేక ఇండియా దేశస్థులో అయి ఉండాలి, అంతకన్న నిర్ధారణగా తేల్చిచెప్పడం చాలాకష్టం! ఇంక వాళ్లు మాట్లాడే భాషేమిటో ఏమీ తెలియడంలేదు."

"ప్రపంచానికంతటికీ ఒకే ఒక భాష లేకపోవడంమూలాన ఇలాటి ఇబ్బందులే వస్తూంటాయి." అన్నాడు కౌన్సెల్.

"సరే! దానికేమి గాని వాళ్లంతా మాట్లాడే భాష వాళ్ళలో వాళ్లు కల్పించుకున్న భాషలాగే ఉంది. అయితే ప్రపంచంఅంతటా అర్థం చేసుకునే సంజ్ఞలున్నాయికదా! ఆసంజ్ఞలతో మన ఆకలి సంగతి వాళ్ళకి తెలియజెయ్యవచ్చునే!" అన్నాడు నెడ్‌లాండ్.

"అయితేవాళ్ళకి ఆమాత్రం తెలివితేటలుకూడా ఉన్నట్లు కనబడదే!" అని సమాధానంచెప్పాడు కౌన్సెల్.

అతడు ఆ మాటలు అంటూండగానే గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక నౌఖరు లోపలికి వచ్చాడు. అతని చేతుల్లో చిత్రచిత్రమైన దుస్తులున్నాయి. అవి వాళ్లు ధరించే దుస్తుల బాపతే. మేమంతా వెంటనే అవి ధరించాము. నౌఖరు వెనువెంటనే మా కందరికీ భోజనాలు వడ్డించాడు. ధోరణిబట్టి చూస్తేఅతగాడువట్టి మూగ, చెవిటీ అయి ఉండవచ్చునని అనిపించింది.

ఆ భోజన పదార్థాలు, అన్నీ చూస్తూంటే మేమేదో జమీందారుల హోటల్లో భోజనానికి కూర్చున్నామా? అనిపించింది. భోజన పదార్థాల్లో అతి ముఖ్యమైనవి—రొట్టెలు, వైను మాత్రం లేవు! అంతే! మంచినీళ్ళ సప్లయి కేమీ లోటు లేదు! ఇక మిగిలినవాటిల్లో వేర్వేరు జాతుల చేపలు వండి తయారుచేసిన చిత్ర చిత్రమైన వంటకాలెన్నెన్నో ఉన్నాయి. కొన్ని కొన్ని వంటకాలు చాలా రుచిగా ఉన్నాయి గాని వాటి పే కూడా నాకు తెలియవు. అంత అపురూపమైన వంటకాలవి!


భోజనపాత్రలన్నిటిమీద 'ఎన్ ఆకారంలో ఒక అక్షరం కనిపించింది. బహుశః అది ఆజలాంతర్గా సర్వాధికారిపేరై ఉండవచ్చును.

మొట్టమొదట నెడ్‌లాండు కౌన్సెలు ఇవేవీ తిన్నగాపరిశీలించ లేదు. భోజనపదార్థాలన్నీ అ పనిగా ఆరగించడం మొదలపెట్టారు. కొంతసేపటికి నేనుకూడ ఆ ధోరణిలో పడిపోయాను.

సుష్టుగా భోజనంచేసి కూర్చు సరికి మా కందరికీ నిద్ర వచ్చింది. నా స్నేహితులిద్దరు నేలమీద ప చిన కంబళీమీద పడుకుని హాయిగ నిద్ర పోయారు. నా కంత సులభంగా నిద్రపట్టలేదు. అల్లా కళ్లు తెరుచుకుని కూర్చుని ఆలో చించడం మొదలుపెట్టాను. బుర్రలో ఎన్నెన్నో ప్రశ్నలు బయలుదేరాయి. మేమంతా ఎక్క డున్నాము? ఈ విచిత్రవ్యక్తు లంతా ఎవరు? మా జలాంతర్గామి క్రమక్రమంగా సాగరం అట్టడుగు భాగంలోనికి మునిగిపోతున్నదని అనిపించింది. అటుపిమ్మట నా గుండెల్లో ఏదో పెద్ద బరువు మోపి నట్టయింది. మా జలాంతర్గామి సాగరగర్భంలో నివసించే చిత్రచిత్రమైన జలజీవాలమధ్యనించి వెళ్ళిపో తున్నదని అనిపించింది. క్రమ క్రమంగా నా హృదయం నిమ్మకు నీరెత్తినట్టయిపోయింది. నా భావన నీలినీలి నిద్రాతరంగాలుగా మా పోయింది. నేనాతరవాత హాయిగా గుర్రుపెట్టి నిద్రపోయాను.

—ఇంకా ఉంది.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



కళ్యాణ మండపం (వేలూరు శ్రీ జలకంఠేశ్వర ఆలయం)

—ఫోటో : శ్రీపాద [illegible]

